ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
శుక్రవారం 8, నవంబరు 2024

ఇసుక సీనరేజ్ రద్దు

- ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఇసుక డిపోలు ఏర్పాటు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానంలో ప్రభుత్వం సీనరేజ్, డీఎంఎఫ్, మెరిట్ రుసుమును పూర్తిగా రద్దు చేసిందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం జరిగిన ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రిటైల్/సాధారణ వినియోగదారులు ఎక్కువ మొత్తంలో ఇసుక అవసరమైన వారు జిల్లాలో రీచ్‌లు లేనందున సరిహద్దు జిల్లాల్లో నుంచి ప్రభుత్వం నిర్ణయించిన లోడింగ్ చార్జీలు చెల్లించి అవసరమైన పరిమాణంలో తెచ్చుకోవచ్చని తెలిపారు. చిన్నతరహాలో ఇసుక వినియోగదారుల కోసం జిల్లాలో ఇసుక డిపోలను ప్రైవేటు వ్యక్తులు/ఏజెన్సీల ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు, గిద్దలూరు, మార్కాపురం, పైపాలెం, కనిగిరి, దర్శిలలో ఏజెన్సీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం ఈ ఏజెన్సీల ద్వారా విక్రయాలు చేపడతామని తెలిపారు. ఇసుక స్టాక్‌యార్డులు ఏర్పాటు చేసేందుకు ఏజెన్సీలు ఈనెల 12వతేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వాటిని ఈనెల 14వతేదీ జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమక్షంలో పరిశీలించి ఎంపిక చేస్తామని తెలిపారు.



ఆక్రమణల తొలగింపు

మార్కాపురంలో ప్రధాన రహదారికి ఇరువైపులా మార్కింగ్.. ఆ మేరకు కూల్చివేత 7

చలివేంద్ర కొండపై చిన్నారి మృతదేహం 6



సంతనూతలపాడులో బుధవారం అర్ధరాత్రి భారీగా రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

ఇష్టారాజ్యం

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

జిల్లావ్యాప్తంగా యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా

- ఒకే రోజు రెండు చోట్ల 2వేలకు పైగా బస్తాల పట్టివేత
- అధికారుల దాడుల్లో భారీగా వెలుగుచూస్తున్న అక్రమాలు
- రేషన్‌షాపుల తనిఖీల్లోనూ అనేకం వెలుగులోకి
- కొత్త, పాత వ్యాపారులు కుమ్మక్కై నడిపిస్తున్న దందా
- ఇప్పటికే 20కిపైగా దుకాణాలపై కేసులు

* సంతనూతలపాడులోని మద్దులూరు రోడ్డులో ఉన్న నాగరాజ ట్రేడర్స్ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ ఆదిలక్ష్మి బుధవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. సరుకు విలువ రూ.75లక్షలకుపైనే ఉంటుందని అంచనా. పక్కా సమాచారంతో రైస్‌మిల్లుపై దాడి చేసి అక్కడ బయట వాహనాల్లో లోడ్ చేసి ఉన్న బస్తాలతోపాటు లోపల కుప్పలుగా బియ్యం ఉండడాన్ని గుర్తించారు. వెంటనే డీఎస్‌వో పద్మశ్రీకి సమాచారం ఇచ్చారు. సీజ్ చేసిన బియ్యం బస్తాలను వారికి అప్పగించారు.

* తాళ్లూరు మండలం బొద్దికూరపాడు వద్ద గురువారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ నేతృత్వంలో దాడిచేసిన 400 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

* జిల్లాలో రేషన్ మాఫియా చెలరేగిపోతోంది. ప్రతి నెలా రేషన్ పంపిణీని ప్రారంభించిన వెంటనే అక్రమార్కులు దందాకు తెరలేపుతున్నారు. మొదటి వారంలోనే చాలావరకు బియ్యాన్ని రాత్రికిరాత్రే తరలించేందుకు చూస్తున్నారు. భారీగా సరుకును మిని లారీల్లో తమ రైస్ మిల్లులకు తరలించి బస్తాలు మార్చి వేస్తున్నారు. వాటిని పోర్టులకు పంపుతున్నారు. కొంతవరకు పాలిష్ పట్టి మామూలు బియ్యం మాదిరిగా బయట మార్కెట్‌కు తరలిస్తున్నారు. మొత్తంగా రేషన్ మాఫియా దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ మాఫియా మరింత రెచ్చిపోతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ అక్రమ వ్యాపారం నెలలో మొదటి పక్షం రోజులు మాత్రమే జరుగుతోంది. ఈ సమయంలోనే కోట్లాది రూపాయాల వ్యాపారం జరుగుతుందంటే పరిస్థితి ఏ విధంగా అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చే బియ్యాన్ని అక్రమార్కులు.. ఆదాయ వనరుగా మార్చుకొని మరింత రెచ్చిపోతున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలు చూసుకొని ఇష్టారాజ్యంగా అక్రమ వ్యాపారం చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల పట్టుబడిన ఉదంతాలను గమనిస్తే ఇట్టే అర్థమవుతుంది.

జిల్లావ్యాప్తంగా దాడులు

జిల్లావ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు విజిలెన్స్ అధికారులు రేషన్ దందాపై దాడులు చేస్తుండడంతో అనేక అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. వారంరోజుల వ్యవధిలోనే జిల్లావ్యాప్తంగా సుమారు మూడువేల బస్తాల బియ్యం పట్టుకోవడంతోపాటు పలు రేషన్‌షాపులను తనిఖీలు చేయడంతో వాటిల్లో జరిగిన అక్రమాలతో 20 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారంతో బుధవారం అర్ధరాత్రి సంతనూతలపాడులోని నాగరాజ ట్రేడర్స్‌లో భారీగా రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎస్‌వో పద్మశ్రీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాజ్యలక్ష్మిలు దాడి చేసి 1,624 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు.


గతంలోనూ అదే మిల్లుపై అధికారుల దాడి

ఎస్ఎన్‌పాడులోని మిల్లుపై సెప్టెంబరు 11న విజిలెన్స్ అధికారులు దాడులు చేసి 600 బస్తాలు బియ్యం స్వాధీనం చేసుకోవడమే కాకుండా ఆ మిల్లు నిర్వాహకుడు రాజేష్ గుప్తాపై కేసు నమోదు చేశారు. మళ్లీ ఇప్పుడు అదే మిల్లుపై అధికారులకు అందిన సమాచారంతో దాడిచేయడంతో అక్కడ రేషన్ బియ్యం భారీగా నిల్వలు ఉండటంతో అధికారులు కూడా అవాక్కు అవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ మిల్లు నుంచి ఒకవైపు లారీలతో తరలించేందుకు లోడింగ్ చేయగా, మరోవైపు రేషన్‌బియ్యాన్ని గోతాలు మార్చేందుకు రాసులుగా పోసి పెట్టారంటే

మిగతా 6లో...



బొద్దికూరపాడు వద్ద స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీ



రంగా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, వెంకటేశ్వరరావు, రంగారావు

నిస్వార్థ రైతు నేత ఎన్‌జీ రంగా

- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్
- ఘనంగా జయంతి వేడుకలు
- ఒంగోలులో నివాళి అర్పించిన పలువురు నేతలు

7

అక్రమ మైనింగ్‌లో జిలెటిన్ స్టిక్స్?

- అనుమానం వ్యక్తం చేసిన మైనింగ్, రెవెన్యూ అధికారులు
- అనుమతి లేకుండా ఎలా వచ్చాయన్న దానిపై ఆరా

కురిచేడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర వీరాయపాలెం పంచాయతీ పరిధిలోని 8వ సర్వే నంబరులో కొంతమంది అక్రమంగా మైనింగ్ చేస్తూ వైట్ క్వార్ట్జ్ వెలికితీస్తున్నారు. పెద్ద రాళ్లను పగులకొట్టేందుకు జిలెటిన్ స్టిక్స్ వాడారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సర్వే నంబరులో 517 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని కొంత మంది ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. మరికొంతమంది వైట్ క్వార్ట్జ్ రాయి తీసేందుకు అక్రమ మైనింగ్‌కు తెరలేపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి లోపల నుంచి వైట్ క్వార్ట్జ్ రాయి తీస్తున్నారు. ఈ తవ్వకాలలో పెద్దపెద్ద బండరాళ్లు బయటకు వచ్చాయి. వాటిని పగులకొట్టేందుకు, లోపల నుంచి రాళ్లను పగులకొట్టి బయటకు తీసేందుకు జిలెటిన్ స్టిక్స్‌ను వాడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిలెటిన్ స్టిక్స్ పెట్టి పేల్చేందుకు అనువుగా రాళ్లకు రంధ్రాలు వేసిన ఆనవాళ్లు, వాటిని పేల్చేందుకు వినియోగించిన వైర్లు లభ్యమయ్యాయి.

అక్రమ మైనింగ్ చేస్తే కఠిన చర్యలు

కురిచేడు మండలం పడమర వీరాయ

> **జిలెటిన్ స్టిక్స్ వినియోగం, భద్రపరచడం ప్రమాదకరం**
>
> వైట్ క్వార్ట్జ్ రాయి అక్రమ మైనింగ్ ప్రదేశంలో జిలెటిన్ స్టిక్స్ భద్రపరచే విభాగం ఏదీ లేదు. అక్రమ క్వారీయింగ్ చేయడానికి వాటిని వాడినా, వారికి ఎక్కడ లభ్యం అయ్యాయనేది ప్రశ్నార్థకం. ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు వినియోగించినా మైనింగ్, రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వైట్ క్వార్ట్జ్ రాయిని వెలికితీసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు



పాలెం పంచాయతీ పరిధిలోని 8వ సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్ చేస్తూ తెల్లరాయిని వెలికితీస్తున్న

మిగతా 6లో...



డీసీసీబీలో విచారణ

- రెండోరోజూ కొనసాగింపు
- పలు ఫైళ్లను పరిశీలించిన కమిటీ

ఒంగోలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో కలెక్టర్ నియమించిన ముగ్గురు అధికారుల కమిటీ విచారణ రెండో రోజైన గురువారమూ కొనసాగింది. విచారణ సమయంలో అక్కడ వివాదాస్పదరీతిలో కొందరు ఉద్యోగులు ఉండటంపై బ్యాంకు ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. బ్యాంకు నిర్వహణలో అవినీతి, అక్రమాల ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రాథమిక విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆదేశించిన విషయం విదితమే. తదనుగుణంగా డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో జిల్లా ఆడిట్ అధికారి, ఎల్‌డీఎంలతో కూడిన అధికారుల కమిటీని కలెక్టర్ నియమించారు. వారు బుధవారం సాయంత్రం బ్యాంకును సందర్శించి అటు ప్రభుత్వానికి ఇటు ప్రత్యేకంగా కలెక్టర్‌కు అందిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఫైళ్లను తమ ముందు ఉంచాలని సూచించారు. ప్రధానంగా 2019-24 మధ్యకాలంలో జిల్లావ్యాప్తంగా ఎలాంటి ముందస్తు టెండర్లు లేకుండా రూ.కోటితో సీసీ కెమెరాల కొనుగోలు, బ్యాంకు బ్రాంచిలలో ఆధునికీకరణ పనుల పేరుతో లక్షలాది రూపాయలు స్వాహా, నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు సీఈవోకు ప్రత్యేకంగా సలహాదారు నియామకం, లబ్ధిదారుల సంతకాలను ఫోర్జరీ చేసి నిధులను సొంత ఖాతాకు మళ్లించుకొని బ్యాంకు నుంచి డిస్మిస్ అయిన ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకోవడమే కాక ప్రస్తుతం బ్యాంకు కేంద్ర కార్యాలయంలో సదరు ఉద్యోగి రింగ్ లీడర్‌గా చెలాయిస్తున్న తీరు, మరో డిస్మిస్ అయిన ఉద్యోగికి నిబంధనలను పట్టించుకోకుండా పెండింగ్ పేరుతో వేతనాలను చెల్లింపునకు అధికారుల కమిటీ ఆమోదం, చీమకుర్తి బ్రాంచిలో సుమారు రూ.1.5కోట్లకుపైగా అక్కడి అధికారి స్వాహా చేయగా ప్రధాన కార్యాలయం నుంచి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వంటి పలు అంశాలపై విచారణ కమిటీ దృష్టి సారించినట్లు సమాచారం. ఆయాఅంశాలకు సంబంధించిన ఫైళ్ల పరిశీలనతో పాటు కొందరు ఉద్యోగులను కూడా విచారణ అధికారుల కమిటీ విచారించినట్లు తెలిసింది.

కేన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రపంచ కేన్సర్

మిగతా 6లో...



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

కొండపి చెరువు
కట్టకు రంధ్రాలు

- వైసీపీ ప్రభుత్వంలో కోటిన్నర రూపాయలతో మరమ్మతులు
- అరకొరగా చేసి వదిలేసిన కాంట్రాక్టరు
- మూణ్నాళ్లముచ్చటగా మరమ్మతులు

7



ఇష్టారాజ్యం

(5వ పేజీ తరువాయి)

ఈ వ్యాపారం ఏ విధంగా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఆ మిల్లులోని బియ్యం మొత్తాన్ని మరొక రైస్‌మిల్లుకు తరలించి ఎం.రాజేష్‌గుప్తా, ఎం.శ్రీనివాసులు, చిరంజీవి అనే వ్యక్తులపై అధికారులు 6ఏ కింద కేసు నమోదు చేశారు. కాగా తాళ్లూరు మండలం బొద్దికూరపాడు వద్ద గురువారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని విజిలెన్స్ సీఐ రామారావు నేతృత్వంలో పట్టుకున్నారు. 400 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

అనేక అక్రమాలు వెలుగులోకి..

ఇలా జిల్లావ్యాప్తంగా ఈ వారం రోజుల వ్యవధిలోని మూడువేల బస్తాలకుపైగా అధికారులు పట్టుకున్నారు. చీమకుర్తిలో వంద బస్తాలు, మద్దిరాలపాడులో వంద బస్తాలతో పాటు కనిగిరి, కంభం, మార్కాపురం, దోర్నాల సమీపంలో ఆటోల్లో తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ పంపిణీ ప్రారంభం నాటి నుంచి పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రేషన్ షాపులను తనిఖీలు చేయగా అనేక అక్రమాలు వెలుగులోకి రావడంతో ఆ షాపులపై 6ఏ కేసులు నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా ఆ విధంగా ఈ వారంరోజుల వ్యవధిలోనే 20కి పైగా షాపులపై కేసులు నమోదు అయ్యాయంటే ఈ వ్యాపారం ఏ విధంగా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా రేషన్ అక్రమ వ్యాపారంలో కొత్త, పాత వారు కలిసి యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు.

అక్రమ మైనింగ్‌లో జిలెటిన్ స్టిక్స్?

(5వ పేజీ తరువాయి)

విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అడ్డుకుని ఎక్స్‌కవేటర్‌ను, లారీ స్వాధీనం చేసుకున్నారు. మార్కాపురం మైనింగ్ శాఖకు చెందిన అసిస్టెంట్ జియాలజిస్ట్ పోలిరెడ్డి, టెక్నికల్ అధికారి బాలరాజు గురువారం రెవెన్యూ అధికారులతో కలసి అక్రమ మైనింగ్ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడ ఎంత పరిమాణంలో తెల్లరాయి ఉన్నదీ లెక్కించి కేసు నమోదు చేశారు. లారీ, ఎక్స్‌కవేటర్‌కు రూ.50 వేలు అపరాధ రుసుం విధించారు. అక్రమంగా వెలికి తీసిన వైట్‌క్వార్ట్జ్ 40 మెట్రిక్ టన్నులు ఉంటుందని లెక్కించి రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేశారు. ఆతరువాత ఆ వైట్ క్వార్ట్జ్‌ను వేలం వేస్తామని పోలిరెడ్డి తెలిపారు. మండలంలో అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వారివెంట ఆర్ఐ నాగరాజు, వీఆర్వో ఉన్నారు.

క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

(5వ పేజీ తరువాయి)

అవగాహన దినం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడకుండా ముందుగా ఇంటి వద్దనే స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించి ఆ వ్యాధి బారి నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్యం పొందడం ద్వారా వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ నోటి క్యాన్సర్, సాధారణ క్యాన్సర్, నివారణపై ఈనెల 14న జరిగే ఇంటింటి సర్వేలో 18 ఏళ్లు దాటిన వారందరూ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ జీ.భగీరధి, ఒంగోలు మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమలరావు, హెల్ప్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ.సాగర్, ఫ్లోరోసిస్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.



పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జీవీఆర్ కంపెనీ

జీవీఆర్ ఫ్యాక్టరీలో రెండో రోజూ కొనసాగిన ఐటీ సోదాలు

సింగరాయకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు చెందిన జీవీఆర్ రొయ్యల ప్రాసెసింగ్, ఎక్స్‌పోర్ట్ కంపెనీలో ఐటీ అధికారులు రెండో రోజైన గురువారమూ విస్తృతంగా సోదాలు చేశారు. రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. కంపెనీ లావాదేవీలకు సంబంధించిన కొన్ని కంప్యూటర్లలోని కీలక హార్డ్ డిస్కులను ఆదాయపు పన్నుశాఖ అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం.

చలివేంద్ర కొండపై చిన్నారి మృతదేహం

- చంపి పడేసి ఉంటారని అనుమానాలు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- దర్శి ప్రాంతంలో కలకలం


చలివేంద్ర కొండపైన చిల్లచెట్లలో దొరికిన చిన్నారి మృతదేహం

దర్శి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా దర్శి మండలంలోని చలివేంద్ర కొండపై ఏడు నెలల పసిపాపను చంపి పడేసిన దారుణ ఘటన గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పొదిలి ప్రాంతానికి చెందిన ఓ మహిళ బుధవారం రాత్రి ఆ పాపను తీసుకొని చలివేంద్ర కొండకు వచ్చింది. అక్కడ కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి వద్ద పూజలు చేసి రాత్రి అక్కడే నిద్ర చేయాలని నిర్ణయించుకుంది. ఆలయ నిర్వాహకులు ఆమెకు అక్కడ అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

గురువారం ఉదయం తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు ఆ మహిళ నిద్రలేచి తన పాపతో తిరుగు ప్రయాణమైంది. ఇంత చీకట్లో ఎక్కడకు వెళ్తావని నిర్వాహకులు అడగ్గా, తన భర్త ఫోన్ చేయడంతో వెళ్తున్నానని ఆమె చెప్పింది. దీంతో వారు మిన్నకుండిపోయారు. ఆ తర్వాత ఉదయం 7 గంటలకు కొండ మధ్యలో మెట్ల వద్ద చిన్నారి మృతదేహం కనిపించింది. సత్రంలో పనిచేసే మహిళ పొదల్లో ఉన్న చిన్నారిని చూసి కొండపైన ఉన్న వారికి సమాచారం ఇచ్చారు.

అక్కడ పరిశీలించగా చిన్నారి తల్లి బట్టలు కూడా అక్కడే ఉన్నాయి. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా, దర్శి ఎస్ఐ ఎం.మురళీ హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డీఎస్సీ ఉచిత శిక్షణకు 10న అభ్యర్థులకు స్ర్కీనింగ్ పరీక్ష

- ఒంగోలులో మూడు కేంద్రాల ఏర్పాటు
- అధికారులతో ఏర్పాట్లపై డీఆర్వో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు నగరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్థుల ఎంపికను ఈ నెల 10వ తేదీన చేపట్టనున్నారు. ఇందుకోసం స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఒంగోలులోని మూడు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. డీఎస్సీ పోటీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో కోచింగ్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోచింగ్ సెంటర్లను కూడా ఎంపిక చేసింది. అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం దరఖాస్తులు కోరగా మొత్తం 13,982 దరఖాస్తులు రాగా వీటిలో జిల్లా నుంచి 583 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఈ నెల 10వ తేదీన స్థానిక వెంగముక్కపాలెం రోడ్డులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, పేస్ ఇంజనీరింగ్ కళాశాల, రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కంప్యూటర్ ఆధారిత విధానంలో ఈ స్ర్కీనింగ్ పరీక్ష జరుగుతుంది. ఇందుకోసం హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్లను జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఎస్.లక్ష్మానాయక్ కోరారు. ఎంపిక పరీక్షకు సంబంధించిన అన్ని వివరాలను అభ్యర్థుల సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌ల ద్వారా తెలియజేశామని ఆయన తెలిపారు. హాల్‌టికెట్‌తో పాటు ఒరిజనల్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలన్నారు. ఈనేపథ్యంలో గురువారం సాయంత్రం స్థానిక డీఆర్వో కార్యాలయంలో డీఆర్వో చిన్నఓబులేషు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహించే నిర్దిష్ట సమయానికి అరగంట ముందు మాత్రమే అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతించాలన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జనరేటర్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సాంకేతిక సమస్యలను తలెత్తకుండా సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వైద్యశిబిరం, పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీడీ లక్ష్మానాయక్, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి జగన్నాథరావు, డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, శింగరాయకొండ సీఐ హజరత్తయ్య, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు గరికమిట్టలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- గ్రానైట్‌తో సుందరంగా నిర్మించిన సీతారామంజనేయస్వామి ఆలయం

చీమకుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని గరికమిట్టలో నూతనంగా నిర్మించిన సీతారామంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను ఘనంగా నిర్వహించటానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 7:15 గంటలకు విగ్రహాల ప్రతిష్ఠ, 7:45కు ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయనున్నారు. సీతారామంజనేయస్వామి ఆలయం మొత్తం పూర్తిగా గ్రానైట్ రాయితో సుందరంగా నిర్మించారు. దీంతో ఆలయం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది. మధ్యాహ్నం 12గంటలకు స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని రమణీయంగా జరుపనున్నారు. అయిలావఝ్జులు రామకృష్ణశాస్త్రి, శివకుమార్‌శాస్త్రిల పర్యవేక్షణలో ప్రతిష్ఠాకార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం అన్నదానాన్ని జరపటానికి దేవస్థాన కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కాగా మహోత్సవాల్లో భాగంగా గురువారం విశేషహోమాలు, మహాస్నపనము, ధాన్యాదివాసం, పుష్ప శయాధివాసం, గ్రామోత్సవాన్ని జరిపారు.


గ్రానైట్‌రాయితో నిర్మించిన నూతన ఆలయం


ప్రతిష్ఠామూర్తుల ఊరేగింపులో భక్తులు

సచివాలయ ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్‌ఎం గ్రేడ్-3లకు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు వెంటనే ఫైనల్ సీనియారిటీ జాబితాను ప్రకటించాలని ఏపీ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. గురువారం ఒంగోలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సబ్‌సెంటర్లలో ఎంపీహెచ్ఏ(ఎఫ్) ఖాళీలను ప్రకటించాలని, కొంతమంది ఏఎన్‌ఎంలకు సర్వీస్ మార్కులతో పాటు బోనస్ మార్కులు 15మార్కులు కలిశాయని, ఆ మార్కులు ఎందుకు కలిశాయో వివరణ ఇప్పించాలని కోరారు. సచివాలయాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ జీపీఎస్ ఇంటింటి మ్యాపింగ్ సర్వేలు చేయాలని వత్తిడి చేస్తున్నారని, దీనిని రద్దుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తాళ్ళూరి వెంకటేశ్వర్లు, జి.నాగేశ్వరరావు, వై.సుభాషిణి, కాలం సుబ్బారావు, స్వర్ణలత, వై.సరస్వతి, డి.అనిత, పి.పద్మావతి, ఎన్.సౌభాగ్యం, ఎం.గీత, బి.లక్ష్మి, జె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డిప్యూటీ సీఎంపై సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు

- యువతిని విచారించిన పోలీసులు

ఒంగోలుక్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో ఓ యువతి అసభ్యకరమైన పోస్టింగ్‌లు పెట్టారు. ఈ మేరకు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ముత్యాల కళ్యాణ్ ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల ఒకటో తేదీన కేసు నమోదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు పోస్టింగ్‌లు పెట్టింది ఓ మహిళగా గుర్తించారు. తెలంగాణ రాష్ట్ర నల్గొండకు చెందిన పెద్దిరెడ్డి సుధారాణిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం 41 సీఆర్పీసీ ప్రకారం నోటీసులు ఇచ్చి పంపించినట్లు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.

నేడు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యో తి): మునిసిపాలిటీ, కార్పొరేషన్‌లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ శుక్రవారం ఉదయం పది గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరుగుతుందని డీఈవో కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అన్ని పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలి

మేదరమెట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రహరీలు లేని పాఠశాలకు ప్రహరీలను నిర్మించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని రావినూతల, దైవాలరావూరు, పమిడిపాడు, కొరిశపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కుర్రవానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. రావినూతలలో పాఠశాల రికార్డులను పరిశీలించి పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజన పథకం హాజరును పరిశీలించి, పిల్లలతో కలిసి భోజనం చేశారు. కుకింగ్ ఏజెన్సీలను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంఈవోలు ఎల్.వున్నయ్య, బి.వీ రరాఘవులు, సీఐ మల్లికార్జునరావు, ఎస్‌డబ్ల్యూవో వీరాంజనేయులు, మహిళా కానిస్టేబుల్ శారద ఉన్నారు.


నిత్యావసరాలు పరిశీలించి మాట్లాడుతున్న పద్మావతి


న్యూజిలాండ్ ప్రధాన మంత్రి తో ఎమ్మెల్యేలు ఏలూరి, నరేంద్రవర్మలు

న్యూజిలాండ్ ప్రధానితో ఏలూరి, వర్మ భేటీ

పర్చూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర తెలుగు అసోసియేషన్ న్యూజిలాండ్ ఎన్ఆర్ఐ టీడీపీ వారి ఆహ్వానం మేరకు న్యూజిలాండ్ వెళ్లిన పర్చూరు, బాపట్ల ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, నరేంద్ర వర్మ గురువారం అదేశ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారితో ఏపీ సీఎం చంద్రబాబు విజనరీ లీడర్ అని, ఆయన సారథ్యంలో ఏపీ అభివృద్ధి చెందుతుదని క్రిస్టోఫర్ తెలిపారు. ఏపీకి రావాలని ప్రధానిని ఏలూరి, నరేంద్ర వర్మ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఇక్కడున్న వనరులను వివరించారు. కియా కార్లు ఏపీ నుంచి న్యూజిలాండ్‌కు వస్తున్నాయని కితాబిచ్చారు. అసోసియేషన్ నేతలు మద్దుకూరి దిలీప్, ఆశోక్ గోరంట్ల తదితరులు ఉన్నారు.

ఉపాధి నిధులతో గ్రామాల అభివృద్ధి

చినగంజాం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ నిధుల ద్వారా గ్రామాలు అభివృద్ధి చేసుకోవచ్చునని ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి అన్నారు. మండలంలోని చినగంజాం, కడవకుదురు, గొనసపూడి, సంతరావూరు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 2025-26 సంవత్సరానికి సంబధించి పనులు గుర్తింపుపై గురువారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను, సదుపాయాలను రైతులకు, కూలీలకు వివరించారు.


కేజీబీవీలో కుళ్లిన కూరగాయలను పరిశీలిస్తున్న చైర్మన్

మెనూ ప్రకారం భోజనం అందించకుంటే చర్యలు

- ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

వేటపాలెం/చీరాలటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుంటే సంబంధీకులపై చర్యలు తప్పవని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. చీరాల, వేటపాలెంలో పరిధి, ఈపూరుపాలెంలో ఎలిమెంటరీ స్కూల్, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, దేశాయిపేటలోని ఎంఎల్ఎస్ పాయింట్, ఎండీఎం వాహనం, జాండ్రపేట హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. కేజీబీవీ వంటగదిలో కుళ్లిన కూరగాయలు ఉండడం చూసిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభు త్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. బాధ్యులకు నోటీసులు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏజెన్సీలు తమకు రావల్సిన బిల్లులు పూర్తి స్థాయిలో అందుకుంటూ, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుండా ఉండడం దారుణమన్నారు. పాలు, కూరగాయలు, చికెన్ తదితర పౌష్ఠకాహారాన్ని ఇవ్వకుండా రేట్లు పెరిగాయని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ధరలు తగ్గితే బిల్లులు వెనక్కి ఇస్తారా అని ప్రశ్నించారు. వేటపాలెం హైస్కూల్లో 210 మంది విద్యార్థులు ఉంటే అందుకుగాను 2.10 కిలోల కందిపప్పు వేయాలి. అయితే అక్కడున్న సాంబారులో కనీసం కేజీకి మించి లేకపోవడం తన దృష్టికి వచ్చిందన్నారు. అవకతవకలకు పాల్పడినవారికి హెచ్చరికలతో పాటు నోటీసులు జారీ చేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.


కొబ్బరికాయ కొట్టి ఇంటిని ప్రారంభిస్తున్న యూట్యూబర్ శ్రీదేవి

యూట్యూబర్ పెద్ద మనుసు

- పేదింటి మహిళ ఇంటి నిర్మాణానికి రూ.6.50లక్షల ఆర్థికసాయం
- గృహప్రవేశానికి హాజరైన శ్రీదేవి

మద్దిపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం గార్లపాడు గ్రామంలో నిరుపేద మహిళ ముత్తనపల్లి రమణ ఇంటి నిర్మాణానికి వైజాగ్‌కు చెందిన ప్రముఖ యూట్యూబర్ ఎంఎస్.శ్రీదేవి ఆర్థిక సహాయాన్ని అందజేసి పెద్దమనసును చాటుకున్నారు. గత సంవత్సరం మండలంలోని పలు గ్రామాలలో పలువురు పేదలకు ఆర్థిక సహాయం అందజేసిన శ్రీదేవి గార్లపాడు పునరావాస కాలనీలోని రమణ పరిస్థితిని తెలుసుకున్నారు. ఆమె ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ.6.50 లక్షలు తాను భరించి నిర్మాణ బాధ్యతను గ్రామ సర్పంచ్ దేవరపల్లి గంగిరెడ్డికి అప్పగించారు. ఆ ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో గురువారం శ్రీదేవి దగ్గరుండి గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శ్రీదేవి దాతృత్వానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగిరెడ్డి, గంగయ్య, కాలనీకి చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

గుండ్లకమ్మలో ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు

అద్దంకి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులతో కలిసి సరదాగా ఈత కు వెళ్లిన యువకుడు తేలుకుట్ల నారాయణ, గుండ్లకమ్మ నదిలో గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం బట్లపల్లికి చెందిన తేలుకుట్ల నారాయణ, వేంపాడుకు చెందిన కావూరి ఫిలిప్, కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెంకు చెందిన నేరేళ్ల వెంకటేష్, చిక్కాల భరత్‌నాయుడు గురువారం సాయంత్రం గుండ్లకమ్మ నదిలో తిమ్మాయపాలెం సమీపంలో ఊటబావుల వద్ద సరదాగా ఈతకు వెళ్లారు. తేలుకుట్ల నారాయణ గుండ్లకమ్మ నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మునిగిపోయాడు. ఫిలిప్ కూడా మునిగిపోతుండగా మిగిలిన ఇద్దరు కలిసి బయటకు లాగారు. విషయం తెలుసుకున్న సీఐ కృష్ణయ్య, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. కళ్ల ఎదుటే స్నేహితుడు మునిగిపోవడంతో తల్లడిల్లిపోయారు. నారాయణకు ఏడాది బాబు ఉండగా, భార్య నిండు గర్భిణి. విషయం తెలుసుకున్న కటుంబసభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని వెతుకుతున్నారు.

కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వేటపాలెం(చీరాల), నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : రామన్నపేట సమీపంలోని కాలువలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కన్పించింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం అతని వయస్సు 45-50 సంవత్సరాల మధ్య ఉంటుందని, పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

- గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు

పంగులూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భగవాన్‌రాజుపాలెం ఫ్లైవోవర్ సమీపంలో జాతీయ రహదారిపై ఆటో ఢీకొన్న ఘటనలో పల్లి సాంబశివరావు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు.. ఏలూరు జిల్లా నాగుల దేవరపాడు గ్రామానికి చెందిన పల్లి సాంబశివరావు గురువారం మధ్యాహ్నం విధి నిర్వహణలో భాగంగా హోండాయ్ కారులో ఒంగోలుకు వెళ్తున్నారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం ఫ్లైవోవర్ సమీపంలో కారుదిగి రోడ్డు మార్జిన్‌లో మూత్రవిసర్జనకు వెళ్లి వస్తున్న క్రమంలో అదే రహదారిలో ఒంగోలు వైపు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాంబశివరావు తలకు గాయం కాగా, ఆటో డ్రైవర్, ఆటోలో ఉన్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ముగ్గురినీ చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సాంబశివరావుకు మెరుగైన వైద్యానికి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన ఆటో డ్రైవర్‌ను ఒంగోలుకు తరలించారు. రేణింగివరం పోలీసులు ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాంబశివరావు పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

మహిళపై దాడి కేసు కొట్టివేత

అద్దంకి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహిళపై దాడి చేసిన కేసు ను కొట్టివేస్తూ గురువారం అద్దంకి కోర్టులో తీర్పు చెప్పారు. సంతమాగులూరు మండలం సజ్జాపురానికి చెందిన మహిళ 2010 సెప్టెంబరు 27వ తేదీన పొలంలో పనిచేస్తుండగా అదే గ్రామానికి చెందిన ధూళిపాళ్ల అంజమ్మ, బాపయ్య, పావులూరి శ్రీమన్నారాయణతో పాటు మరో ఐదుగురు కలిసి దాడి చేశారు. దీనిపై అప్పట్లో సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నేరం రుజువు కాకపోవడంతో గురువారం అసిస్టెంట్ స్పెషల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి కేసును కొట్టివేసినట్లు నిందితుల తరపున వాదించిన సీనియర్ న్యాయవాది నాదెండ్ల దశరథరామయ్య తెలిపారు.

కోలలపూడి పొలాల్లో మోటారు వైరు చోరీ

మార్టూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కోలలపూడి గ్రామంలోని పొలాల్లో ఉన్న కరెంట్ మోటార్‌కు ఉన్న సర్వీసు వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. పొలాల్లో కూరగాయలు, మిరప తదితర పంటలు సాగులో ఉండగా ఇలా జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం నీరు పెట్టేందుకు వెళ్లగా వైరు దొంగిలించినట్లు రైతులు గుర్తించారు. సుమారు 20 మందికి పైగా రైతులకు చెందిన పొలాల్లో చోరీ జరిగినట్లు తెలిసింది.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్),నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :మాజీ హోంగార్డు భార్యను వేధిస్తుండడంతో ఆమె ఈపూరుపాలెం పోలీసులను ఆశ్రయించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

చీరాల మండలం కొత్తకావూరివారిపాలెంకు చెందిన పల్లపట్ల లక్ష్మికి సుమారు 9 సంవత్సరాల కిందట బాపట్ల మండలం మచ్చావారిపాలెంకు చెందిన హోంగార్డు శివ మల్లికార్జునరెడ్డితో వివాహం జరిగింది. ప్రస్తుతం వీరికి 04, 02 వయసు గల ఇద్దరు కుమార్తెలున్నారు. అయితే పెళ్లయిన కొద్దికాలం తరువాత భర్త మద్యానికి బానిసై భార్యను వేధించడం మొదలుపెట్టారు. కొంతకాలం తరువాత ఏమి జరిగిందో తెలియదు గానీ హోంగార్డు ఉద్యోగం కూడా పోయింది. తరచూ గొడవలు జరుగుతుండడంతో ఆరు నెలలుగా భార్య లక్ష్మీ పుట్టింటి వద్దే ఉంటోంది. నెలలు గడుస్తున్నా అతనిలో మార్పు రాకపోగా, కాపురానికి కూడా తీసుకు వెళ్లడం లేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భర్త, కుటుంబ సభ్యుల మీద కేసు నమోదు చేశారు.


బజ్జీల వ్యాపారంలో సియోను రాజు

● చదువుకుంటూ పార్ట్ టైమ్ ఉద్యోగాల్లో యువత
● శ్రమే ఆయుధంగా సాగుతున్న సరస్వతీపుత్రులు
● తల్లిదండ్రుల కష్టానికి ఆసరాగా స్వయంకృషి

కాలేజీ లైఫ్ అంటే సరదాలు.. సినిమాలు.. షికారులు.. ఆ లైఫ్ జీవితంలో మరిచిపోలేని మధుర జ్ఞాపకాలు.. చదువుతోపాటు ఆటపాటలు, అల్లరి, ఆనందం... ఇలా కలిసి కొనసాగేదే కాలేజీ లైఫ్. అయితే నేటి తరం యువత తమ భవిష్యత్‌పై ముందే ప్రణాళికబద్ధంగా ముందుకెళుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని గుర్తు చేసుకుని, తమకు విద్యా బుద్ధులు చెప్పించడానికి తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని, తమ కష్టంగా భావించి ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉదయం పూట కాలేజీకి వెళుతూ, సాయంత్రం వేళలో పార్ట్ టైమ్ జాబ్‌లు చేసుకుంటూ 'ఉపాధి.. మా చదువులకు పునాది' అంటూ భవిష్యత్‌కు బంగారు బాట వేసుకుంటున్నారు. ఊహించుకున్న అందమైన జీవితం కోసం, లక్ష్య సాధన కోసం శ్రమనే ఆయుధంగా నమ్ముకున్న స్ఫూర్తి నింపుతున్న సరస్వతీ పుత్రులపై ప్రత్యేక కథనం...

భలే యువకులు!

చదువుకుంటూనే కుటుంబానికి సహకారం

-సియోను రాజు, బీటెక్, 3వ సంవత్సరం

చిన్నప్పటి నుంచి కష్టపడటం చాలా ఇష్టం. ఇంట్లోవాళ్లని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేదు. ఏ పని అయినా చేయడానికి నాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నా. ఎవరు ఏమనుకుంటారో అని ఆలోచించను. ఇంట్లో వాళ్ల సంతోషం ముఖ్యం. చదువుకుంటూనే ఆణిముత్యం నాన్‌వెజ్ పచ్చళ్ల తాయారీ చేస్తూ సంపాదిస్తున్నాను. దాంతోపాటు ఇంట్లోవాళ్లకి ఆర్థిక సహకారం అందిస్తూనే, నా ఫీజులు నేను కట్టుకుంటున్నా. కొద్ది రోజులు పార్ట్‌టైమ్‌గా జొమోటో, స్విగ్గీలో కూడా పని చేశాను. ఇప్పుడు సాయంత్రం పూట ఇంటి దగ్గరే టిఫిన్ సెంటర్ పెట్టుకున్నాను.

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్ వరకు చదివే విద్యార్థులు ఉన్నారు. అందులో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి హాస్టళ్లలో చదువుకునేవారు కొందరు ఉండగా, ప్రైవేటుగా నలుగురు స్నేహితులతో కలిసి రూములు తీసుకుని ఉంటున్నవారు కొందరు ఉన్నారు. గ్రామీణ నేపథ్యంలో అంటేనే తల్లిదండ్రులు వ్యవసాయాన్ని ఆధారం చేసుకుని కుటుంబాన్ని పోషించేవారు. తమ బిడ్డలు తమలా కాకుండా, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నతంగా ఉండాలన్న వారి కోరిక మేరకు... ఉన్న ఊరు కాదని పట్టణాలకు, నగరాలకు పంపిస్తుండగా కొందరు యువకులు మాత్రం తమ తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చేందుకు తమ సరదాలు, షికార్లకు ఫుల్‌స్టాప్ పెట్టేస్తున్నారు. తమ చదువుకయ్యే ఖర్చు కుటుంబానికి భారం కాకూడదని ఏదో ఒక ఉపాధి చూసుకుని ముందుకు సాగుతున్నారు.

అందుబాటులో ఉపాధి అవకాశాలెన్నో..

ఒంగోలులో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. సాఫ్ట్‌వేర్ వంటి పెద్ద కంపెనీలు లేకపోయినా, మెగా షాపింగ్ మాల్స్, మార్ట్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఫ్లిప్ కార్ట్, ఈ కార్ట్, అమేజాన్, స్విగ్గీ, జొమోటో వంటి ఆన్‌లైన్ సంస్థలు యువతకు బాసటగా నిలుస్తున్నాయి. కొందరు యువకులు కాలేజీకి వెళుతూ సెలవు రోజుల్లో పార్ట్‌టైమ్ జాబ్‌చేస్తూ సంపాదించుకుంటున్నారు. కొందరు సాయంత్ర వేళలో మెడికల్ షాపుల్లో, పుల్కా బండ్ల వద్ద, పాల ప్యాకెట్‌లు వేస్తూ ఇలా వివిధ రంగాలను ఎంచుకుని తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నారు.

చదువు కుటుంబానికి భారం కాకూడదని..

మాది సొంతూరు కనిగిరి. ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చాయి. ఉన్నత చదువులకు ఒంగోలు వచ్చాను. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. చదువుకుంటూనే భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నాను. డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి సాయంత్రం వేళ పార్ట్ టైమ్‌గా పనిచేస్తూ సంపాదించుకుంటున్నాను. నెలకు సుమారు రూ.6వేలు వస్తాయి. ఇక్కడ మా అక్కవాళ్ళ ఇంట్లో ఉంటూ ఉదయం కాలేజీకి వెళుతూ, సాయంత్రం పుల్కా బండి వద్ద పనిచేస్తున్నాను. అమ్మా, నాన్న వాళ్లకి ఆర్థిక ఇబ్బంది లేకుండా కష్టపడు తున్నాను.

- ఆర్. రవికిరణ్, డిగ్రీ ఫైనల్ ఇయర్



భవిష్యత్‌కు బాటలు

- సిహెచ్. మణి, బీటెక్, 3వ సంవత్సరం

మాది వినుకొండ దగ్గర చిన కంచర్ల గ్రామం. ఒంగోలులో బిటెక్ చదువుతున్నాను. పగలంతా కాలేజీకి వెళతాను. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మెడికల్ షాపులో పనిచేస్తున్నాను. ఖాళీ సమయాన్ని వృథా చేసుకోకుండా పనిచేయడం ద్వారా కాలేజీ ఫీజులు, సొంత ఖర్చులతోపాటు, మెడికల్ రంగంలో అనుభవం వస్తుంది. కష్టపడడం నేర్చుకుంటే జీవితంలో సుఖపడతామని నమ్ముతాను.




దోర్నాల బస్టాండ్ సమీపంలో ఆక్రమణల తొలగింపు

ఆక్రమణల తొలగింపు

మార్కాపురంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ముందుగానే మార్కింగ్
కాలువ దాటి వచ్చిన నిర్మాణాలు కూల్చివేత

మార్కాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించే ప్రక్రియకు అధికారులు గురువారం శ్రీకారం చుట్టారు. రోడ్డు అంచుల వెంబడి ఉన్న మురుగు కాలువలను దాటి నిర్మించిన కట్టడాలు, బడ్డీకొట్లు తదితరాలను తొలగించారు. 20 రోజుల క్రితమే ఆక్రమణదారులకు మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు నోటీసులు అందజేశారు. ఎక్కడికక్కడ మార్కింగ్‌లు కూడా ఇచ్చారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో వాటిని తొలగించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. భారీగా పోలీసు బందోబస్తు నడుమ తొలుత స్థానిక కళాశాల రోడ్డులోని ఆర్టీసీ డిపో నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, మార్కాపురం సీఐ సుబ్బారావు దగ్గరుండి అప్పటికే మార్కింగ్ ఇచ్చిన ప్రదేశం వరకు నిర్మాణాలను తొలగించారు. సుమారు 10 వరకు ఎక్స్‌కవేటర్లను ఒక్కసారిగా వినియోగించారు. రోడ్డుకు ఇరువైపులా ఎక్స్‌కవేటర్లతో తొలగింపు పనులు చేపట్టారు. కొన్నిచోట్ల చిన్నచిన్న ప్రతిఘటనలు ఎదురయ్యాయి. స్థానిక లక్కీ షాపింగ్ మాల్ వద్ద ఉద్యోగులు కొద్దిసేపు ఆందోళనకు దిగారు.


లక్కీ షాపింగ్‌మాల్ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

పోలీసులు వారిని అక్కడ నుంచి పంపించి వేశారు. ఆర్టీసీ డిపో నుంచి పూలసుబ్బయ్య కాలనీ వరకు, కంభం బస్టాండ్ నుంచి శ్రీనివాస థియేటర్ వరకు ఆక్రమణలు తొలగించారు. రాజకీయ జోక్యానికి ఎక్కడా అవకాశం ఇవ్వలేదు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డీఎస్పీ యు.నాగరాజు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. క్షేత్రస్థాయిలో తిరిగి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆక్రమణల తొలగింపు కార్యక్రమం శుక్రవారం కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం

● ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ● చినారికట్లలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన

కొనకనమిట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్కరణలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని చినారికట్ల గ్రామంలో గురువారం 132-33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చినారికట్ల గ్రామంలో నిర్మించనున్న ఈ సబ్‌స్టేషన్‌తో కొనకనమిట్ల, పొదిలి, మర్రిపూడి, కనిగిరి, హనుమంతునిపాడు మండలాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారన్నారు. గ్రామాల్లో ఎన్నో సంవత్సరాలుగా ఉన్న సమస్యలు తీరనున్నట్లు తెలిపారు. తొలుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో 13 విద్యుత్ సబ్‌స్టేషన్‌లు వర్చువల్‌గా బటన్ నొక్కి ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రజలు, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు వీక్షించారు.


చినారికట్లలో 132-33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందుల, కలెక్టర్ అన్సారియా

అనంతరం కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి 132-33 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పాలగిరి శ్రీనివాసులు, పొదిలి, కొనకనమిట్ల టీడీపీ మండలాధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, మోరబోయిన బాబూరావు, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్, టీడీపీ నాయకులు కుందురు కాశిరెడ్డి, ముప్పా కాటంరాజు, తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కొండపి చెరువు కట్టకు పగుళ్లు


చెరువు కట్టకు ఏర్పడ్డ పగుళ్లు

● వైసీపీ ప్రభుత్వంలో కోటిన్నరతో మరమ్మతులు
● అరకొరగా చేసి వదిలేసిన కాంట్రాక్టరు
● మూన్నాళ్లముచ్చటగా పనులు
● వర్షాలకు మరింత దెబ్బతిన్న కట్ట

కొండపి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని పీడబ్ల్యూడి చెరువు కట్ట మరమ్మతులు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. రెండేళ్ల తిరక్క ముందే కట్టకు భారీగా పగుళ్లిచ్చాయి. ఈ చెరువుకు గత వైసీపీ ప్రభుత్వంలో దాదాపు కోటీ యాభై లక్షల రూపాయలతో కట్ట, అలుగులు, తూములు, కాలువలు మరమ్మతులు చేశారు. అవి సరిగా చేయకపోవడంతో ఆ నిధులన్నీ బూడిదలో పోసిన పన్నీర య్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు కట్టపై గోతులు, పగుళ్లు ఏర్పడ్డాయి. క్రమక్రమంగా పెద్దపెద్ద రంధ్రాలుగా తయారయ్యాయి. కొండపి వైపు ఉన్న కట్టకు మూడు చోట్ల ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతుల పేరుతో దోపిడీ

చెరువు కట్టకు మరమ్మతుల పేరుతో కాంట్రాక్టరు, అధికారులు నిధులు స్వాహా చేశారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మరమ్మతుల సమయంలో చెరువు కట్టకు రివిట్‌మెంట్ చేయలేదు. గతంలో కట్టకు లోపలి భాగంలో కట్ట పొడవునా రాళ్లు పెట్టి సిమెంటు చేసి ఉండేది. ఆ రాళ్లను తీసి చెరువులో కుప్పలుగా పోశారు కాని, కట్టకు పేర్చలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు కట్టకు రంధ్రాలు, పగుళ్లు ఏర్పడ్డాయి. కాల్వలు కూడా మరమ్మతు చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. దీంతో కట్టపైన, కాలువల్లో చిల్లచెట్లు పెరిగి మూసుకుపోయాయి. ప్రధానంగా చెరువు కట్ట పైభాగం గతంలో దాదాపు నాలుగు అడుగుల వరకు వెడల్పు ఉండేది. ఇపుడు చిల్లచెట్లు, పిచ్చిచెట్లతో మూసుకుపోయి కాలిబాట మాత్రమే మిగిలింది. అందులో కూడా నడిచి వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా చెరువు మరమ్మతులు సక్రమంగా చేయకపోవడాన్ని రైతులు ఆక్షేపిస్తున్నారు. చెరువు కట్టపై, కాల్వల్లో జంగిల్ క్లియరెన్స్ చేయాలని, చెరువు కట్టకు పడ్డ పగుళ్లను, రంధ్రాలను మూయాలని కోరుతున్నారు.


కట్ట రివిట్‌మెంట్‌కు వాడాల్సి ఉండగా వృథాగా పడేసి ఉన్న రాళ్లు

నిస్వార్థ రైతు నేత ఎన్‌జీ రంగా

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ● ఘనంగా జయంతి వేడుకలు

ఒంగోలు(రూరల్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు, కూలీలు, వివిధ వృత్తుల వారి సమస్యల పరిష్కారం కోసం ప్రపంచస్థాయిలో ఉద్యమాలు చేపట్టిన నిస్వార్థ నాయకుడు ఆచార్య ఎన్‌జీరంగా అని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కొనియాడారు. గురువారం ఒంగోలులోని ఎన్‌జీరంగా భవన్‌లో ఆచార్య ఎన్‌జీ రంగా 124 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద గల ఎన్‌జీరంగా విగ్రహానికి ఎమ్మెల్యే దామచర్ల, రైతు సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో దామచర్ల మాట్లాడుతూ దళితులు, రైతుకూలీలు, చేనేతలు, చేతివృత్తుల వారు ఆర్థికంగా ఎదిగేందుకు చట్టాలు తేవాలని పార్లమెంట్‌లో ఎన్‌జీరంగా పోరాడారని తెలిపారు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువులు చదివి నాటి మద్రాసులో అర్థశాస్త్రంలో ప్రొఫెసర్‌గా పని చేశారని చెప్పారు. మహాత్మా గాంధీ పిలుపుతో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని పలు సందర్భాల్లో జైలు జీవితం కూడా గడిపారని వివరించారు. పార్లమెంట్‌లో సుదీర్ఘకాలం పార్లమెంటేరియన్ పని చేసిన ఘనత ఆయన సొంతమన్నారు. రంగా ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ఎన్‌జీరంగాభవన్ కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ ఆచార్య రంగా సేవలను, పోరాటాలను గుర్తించి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో పేరు నమోదు చేశారని చెప్పారు. ఆల్ ఇండియా కిసాన్ సంస్థను ఏర్పాటు చేసి రైతులు సమస్యలు పరిష్కరించటానికి పోరాటాలు చేశారన్నారు.


బాచిన నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, నాయకులు

జమిందారీ జాగీరితనానికి వ్యతిరేకంగా పోరాడారని అని తెలిపారు. అనంతరం పలువురిని సత్కరించారు. ఉత్తమ రైతుగా పాతూరి కోటేశ్వరరావు, కరవది సొసైటీ సీఈవో బొద్దులూరి రామాంజనేయులు, పాల ఉత్పాదారుల కేంద్రం అధ్యక్షుడు బాచిన నాగేశ్వరరావు, ఎత్తిపోతల సంఘం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు, వ్యవసాయ శాస్త్ర విద్యార్థి నట్టె వీరవెంకట సూర్యదీపిక, వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థి కుంచెపు గంగోత్రి, ఉత్తమ పొగాకు రైతు మేకల కృష్ణారెడ్డిలను శాలువాలు, జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేసి ఘనంగా సన్మానించారు. ఎన్‌జీ రంగాభవన్ అధ్యక్షుడు ఆళ్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు నాగినేని అవనీంద్రప్రసాద్, పమిడి వెంకట్రావు, బాలిన రామసుబ్బారావు, కామేపల్లి శ్రీనివాసరావు, చుండూరి రంగారావు, మండవ శ్రీనివాసరావు, డాక్టర్ చుంచు చలమయ్య, పోలవరపు వెంకట్రామయ్య, చుండూరి నాగేశ్వరరావు, మారెళ్ల రామకృష్ణ, మండవవారిపాలెం సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మెనూ మెరుగ్గా అమలు చేయాలి

● అధికారులకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి ఆదేశం
● ఒంగోలులో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల తనిఖీ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ సక్రమంగా అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్.విజయ్ ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. గురువారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని ప్రభుత్వ బాలిక సంక్షేమ హాస్టల్స్‌ను, ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలోని గిరిజన బాలుర కళాశాల హాస్టల్స్‌ను తనిఖీ చేశారు. ఆయన విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల మేరకు మెనూ అందుతుందా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. కొన్నిచోట్ల ప్రకటించిన మెనూ అమలు కావడం లేదన్నారు.


భాగ్యనగర్‌లోని సక్కుబాయమ్మ హాస్టల్‌లో వంటశాలను పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

ఏ సమస్య ఉన్నా తనకు ఫిర్యాదు చేయాలని విజయ్‌ప్రతాప్‌రెడ్డి సూచించారు. వంటశాలను పరిశీలించిన చైర్మన్, బాలికల రెండు హాస్టల్స్‌కు కలిపి 300 మంది విద్యార్థినులకు ఇద్దరే వంట మనిషిలు ఉండటంపై ఆయన డీడీ లక్ష్మా నాయక్‌ను అడిగారు. సిబ్బంది కొరత ఉందనే విషయాన్ని ఆయన చైర్మన్‌కు వివరించారు. ఆ సమయంలో వంట తయారీని పరిశీలించిన ఆయన స్వయంగా తిని కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్థానిక రామనగర్ 4వ లైనులో రేషన్ బియ్యం పంపిణీ విధానాన్ని పరిశీలించారు.

సంతనూతలపాడులో రేషన్‌బియ్యం అక్రమ డంపులు

గత పదేళ్లలో పలుమార్లు పట్టివేత ● ఒకే రైస్‌మిల్లులో దొరుకుతున్నా యంత్రాంగం మౌనం ఎందుకో..

నాగరాజ ట్రేడర్స్‌లో నిల్వల లెక్క తేల్చిన అధికారులు

సంతనూతలపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో అక్రమ రేషన్‌బియ్యం డంపులు తరచూ అధికారులకు చిక్కుతున్నాయి. దీంతో రేషన్ బియ్యం మాఫియా ఏస్థాయిలో పని చేస్తుందో ఎవరికైనా అర్థంకాక మానదు. గత పదేళ్లలో పలుమార్లు అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టుబడిన సరే.. నిందితులపై 6ఎ కేసులు నమోదు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి. అధికార యంత్రాంగం కూడా తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటుండంతో ఈ దందా నడిపిస్తున్న వారు కూడా ఏముందిలే.. మేనేజ్ చేస్తే సరిపోతుందనే ధోరణి ఉన్నారు.



వాహనం ద్వారా మిల్లుకు తెచ్చిన రేషన్ బియ్యం

అర్థరాత్రి దాడులు

సంతనూతలపాడులోని మద్దులూరురోడ్డులో గల నాగరాజ ట్రేడర్స్ రైస్ మిల్లుపై బుధవారం అర్థరాత్రి ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తమ సిబ్బందితో దాడిచేసి పట్టుకున్న సంగతి విదితమే. అయితే ఈ మిల్లులో మూడు పెద్ద గదుల్లో రేషన్ మాఫియా భారీ ఎత్తున నిల్వ చేసిన బియ్యాన్ని నిల్వలు, రైసుమిల్లులో ఓపెన్ ప్లేసులో రెండు చోట్ల బియ్యం డంపులు ఉండటాన్ని గుర్తించారు. అక్రమ రేషన్ బియ్యం లెక్కలు తేల్చేందుకు అధికారులు బుధవారం అర్థరాత్రి నుంచి గురువారం సాయంత్రం 4గంటల వరకు సమయం పట్టింది. మొత్తం 1,624 (50కేజీల బ్యాగు) బస్తాలలో అక్రమరేషన్ బియ్యాన్ని లోడ్ చేయించి చీమకుర్తిలో వెంకటేశ్వర రైస్‌మిల్లులోకి తరలించారు. బయట నుంచి కొనుగోలు చేసి తీసుకొచ్చిన వాహనంలోని 80 రేషన్ బియ్యం బస్తాలను చీమకుర్తి ఎమ్ఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. నిందితులు ఎం.రాజేష్‌గుప్తా, ఎం.శ్రీనివాసరావు, పి.చిరంజీవిలపై 6ఎ కింద కేసులు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్యలక్ష్మి, శివరామక్రిష్ణ, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ గుణవంశీ తెలిపారు. పట్టుబడిన రెండు వాహనాలను, బియ్యం ప్యాకింగ్ చేసే యంత్రాన్ని సంతనూతలపాడు ఎస్ఐ వి.అజయ్‌బాబుకు అప్పగించారు.



పట్టుబడిన బియ్యం ప్యాకింగ్



మిల్లులోని గదిలో భారీ ఎత్తున్న డంపు చేసిన రేషన్‌బియ్యం

రేషన్ బియ్యానికి డెకరేషన్..

నాగరాజు ట్రేడర్స్ రైస్‌మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం పాలిషింగ్ చేసి అందంగా ఉంటే సంచుల్లో ప్యాకింగ్ చేస్తున్నారు. బయట కొంతమంది డీలర్ల నుంచి తీసుకొచ్చిన రేషన్ బస్తాలలో మిల్లులో పాలిషింగ్ చేసి బయట మార్కెట్లో వినియోగించే బ్యాగుల్లో లోడ్ చేసి ప్యాకింగ్ చేసేందుకు ఒక యంత్రాన్నే అందుబాటులో పెట్టుకున్నారు. ఈ బియ్యం బయట మార్కెట్లో రేషన్ బియ్యం కాదనే విధంగా డెకరేషన్ చేసి ప్రజలకు విక్రయిస్తున్నారు.

పలుమార్లు పట్టుబడినా...

సంతనూతలపాడులో నాగరాజ ట్రేడర్స్ రైస్‌మిల్లులో పలుమార్లు అక్రమ రేషన్ బియ్యం పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. అయితే ఆ మిల్లును సీజ్ చేయాల్సిన ఉన్నతాధికారుల మౌనం దేనికో అని పలువురు అనుమానిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున రేషన్ మాఫియా వ్యవహారం దర్జాగా కొనసాగుతుంటే.. ఎవరి అండచూసుకుని మాఫియా నడుస్తోందని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం మాఫియాకు చేరవేస్తున్న కొంతమంది డీలర్లుపై కూడా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

11న ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ ఆధ్వర్యంలో ఈనెల 11న ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యఅబివృద్ధి అధికారి రవితేజయాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో పూర్తి చేసిన జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సంబంధిత సర్టిఫికెట్లతో పాల్గొనాలని కోరారు. 19నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉండలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.14వేల నుంచి రూ.25వేల వరకు జీతం ఉంటుందన్నారు. వివరాలకు 7989244381 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

సేవా దృక్పథం పెంపొందించాలి

● డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో సేవా దృక్పథం పెంపొందించాలని డీఈవో కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని సమగ్ర శిక్ష కార్యాలయంలో గురువారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపయోగపడుతుందన్నారు. స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు ఎలాంటి ఫలితం ఆశించకుండా స్వచ్ఛందంగా తమ సొంత నిధులు ఖర్చు పెట్టి సేవలు చేయడం అభినందనీయమని చెప్పారు. ప్రతి పాఠశాలలో బాలుర కోసం స్కౌట్ విభాగాన్ని, బాలికల కోసం గైడ్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ టి.బాలాజీ, జిల్లా కోశాధికారి పర్రె వెంకట్రావు, జిల్లా ట్రైనింగ్ కమిషనర్ వెంకటశేషారావు, బి.హెప్సిబా, కె.రాము, చెక్క వెంకటేశ్వర్లు, పావళ్ళ రాచయ్య, కర్ర దేవసహాయం, కె.పద్మశ్రీ, అపర్ణ, రత్నకుమార్, ఎం.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చీమకుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి సబ్‌స్టేషన్‌లో న్యూ బే ఎరెక్షన్ పనులు నిర్వహించనున్నందున చీమకుర్తి పట్టణం, మండల పరిధిలోని దక్షిణప్రాంత గ్రామాలకు మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. చీమకుర్తి, ఆర్ఎల్‌పురం పరిధిలో ఉన్న పరిశ్రమలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు డీఈఈ మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్యాటిల్ షెడ్డుల నిర్మాణాలను పూర్తి చేయాలి

టంగుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో క్యాటిల్ షెడ్డుల లబ్ధిదారులందరూ ఈ నెలాఖరు నాటికి నిర్మాణాలన్నీ పూర్తి చేయాలని ఏపీవో సుభాషిణి చెప్పారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా క్యాటిల్ షెడ్డుల లబ్ధిదారులు 75 మంది వరకు ఉన్నారని చెప్పారు. జాప్యం చేస్తే వర్షాలు పడి పనులు ముందుకు సాగవన్నారు. అలాగే ఇళ్ల వద్ద వ్యక్తిగత ఇంకుడు గుంతలను త్వరితగతిన నిర్మించుకోవాలని ఏపీవో చెప్పారు. ఒక్కొక్క గుంత నిర్మాణానికి రూ.6వేలు వరకు చెల్లిస్తామని, ఎన్ఆర్ఈజీఎస్ నిబంధనల ప్రకారం ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని తెలిపారు. లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యత గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు అప్పగించినట్లు ఆమె పేర్కొన్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

పొన్నలూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని పలు గ్రామాల్లో హెల్త్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొన్నలూరులో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో సుబ్బారావు, సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, సురేష్‌బాబు, జ్యోతి, సుజాత పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో సెక్టోరల్ అధికారుల నోటిఫికేషన్, అవకతవకలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యుల మీద చర్యలు తీసుకోవాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు.



డీఈవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గురువారం ఒంగోలులో డీఈవో కిరణ్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సెక్టోరల్ అధికారుల నియామకం కోసం పూర్వ జిల్లావిద్యాశాఖాధికారి సెలవులో ఉండగా ఇన్‌చార్జి డీఈవో నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. 8 సెక్టోరల్ అధికారుల పోస్టులు ఉండగా ఆరు పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వగా, ఏఎంఏ/ఏపీవో పోస్టులో ఉన్నవారికి కాలపరిమితి డిసెంబరు3తో ముగిస్తుందన్నారు. ఏపీవో కూడా సమగ్ర శిక్ష నుంచి తప్పుకొని స్కూలుకు వెళ్ళేందుకు దరఖాస్తు కూడా పెట్టుకున్నారని డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఏఎంవోగా స్కూలు అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా గ్రేడ్-2 హెచ్ఎం కొనసాగుతున్నారని, ఆయన కాలపరిమితి కూడా డిసెంబరు 3కు ముగుస్తుందన్నారు. కానీ ప్రస్తుతం పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడిని కొనసాగించేందుకు కలెక్టర్ ద్వారా నోట్‌ఫైల్ నడిపి ఎస్‌పీడీ కార్యాలయానికి ఎక్స్‌టెన్షన్ కోసం పంపారని, అందువల్ల ఈ మతలబుపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఆదర్శ రైతు పురస్కారం ప్రదానం

మద్దిపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురవారెడ్డి పాలెంకు చెందిన మేకల కృష్ణారెడ్డికి గురువారం ఒంగోలులోని రంగాభవన్‌లో ఆచార్య ఎన్‌జీరంగా జయంతి వేడుకల్లో ఆదర్శ రైతు పురస్కారాన్ని ప్రదానం చేశారు. పొగాకు సాగులో తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతులమీదుగా కృష్ణారెడ్డికి ఈ పురస్కారాన్ని, నగదు బహుమతిని అందించారు.



కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

బూరేపల్లిలో పారిశుధ్య పనులు

మద్దిపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బూరేపల్లిలో గురువారం పారిశుధ్య పనులను చేపట్టారు. సర్పంచ్ రావిపాటి వెంకటశేషయ్య ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సాయంతో శుభ్రపరిచి ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ఒంగోలు(రూరల్), నవంబరు7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ ఏపీవో సునీత పేర్కొన్నారు. ఒంగోలులోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వయోజన విద్యపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో యు.శేషుబాబు, సూపర్‌వైజర్ కె.జ్యోతి, ఏపీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

● పలు హాస్టళ్ల పరిశీలన

నాగులుప్పలపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి సూచించారు. అమ్మనబ్రోలు గురుకుల బాలికల పాఠశాల, జడ్పీ హైస్కూలును గురువారం ఆయన తనిఖీ చేశారు. తొలుత గురుకుల పాఠశాలలో వంటశాల, తరగతి గదులు, వసతులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. మోనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. వేరుశనగ చిక్కీలలను పరిశీలించారు. కోడుగుడ్ల బరువును తూకం వేయించి తక్కువగా ఉండటంతో వాటిని వెనకకు పంపించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, డీఎస్‌వో పద్మశ్రీ, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఎం.అంజల, గిరిజన సంక్షేమ అధికారి కె.జగన్నాథరావు, సీడీపీవో ఇవాంజలిన్, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ కె.మాధవి, ఎంఈవో టి.రవి పాల్గొన్నారు.



అమ్మనబ్రోలులో వంటగదిని పరిశీలిస్తున్న చైర్మన్



మద్దిపాడులో మాట్లాడుతున్న విజయ్‌ప్రతాప్‌రెడ్డి

మద్దిపాడులో..

మద్దిపాడు: పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మద్దిపాడులోని బీసీ హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. ఉద్యోగులు విద్యార్థుల విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నో పోషక విలువలు కలిగిన పోర్టిఫైడ్ బియ్యం ఎక్కువసార్లు కడిగితే అందులో పోషకవిలువలు నశిస్తాయని అన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఏడీ నాయక్, తహసీల్దార్ సృజనకుమార్, ఎంఈవో ఆంజనేయులు, సీడీపీవో ఇవాంజలిన్, మాజీ సర్పంచ్ జజ్జరా శరత్‌బాబు, కడియాల యానాదయ్య స్కూల్ ప్రిన్సిపాల్ పెద్దిరెడ్డి కోటిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి

● డీసీసీ అధ్యక్షుడు సైదా డిమాండ్

ఒంగోలు క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇంధన సర్దుబాటు, విద్యుత్ కొనుగోలు చార్జీల పేరిట వినియోగదారులపై గుదిబండ మోపుతున్నారని, పెంచిన విదుత్‌చార్జీలు వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని విద్యుత్‌భవన్ వద్ద లాంతర్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై భారం మోపుతోందని ఆరోపించారు. ఓ పక్క ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తూ విద్యుత్ చార్జీల పేరుతో దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కైపు వెంకటకృష్ణారెడ్డి, డాక్టర్ చిలకా అనిల్, నగర అధ్యక్షురాలు టి.నాగలక్ష్మి, బీఆర్.గౌస్, పాలపర్తి విజేష్‌రాజ్, ఉద్దండి మల్లికార్జునరావు, బొడ్డు సతీష్, రిహానాబాను తదితరులు పాల్గొన్నారు.



లాంతర్లతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ నిరసనలపై నిర్బంధం తగదు

● రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కలెక్టరేట్ కార్యాలయాల ఆందోళనలపై ప్రభుత్వం పోలీసుల ద్వారా నిర్బంధం చేయడం పట్ల రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ మండిపడ్డారు. ఒంగోలులోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పార్వతీపురం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులపై పోలీసులు దమనకాండ నిర్వహించడం దారుణంగా ఉందన్నారు. అంతేగాకుండా ఏడుగురిపై అక్రమ కేసులను బనాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పోలీసుల ద్వారా దాడులు చేయించడమే కాకుండా అక్రమంగా కేసులు బనాయించి ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. ఈ విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ మాట్లాడుతూ గత వారం రోజుల పోరాట ఫలితంగా ప్రభుత్వం ఫీజు బకాయిలను యాజమాన్యం ఖాతాల్లోకి చెల్లిస్తామని క్యాబినెట్‌లో నిర్ణయించడం అభినందనీయమన్నారు. కానీ ఈ బకాయిలను ఎప్పుడు జమ చేస్తారనేది స్పష్టత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.విజయ్, నగర కార్యదర్శి బండి వీరస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్

గ్రామాభివృద్ధికి దోహదపడేలా ప్రణాళికలు ఉండాలి

● జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి దోహదపడే విధంగా ప్రణాళికలు రూపొందించాలని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సూచించారు. స్థానిక పాత జడ్పీ సమావేశపుహాలులో గురువారం జరిగిన ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ల శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. గ్రామాభివృద్ధి జరగాలంటే ప్రస్తుతం రూపొందించే ప్రణాళికలపైనే ఆధారపడి ఉంటుందన్నారు. అందువల్ల గ్రామ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. జడ్పీ సీఈవో బి.చిరంజీవి మాట్లాడుతూ ప్రణాళికల తయారీలో గ్రామం భౌగోళిక స్వరూపం, వనరులు, రోడ్లు సందర్శించడం ద్వారా అంచనా వేయవచ్చని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో బాలమ్మ, కనిగిరి డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, బివెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రధాన లక్ష్యం : ఎంపీపీ

మద్దిపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కనీస మౌలిక వసతుల కల్పన, అభివృద్ధే ధ్యేయంగా ప్రతి అధికారి పనిచేయాలని ఎంపీపీ వాకా అరుణ పేర్కొన్నారు. గురువారం మద్దిపాడు మండల పరిషత్ సమావేశ హాలులో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం గ్రామస్థాయి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, గ్రామస్థాయిలో రోడ్లు, సైడు కాల్వలు తదితర అంశాలపై వివరణ ఇచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఎంపీడీవో జ్యోతి, వైస్‌ఎంపీపీ మోరబోయిన విజయలక్ష్మి, తహసీల్దార్ సృజన్‌కుమార్, ఎంపీటీసీ కోటిరెడ్డి, సర్పంచ్‌లు మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సృజన్‌కుమార్

జాతీయ స్థాయి హాకీ పోటీలకు భువన్‌తేజ యాదవ్

సింగరాయకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండకు చెందిన గంజి భువన్‌తేజ యాదవ్ జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. దీంతో అతను హర్యానాలో నిర్వహించనున్న 68 ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు అర్హత సాధించాడు.



ఎస్పీబాలు విగ్రహానికి శంకుస్థాపన

ఒంగోలు(కల్చరల్), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు శ్రీఅభయ కళారాధన సాంస్కృతిక సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావు పేర్కొన్నారు. చీమకుర్తిలోని పోలీస్‌స్టేషన్ బయట ఉన్న ఘంటసాల విగ్రహం పక్కనే ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆయన బాలు అభిమానులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, కౌన్సిలర్ సోమా శేషాద్రి, సోమా వేణు, షేక్ ఖాదర్‌బాష, చింతలపూడి నాగేశ్వరరావు, శ్రీరాములు, గంగాధర్‌రావు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న అభిమానులు

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

ఒంగోలు క్రైం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు రాష్ట్రం తరుపున పాల్గొనేందుకు క్రీడాకారిణి అభిలాష ఎంపికయ్యారు. జైలు వార్డర్‌గా పనిచేస్తున్న కొప్పోలు నాగరాజు కుమార్తె అభిలాష అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయిలో రాణించడంతో ఆమె జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు గురువారం ఒంగోలులోని జిల్లా జైలులో జరిగిన కార్యక్రమంలో జైలర్ పి.వరుణారెడ్డి, అభిలాషను అభినందించి రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.



అభిలాషకు జ్ఞాపికను అందిస్తున్న జైలర్

హరిహరక్షేత్రంలో వైభవంగా కలశప్రతిష్ఠ

● దీక్షాస్వాములకు నిత్యాన్నదానం ప్రారంభం



కలశప్రతిష్ఠలో పాల్గొన్న శిద్దా రాఘవరావు కుటుంబసభ్యులు

చీమకుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో కలశప్రతిష్ఠా మహోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మీపద్మావతి, కుటుంబసభ్యులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రతిఏటా ఆనవాయితీగా జరిగే ఈ కలశప్రతిష్ఠలో భాగంగా అయ్యప్పస్వామికి ప్రత్యేకపూజలు జరిపారు .అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్పస్వామి వారిని చత్ర చామరాలతో మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రాలతో ఊరేగింపు నిర్వహించి అంతరాలయానికి చేర్చి హారతిని ఇచ్చారు. ప్రముఖ వేదపండితులు నెలబోట్ల రామకృష్ణశాస్త్రి కలశప్రతిష్ఠ క్రతువును జరిపారు. అనంతరం సర్వదీక్షాస్వాములుకు నిత్యాన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు, శిద్దా బాలాజీ, చలువాది బదరీనారాయణ, గోల్డెన్ గ్రానైట్స్ మేనేజర్ గిరి, బొమ్మిశెట్టి కిరణ్, గ్రంధి శ్రీహరి, హనుమంతరావు, వాసవీ మహిళలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

టంగుటూరు, నవంబరు 7 (ఆంధ్యజ్యోతి) : కారుమంచిలో సిమెంటు రోడ్ల నిర్మాణాలకు టీడీపీ నాయకుడు ఈదర ప్రభాకర్ నేతృత్వంలో గురువారం భూమిపూజ జరిగింది. ఈ సిమెంటు రోడ్ల నిర్మాణాల పనులకు ప్రభుత్వం రూ30లక్షలు నిధులు మంజూరు చేసింది. ఆనిధులతో గ్రామంలోని ఎస్సీ కాలనీల్లో సిమెంటు రోడ్లు పూర్తి చేయనున్నట్లు ప్రభాకర్ తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మన్నం శ్రీనివాస్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మేడికొండ రవీంద్ర, బీసీ నాయకుడు ఆత్మకూరి శ్రీనివాస్, మన్నం టైగర్ శ్రీను పాల్గొన్నారు.



పనులకు భూమిపూజ చేస్తున్న ప్రభాకర్

బ్యాంకు అకౌంట్‌కు ఆధార్‌ను జత చేసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగదు బదిలీ పథకం పొందేందుకు ప్రతి లబ్ధిదారుడు ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో తమ ఆధార్‌కు బ్యాంకు అకౌంట్‌ను జత చేయాల్సి ఉంటుందని మార్కాపురం డివిజన్ తపాలా సూపరింటెండెంట్ జీవీ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకాల తాలూకు నగదు, లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలోనే జమ చేయడాన్నే నగదు బదిలీ పద్ధతి అంటారన్నారు. ఈ నగదు బదిలీ పథకం కోసం ఆధార్ జత చేయడానికి ప్రతి గ్రామ, వార్డు సచివాలయాలలో పోస్టల్ సిబ్బంది ఆధ్వర్యంలో అకౌంట్ ఓపెనింగ్ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈపీపీబీ అకౌంట్ ఓపెన్ చేయటానికి కేవలం ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలో మాత్రమే అవసరం అని ఫోటోలు అవసరం లేదన్నారు. ఈ క్యాంప్‌లను ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఖాతాతో లబ్ధిదారులు దేశంలో ఉన్న ఏదైనా పోస్టాఫీసులో శాఖాపరమైన సేవలు పొందవచ్చని, నిరక్షరాస్యులు కూడా తమ బయోమెట్రిక్ ద్వారా ఖాతాలో నగదు జమ ఉపసంహరణ వంటి సేవలు సులభతరంగా పొందవచ్చన్నారు.







దీపం-2పై అపోహలు వీడాలి

- విలేకర్ల సమావేశంలో జేసీ గోపాలకృష్ణ
- మీకోసం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక బృందం

మార్కాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు దీపం-2 పథకం గురించి అపోహలు వీడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం సాయంత్రం డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై స్థానిక అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విలేకర్లతో జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందన్నారు. కానీ చాలామంది దీపం-2 పథకానికి ఎవరు అర్హులో అనే విషయంపై అపోహ పడుతున్నారని అన్నారు. ఈ పథకం లబ్ధి పొందెందుకు గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్, రేషన్‌కార్డు అనుసంధానం చేసి ఉండాలన్నారు. యాక్టివ్ గ్యాస్‌కనెక్షన్ ఉన్న వాళ్లంతా అర్హులేనన్నారు. అంతేకాక ఈ-కేవైసీ తప్పక చేయించుకోవాలన్నారు. జిల్లాలో 4.80 లక్షల యాక్టివ్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. దీపం-2 పథకం కింద ఇప్పటి వరకు 1,05,298 మంది బుక్ చేసుకున్నా రన్నారు. వాటిల్లో 65,690 మందికి గ్యాస్ సిలిండర్‌లు డెలివరి చేశారన్నారు. వారిలో 32,398 మందికి బ్యాంకు అకౌంట్లలో మొత్తం రూ.2.62 కోట్లు జమ చేశారన్నారు. గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న వెంటనే పట్టణాల్లో 24 గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లోగా డెలివరి చేస్తారన్నారు. డెలివరి జరిగిన 24 గంటల తర్వాత బ్యాంకు అకౌంట్లలో డబ్బులు జమవుతాయన్నారు. ఎలాంటి సాంకేతిక సమస్యలున్నా పరిష్కరించేందుకు పౌరసరఫరాలశాఖ 1967 టోల్ ఫ్రీ నెంబర్ తీసుకొచ్చిందన్నారు. అంతేకాక జిల్లా ప్రజల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు 8008901457 నెంబర్‌కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించేందుకు చర్యలు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) ద్వారా వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసు కుంటు న్నట్లు జేసీ గోపాలకృష్ణ తెలిపారు. చాలా మండలాల నుంచి తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అటువంటి వాటిపై డివిజన్ కేంద్రాల్లో ఆడిటింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఆడిటింగ్ టీంలో డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి, డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు ఆర్ఐలు, నలుగురు వీఆర్‌వోలు, ఒక సీనియర్ అసిస్టెంట్, వార్డ్ వెల్ఫేర్ అసిసెంట్‌లతో ఒక టీం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి అర్జీదారున్ని పిలిపించి వారితో మాట్లాడి పరిష్కారం చూపేందుకు చొరవ తీసుకుంటున్నామన్నారు. అంతేకాక అధికారుల పనితీరు సరిగాలేకుంటే అర్జీపై క్షేత్ర స్థాయిలో కూడా విచారిస్తామన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ, పక్కన సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్

రైతుబజారును వినియోగంలోకి తీసుకొస్తాం

- అసంపూర్తి భవనాలను పూర్తి చేస్తాం
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు)నవంబరు7 (ఆంధ్రజ్యోతి): పుల్లలచెరువు రోడ్డులో నిరుపయోగంగా వున్న రైతు బజారును త్వరలోనే వినియోగం లోకి తీసుకొస్తామని వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. గురువారం ఎర్రగొండపాలెంలో అసంపూర్తిగా వున్న మార్కెట్ యార్డు, నిరుపయోగంగా వున్న రైతు బజారును టీడీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించే కూరగాయలను బయట మార్కెట్టులకు తీసుకెళ్లి రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. స్థానికంగా మార్కెట్టు యార్డు అందుబాటులోకి తీసుకొస్తే గిట్టుబాటు ధరతో పాటు రైతులకు సమయం కుడా ఆదా అవుతుందని అన్నారు. పుల్లలచెరువు రోడ్డులోని రైతు బజారును వినియోగంలోకి తీసుకోస్తే చిరు వ్యాపారులతో పాటు రైతులు కుడా తమ కూరగాయాలను అమ్ముకోనవచ్చునని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, టీడీపీ ముఖ్య నాయకులు వేగినాటి శ్రీనివాస్, కామేపల్లి వెంకటేశ్వర్లు, కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణ రెడ్డి, కంచర్ల సత్యనారాయణగౌడ్, మెడబలిమి అచ్యుతరావు, ఆదిరెడ్డి, చేదూరి గంగయ్య, షేక్ వలి,టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రైతు బజారును పరిశీలిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ

పొదిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమంపై ఏపీఎం గోపాలకృష్ణ అధ్యక్షతన గురువారం వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస రెడ్డి పాల్గొని మాట్లాడారు. డ్వాక్రా మహిళల్లో చదువులేని వారికి వయోజన విద్య ఆధ్వర్యంలో చదువు నేర్పేందుకు ఉపయోగపడుతుందన్నారు. అలాంటి వారికి చదువు నేర్పేందుకు టీచర్లకు, వలంటీర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పది మందికి ఒక టీచర్, వలంటీర్‌ను ఏర్పాటు చేస్తు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళలను అక్షరాస్యులుగా చేసి వారిని ఆర్థిక డిజిటల్ అక్ష రాస్యులుగా చేయాలన్నారు. ఏపీఎం మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ముందుగా అక్కచెరువు, అన్నవరం, మాదాలవారిపాలెం, ఆముదాలపల్లి, కంభాలపాడు, నందిపాలెం పంచాయతీలను ఎంపి క చేసినట్లు తెలిపారు. మహిళ చదువుకుంటే కుటుంబం మొత్తం ఉన్నత స్థాయిలో ఉంటుంద న్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, అడల్ట్ ఎడ్యుకేషనల్ సూపర్‌వైజర్ చెన్నారెడ్డి, సీసీలు రాజయ్య, వెంకటరెడ్డి, అకౌంటెడ్ శ్రీదేవి, వీవోఏలు, వలంటీర్లు, టీచర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో

పొగాకుకు ప్రత్యామ్నాయ పైర్లను సాగుచేయాలి

ఏడీఏ బాలాజీ నాయక్

మార్కాపురం రూరల్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి). రైతులు పొగాకు పంటలకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలను సాగు చేసుకోవాలని ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు. మండలంలోని గజ్జలకొండ, రామచంద్రాపురం, కోలబీమునిపాడు, జమ్మనపల్లి గ్రామాలలో వ్యవసాయశాఖ ఏడీఏ బాలాజీ నాయక్ అధ్యక్షతన గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ పొగాకు పంటకు బదులుగా శనగ, మినుము, కంది, పెసర, అలసంద, సజ్జ, కొర్ర పంటలను సాగుచేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చన్నారు. పొగాకు మార్కెట్ ధరలు స్థిరంగా లేకపోవడం సాగుఖర్చులు పెరడం, అధిక కూలీల ధరలతో రైతు లు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు, డీఆర్‌సీ శైలజ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది నవీన్ కుమార్, ఖైరూన్, సంధ్యా, రైతులు పాల్గొన్నారు.

గిద్దలూరు : మండలంలోని వెల్లుపల్లి, వెంగలరెడ్డిపల్లి గ్రామాల పరిధిలో సాగైన మిరప, బొప్పాయి పైర్లను ఉద్యానవనశాఖ అధికారి పి.విష్ణుప్రియ పరిశీలించారు. మిరప పంటకు తామర పురుగు, తెల్లదోమ ఆశించినట్లు గుర్తించారు. పురుగుల నివారణ కోసం ఎకరాకు 30 నుంచి 40 నీలి, పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే స్పైనోసాడ్ మందును పిచికారి చేయాలని పేర్కొన్నారు. ఎర్రనల్లి నివారణ కోసం ఒమైట్ మందును పిచికారి చేయాలని రైతులకు సూచించారు. బొప్పాయి పంట పూత, పిందె దశలో ఉందని, పిండినల్లి అక్కడక్కడా ఆశించగా నివారణ కోసం 2ఎంఎల్ ప్రొఫెలోఫోస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు. పంటలను రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైతే ఉద్యానవన సిబ్బందిని సంప్రదిస్తే నివారణ చర్యలు చెబుతారని, వాటిని పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాఖాధికారి విష్ణుప్రియ పేర్కొన్నారు.


మిరపను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి విష్ణుప్రియ

పశుపోషకులకు రాయితీపై చాప్‌కట్టర్

పొదిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పశుపోషకులకు 40 శాతం రాయితీపై గడ్డి కటింగ్ పరికరాలు అందుబాటులో ఉన్నయని ఉన్నగురవాయపాలెం పశువైద్యాధికారి మణిశేఖర్ గురువారం తెలిపారు. పవర్ ఆపరేటెడ్ చాప్ కట్టర్ మూడు బ్లేడ్‌లు కలిగిన కట్టర్ రూ.33,970 ఉండగా, రాయితీపై రూ.20,382 చెల్లిస్తే కట్టర్ అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు పశువైద్య కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కంభం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కంభంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఉప విద్యాశాఖాధికారి బి.శ్యాముల్. ఎంఇఒ-2 శార్వాణి తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట నిర్వాహకులకు భోజనాల రుచి, నాణ్యత, పరిశుభ్రతలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నందం శ్రీనివాసరావు, సీఆర్‌పీ మురళిమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు

గిద్దలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గిద్దలూరుకు చెందిన ఓ.ఆంజనేయులు ఎంపికయ్యారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం వీఆర్‌ఏల రాష్ట్ర కమిటీ సమావేశమైంది. గతంలో జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన ఓ.ఆంజనేయులును రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఎన్నుకున్నారు. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి యూనియన్ తరపున తనవంతుగా కృషి చేస్తానని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఆక్రమణల తొలగింపుపై కౌన్సిల్‌కు సమాచారమేది?

మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో జరుగుతున్న ఆక్రమణల తొలగింపులో అధికారులు మున్సిపల్ కౌన్సిల్‌కు తెలపకపోవడం బాధాకరం అని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రెండు నెలల నుంచి మార్కాపురం పట్టణంలోని ఆక్రమణలపై సమావేశాలు చర్చలు జరుగుతున్నాయన్నారు. ఈ చర్చలలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు, కౌన్సిలర్‌లకు మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులు ఎటువంటి సమాచారం, వివరణ, ఇవ్వలేదని భాగస్వామ్యం కల్పించలేదని అన్నారు. తాము ఆక్రమణల తొలగింపునకు వ్యతిరేకం కాదని, అయినా ఎటువంటి సమాచారం, గౌరవం ఇవ్వలేదన్నారు. మున్సిపల్ కార్మికుల తొలగింపులో తమ ప్రమేయం లేకుండానే తొలగించారని, ఇటువంటి విధానాలకు స్వస్తి పలకాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్ ముంగమూరి శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యులు అమిరుల్లా ఖాన్, వైసీపీ నాయకులు సలీమ్ సాహెబ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ బాలమురళీకృష్ణ

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని హిందూ సంఘాల ప్రతినిధులు పిలుపు నిచ్చారు. జవహర్‌నగర్ కాలనీ లోని ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలోని కళ్యాణ మండపంలో హిందూ సంఘాల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ అఖిల భారతీయ ప్రధాన కార్యదర్శి యక్కలి రాఘవులు, జిల్లా అధ్యక్షులు వీరారావు, అర్చక, పురోహిత ప్రముక్ శివశంకర్, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహక్ వెంకటేశ్వరరెడ్డి, గోపాలుని హరిహరరావు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆటోలోంచి జారిపడి వ్యక్తి మృతి

కంభం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి నిద్రమత్తులో జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన అర్ధవీడు మండలం నాగులవరం గ్రామ సమీపంలో గురువారం ఉదయం నిర్వహించారు. అర్ధవీడు ఎస్సై సుదర్శన్‌నాయక్ కథనం ప్రకారం, అర్ధవీడు మండలం నారాయణపల్లి గ్రామానికి చెందిన శీలం రామకృష్ణారెడ్డి (45) గ్రామంలోని నిమ్మతోటలో కాపలాగా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం తోట యజమానితో కలిసి నిమ్మకాయలు కోసుకుని ఆటోలో వెళుతూ నిద్రమత్తులో ఆటోలోంచి జారిపడగా తలకు తీవ్ర గాయమైంది. గాయపడిన రామక్రిష్ణారెడ్డిని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనాలకు జరిమానా

పొదిలి, నవంబరు 7 : (ఆంధ్రజ్యోతి): సరైన పత్రాలు లేని 18వాహనాలకు దర్శి మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ జరిమానా విధించారు. పట్టణంలోని చిన్నబస్టాండ్, పెద్దబస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్. మార్కాపురం అడ్డరోడ్డు ప్రాంతాల్లో పత్రాలే లేని వాహనాలను గుర్తించారు. వాటికి రూ.1.30 లక్షలు జరిమానాలు విధించినట్లు ఆయన తెలిపారు. వాహన దారులు ఎవరైనా రోడ్లపైకి వచ్చే సమయంలో పత్రాలను సరి చూసుకోవాలన్నారు. కాగితాలు కాలపరిమితి దాటితే వెంటనే రెన్యువల్ చేయించుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించి రోడ్లపైకి వస్తే జరిమానా విధిస్తామన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

పొదిలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : గత ఐదురోజులుగా శ్రీలక్ష్మిపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘణంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం స్వామివారికి అత్యంత వైభవంగా కళ్యాణం నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహం, అగ్నిధ్యానం, కుభారాధన, నిత్యహోమం, బలహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కళ్యాణ తంతు పూర్తి చేసి భక్తులకు స్వామిదర్శినం కలిగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. సాయంత్రం అశ్వవాహనంపై స్వామివారు గ్రామంలో ఊరేగించారు. శుక్రవారం చక్రస్నానం, ద్వాదశ ఆరాధన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.


వేంకటేశ్వర కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

కనిగిరి అభివృద్ధిలో అధికారులు చొరవ చూపాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కనిగిరి అభివృద్ధిలో అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్మన్ గఫార్ అధ్యతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కనిగిరిలో జరిగిన, జరగనున్న ఆక్రమణల తొలగింపులో తమ ప్రమేయం లేదన్నారు. గత ప్రభుత్వంలో వచ్చిన ఆర్డినెన్స్ ఎన్నికలు రావటంతో నిలిచిందన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఏరియాల్లో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. ప్రజాసంక్షేమంలో వారి సూచనలతోనే తాము ముందుకు వెళ్తామన్నారు. ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి బైపాస్ నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది జూలై, ఆగస్టు కల్లా పూర్తి చేసేవిధంగా వేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. కోఆప్షన్ సభ్యుడు చింతం శ్రీనివాసులుయాదవ్ మాట్లాడుతూ పట్టణంలోని చెప్పులబజారు, ప్రభుత్వాసుపత్రి వద్ద, వివిధ రోడ్డులోని ఫుట్‌పాత్ వ్యాపారుల బంకులు తొలగించారన్నారు. వారికి జీవనోపాధి కలిగేలా నిబంధనలకు అనుగుణంగా అవకాశం ఇవ్వాలని కోరారు. గత పాలకులు ఇచ్చిన హామీల్లో దొరువు అభివృద్ధి హామీగానే మిగిలిపోయిందన్నారు.

దొరువు అభివృద్ధి నిధులు ఏమయ్యాయి..

కోఆప్షన్ సభ్యుడు లేవనెత్తిన దొరువు అభివృద్ధిపై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సుదీర్ఘ చర్చ చేశారు. దొరువు అభివృద్ధికి వినియోగించిన నిధులు, అభివృద్ధి పనులు అర్ధంతరంగా ఆగిపోవటానికి గల కారణాలు, తిరిగి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక నివేదిక, ప్రణాళిక అందజేయాలని మున్సిపల్ కమిషనర్ దానియేలు, అధికారులను ఆదేశించారు. అనంతరం ప్లాస్టిక్ డస్ట్‌బిన్స్‌లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనిగిరి మున్సిపాల్టీ రూట్ మ్యాప్, బ్లూప్రింట్ తప్పనిసరిగా తయారు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జోసఫ్ దానియేలు, మేనేజర్ ప్రసాద్, ఆర్ఐ ప్రదీప్, టీపీవో సువర్ణకుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

370 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

తాళ్లూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్‌పీ కులశేఖర్ ఆదేశానుసారం సీఐ ఎన్.రాఘవరావు ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి బొద్దికూరపాడు-రాజంపల్లి మార్గంలో వెళుతున్న లారీని తనిఖీ చేయగా 370 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి.

అందిన సమాచారం మేరకు.. బొద్దికూరపాడు కేంద్రంగా అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం సాగిస్తున్నారు. ఆగ్రామంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా లారీలో తరలిస్తున్నారు. గ్రామస్థుల సమాచారంతో విజిలెన్స్ అధికారులు చింతపాలెం సమీపంలో లారీని ఆపి తనిఖీ చేశారు. లారీలో కొన్ని రేషన్ బియ్యం బస్తాలు, మరికొన్ని తెల్లగోతాల్లో ఉంచి ధాన్యంలా నమ్మించేందుకు యత్నించారు. వాటిని లెక్కించగా 50 కేజీలకు చెందిన 370 బస్తాల్లో (18వేల400 కెజీల) రేషన్ బియ్యం ఉన్నట్టు నిర్ధారించారు.

లారీ డ్రైవర్ షేక్ ఇస్మాయిల్, లారీ యజమాని ఆర్.లక్ష్మీనారాయణలను విచారించారు. తూర్పుగంగవరంగ్రామానికి చెందిన గుజ్జుల సుబ్బారెడ్డి(డీఆర్), బొద్దికూరపాడు గ్రామానికిచెందిన పులి సుబ్బారెడ్డి అక్రమ మార్గంలో బియ్యాన్ని తరలిస్తున్నారు. మండలంలోని గ్రామాల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని బొద్దికూరపాడులో లోడు చేసుకొని తరలిస్తున్నట్టు విజిలెన్స్ అధికారుల విచారణలో తెలిపారు. పట్టుబడ్డ రేషన్ బియ్యం వాహనాన్ని తాళ్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం చీమకుర్తి ఎంఎస్ఎస్ పాయింట్‌కు తరలించారు.

లారీ డ్రైవర్‌షేక్ ఇస్మాయిల్, లారీ యజమాని ఆర్.లక్ష్మీనారాయణ, గుజ్జుల సుబ్బారెడ్డి(డీఆర్), పులి సుబ్బారెడ్డిలపై విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ జి.నాగేశ్వరరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వీవీ లక్ష్మీప్రసన్న, పీసీ మాగంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాపోరు


ప్రజాపోరు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం శ్రేణులు

పామూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలెదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాపోరును విజయవంతం చేయాలని ఆపార్టీ మండల కార్యదర్శి కె.మాల్యాద్రి కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో గురువారం ప్రజాపోరుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో వైఫల్యం చెందాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజల మధ్య మత వైషమ్యాలను రెచ్చకొట్టి ఓట్ల రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నిత్యావసరాల వస్తువుల ధరలు ఆకాశనంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ధరల నియంత్రణలో కూటమి ప్రభుత్వం విఫలం చెందుతుందని ఆయన పేర్కొన్నారు. ఈనెల 15న తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షేక్ అల్లాభక్ష్, వై.వీరనారాయణ, సయ్యద్ గౌస్‌బాషా, షేక్ ఖాదర్‌బాషా, ఎం.రామయ్య, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తా చెదారం తొలగింపు

తాళ్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ వెనుక అపరిశుభ్రంగా ఉన్న చెత్తాచెదారాన్ని గురువారం తొలగించి శుభ్రపరిచారు. 'పోలీస్ స్టేషన్‌ను శుభ్రపరిచారు.. చెత్త తరలింపు మరిచారు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎస్సై ఎస్.మల్లికార్జునరావు స్పందించి పంచాయతీ కార్మికులతో పోలీస్ స్టేషన్ వెనుక వైపు అపరిశుభ్రంగా ఉన్న చెత్తాచెదారాన్ని పంచాయతీ ట్రాక్టర్‌లో గ్రామ శివారుకు తరలించారు. ఆప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

శ్రీనివాసులు మృతి టీడీపీకి తీరనిలోటు


గద్దె శ్రీనివాసులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పువ్వాడి వెంకటేశ్వర్లు, తదితరులు

పామూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకు అతీతంగా అందరితో స్నేహంగా మెలిగే శ్రీనివాసులు అందరివాడని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్టీసీ మాజీ ఏడీసీ గద్దె శ్రీనివాసులు దశదిన కార్యక్రమాన్ని గురువారం పామూరులోని నారాయణ అపార్ట్‌మెంట్‌లో కుటుంబసభ్యులు నిర్వహించారు. ముందుగా శ్రీనివాసులు చిత్రపటానికి నివాళులర్పించారు. పువ్వాడి మాట్లాడుతూ శీనయ్య మృతి కుటుంబానికే కాకుండా టీడీపీకి తీరనిలోటన్నారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, కావిటి సుబ్బయ్య, పోతురాజు వెంకట్రావు, ఉప్పలపాటి హరిబాబు, టిజనార్ధనరావు, ఎన్.సాంబయ్య, వాయినేని మాల్యాద్రి, టి.చెన్నకృష్ణ, గద్దె ఏడుకొండలు, యక్బాల్, కాశె వెంకట్, వైశ్రీనివాసరావు, నయూమ్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నారిశెట్టి వెంకటరామయ్య, షేక్ పాదుషా, జిల్లా కార్యదర్శి అరియారం సురేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారిన ఉపాధ్యాయులపై పని భారం తగ్గడంలేదని గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను నాన్‌రెసిడెన్షియల్ పద్ధతిలో డివిజన్ కేంద్రంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఒక దేశం ఒక నెంబర్ అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అపార్ కార్డులు పూర్తి చేయడానికి నిర్దిష్ట సమయాన్ని తొలగించాలన్నారు. ఆధార్ కార్డుల సమస్యలు పరిష్కారానికి పాఠశాలల్లో సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. యాప్‌ల భారంతో ప్రధానోపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

దాడి కేసులో ముగ్గురికి రిమాండ్

పామూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కత్తితో దాడి చేసిన కేసులో ముగ్గురిని అరెస్టుచేసి కనిగిరి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ టి.కిశోర్‌బాబు తెలిపారు. మండలంలోని నుచ్చుపొదలో ఈనెల 3న గ్రామానికి చెందిన కాటం తిరుపాలురెడ్డి, అతని సోదరుడు వెంకట్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన కౌలూరి నిజాముద్దీన్, గోసుల సురేంద్రబాబు, కౌలూరి హజరత్‌పై దాడిచేసి పరారయ్యారు. ఎస్ఐ కిశోర్‌బాబు కేసు నమోదు చేసుకొని సీఐ ఎం.భీమానాయక్ ఆధ్వర్యంలో గాలింపుచర్యలు చేపట్టారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర నిందితులను అరెస్టు చేసి కనిగిరి కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు. న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించడంతో దర్శి సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లి పాలు బిడ్డకు అమృతం

పామూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటివని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి సూచించారు. అన్నారు. పుట్టినప్పటి నుంచి వెయ్యి రోజుల వరకు పిల్లల సంరక్షణ ఎంతో కీలకమన్నారు. రెండు సంవత్సరాల వరకు చిన్నారుల పెరుగుదల, అభివృద్ధి, ఆరోగ్యం, ఎంతో కీలక మన్నారు. గురువారం మండలంలోని వగ్గంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ప్రపంచ శిశు సంరక్షణ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. శిశువుకు ఆరునెలల వరకు తల్లి పాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎల్.దేవిశ్రీ, నారాయణమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పంటలకు సోకే తెగుళ్లపై అవగాహన పెంపొందించుకోవాలి

దర్శి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగుమందులు విక్రయించే డీలర్లు పంటలకు సోకే తెగుళ్లపై అవగాహన పెంపొందించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన అధికారి డాక్టర జి.రమేష్ అన్నారు. తద్వార రైతులకు అవసరమైన మందులు మాత్రమే విక్రయించాలని సూచించారు. గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో డీలర్లకు జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డీలర్లు అవగాహన లేకుండా మందులు విక్రయిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శ్యాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు, దర్శి ఏడీఏ బాలాజీనాయక్, శాస్త్రవేత్తలు, డీలర్లు పాల్గొన్నారు.

బూత్ లెవెల్ బాధ్యతల నుంచి ఇంజనీరింగ్ సహాయకులను తొలగించాలి

తాళ్లూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సచివాలయంలో ఇంజనీరింగ్ సహాయకులుగా పని చేస్తున్న తమకు ఎన్నికల విధుల్లో భాగంగా బూత్ లెవెల్ అధికారుల బాధ్యతల నుంచి తప్పించాలని మండలంలోని ఇంజనీరింగ్ సహాయకులు డిప్యూటీ తహసీల్దార్‌కు విన్నవించారు. ఈమేరకు గురువారం విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని ఇంజనీరింగ్ సహాయకులు ఏడురకాల విధులు నిర్వహిస్తూ పని ఒత్తిడిలో ఉన్నారన్నారు. అదనంగా బూత్‌లెవెల్ అధికారి డ్యూటీ చేయటం కష్టతరంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు విడుల చేసినందున వాటిని నిత్యం పర్యవేక్షించాల్సి ఉందన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, చీఫ్ ఇంజనీర్లు ఇచ్చిన ఆదేశాల మేరకు మండలంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ సహాయకులను బూత్ లెవెల్ అధికారుల విధుల నుంచి తొలగించాలని డిటీ ఇమ్మానియేల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సహాయకులు బాపిరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

దొనకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.సునీత అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. గురువారం కేన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీని దొనకొండ పురవీధుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయటం జరుగుతుందన్నారు. అనుమానితులను ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి వ్యాధి నిర్ధారణ నిమిత్తం నిర్దేశించిన తేదీల్లో పంపుతామన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 14 వరకు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సునీత, సూపర్‌వైజర్లు కేవీఆర్ ప్రభావతిదేవి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పీసీపల్లి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల సీనియర్ నాయకుడు గోనుగుంట్ల చెన్నయ్యను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పరామర్శించారు. మండలంలోని పెద్దన్నపల్లి గ్రామానికి చెందిన చెన్నయ్య సతీమణి లక్ష్మమ్మ (63) ఇటీవల అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. ఆమె దశదినఖర్మ ఎమ్మెల్యే పాల్గొన్ని లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చెన్నయ్యకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించినవారిలో టీడీపీ నాయకులు యారవ శ్రీను, వేమూరి రామయ్య, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, నాగేశ్వరరావు, చెన్నకేశవులు, సురేష్, వీరపనేని చెన్నయ్య, తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవద్దు!

పామూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను అడ్డుకోవడం సరికాదని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. ప్రజలు సహకరించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. పట్టణంలోని బాలసుబ్బయ్యనగర్ 3వ లైన్‌లో రోడ్డు నిర్మాణానికి స్థానికుల నుంచి వస్తున్న అభ్యంతరాలపై గురువారం విచారణ చేశారు. ఈరోడ్డు స్థలం తమదంటూ సంజీవరెడ్డి కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈప్రాంతాన్ని సర్వే చేయించి రోడ్డుకు హద్దులు ఏర్పాటుచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో దినేష్, మండ్ల రమణయ్య, గుత్తి మహేష్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పీసీపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ జఫన్య అధ్యక్షత జరుగుతుందని ఎంపీడీవో ప్రభాకర శర్మ తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమావేశంలో సమీక్షించనున్నట్టు చెప్పారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆయన కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ పి.రఘుపతి సూచించారు. మండలంలోని శీలంవారిపల్లిలో గల కదిరి బాబురావు వ్యసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా గ్రామంలో విద్యార్థులు పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీవిద్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

బెల్టు షాపుపై దాడి

ముండ్లమూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లులో మద్యం అమ్ముతున్నట్టు ఎస్ఐ వై.నాగరాజుకు బుధవారం రాత్రి సమాచారం అందటంతో తన సిబ్బందితో వెళ్ళి దాడిచేశారు. 11 క్వార్టర్ బాటిళ్ళు పట్టుబడగా నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది మహేష్ పాల్గొన్నారు.

విషజ్వరంతో మహిళ మృతి

ముండ్లమూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన షేక్ కౌషాబీ(48) అనే మహిళ గత ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతూ గురువారం సాయంత్రం ఒంగోలులోని ఓప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందింది. ఐదు రోజుల క్రితం ఆమెకు జ్వరం రావటంతో దర్శి అద్దంకిలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సపొందారు. మెరుగైన చికిత్స కోసం బుధవారం ఒంగోలులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆమెకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



రేషన్ దందాపై మంత్రి నజర్

- సత్తెనపల్లి, మేడికొండూరు, వట్టిచెరుకూరుల్లో తనిఖీలు
- రైస్‌మిల్లుల్లో 1000 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం గుర్తింపు
- పలు మిల్లులు.. బియ్యం నిల్వల సీజ్.. కేసుల నమోదుకు ఆదేశాలు
- పేరేచర్లలో ఓ రైస్ మిల్లులోనే ఎండీయూ వాహనాన్ని గుర్తించిన మనోహర్
- తనిఖీల విషయం తెలిసి యాజమాన్యం రైస్ బాగ్ ట్యాగ్ల దహనంపై ఆగ్రహం

సత్తెనపల్లి, మేడికొండూరు, గుంటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం బ్లాక్‌మార్కెట్ దందాపై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టి సారించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి, గుంటూరు జిల్లా మేడికొండూరు, వట్టిచెరుకూరు మండలాల పరిధిలో గురువారం రాత్రి మంత్రి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. టార్చ్‌లైట్ల వెలుగుల్లో పలు మిల్లుల్లో తనిఖీలు చేసి రేషన్ బియ్యం నిల్వలను గుర్తించి కేసుల నమోదుకు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పేదల బియ్యం బ్లాక్ మార్కెట్ గుట్టు మంత్రి తనిఖీలతో రట్టయింది. వెయ్యి క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. సత్తెనపల్లిలోని రామలింగేశ్వర ట్రేడర్స్ రైస్‌లో వందలకొద్దీ రైస్ బ్యాగుల్లో చౌక బియ్యం నిల్వలను గుర్తించారు. దాదాపు 100 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ విషయమై స్థానిక తహసీల్దారు చక్రవర్తిని ప్రశ్నించారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి బ్యాగ్‌ని పరిశీలించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని, సీజ్ చేయాలని మంత్రి ఆదేశించారు. సీతారామాంజనేయ సాయి, గణేష్ రైస్ మిల్లు ఫ్లోర్, శ్రీదేవి ట్రేడర్స్, రావు రైస్ మిల్లు ఫ్లోర్, సత్తెనపల్లి మండలం కొమెరపూడి రైస్ మిల్లు, సుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లుల్లో మంత్రి తనిఖీలు చేశారు.

తొలుత పిచ్చాపాటిగా మాట్లాడి ఆరా..

తనిఖీల్లో భాగంగా తొలుత సత్తెనపల్లికి వచ్చిన మంత్రి మనోహర్ తొలుత రోడ్డు పక్కన కారు ఆపి ఓ బడ్డీ కొట్టు వద్ద సామాన్యుడిలా టీ తాగారు. అక్కడ

(మిగతా 6వ పేజీలో...)



సత్తెనపల్లిలో ఓ మిల్లులో తగలబెట్టిన బిల్లులు, గోతాలను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్



సత్తెనపల్లిలోని ఓ మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి



సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



ఆధునిక వనరులతో.. అమరావతిని నెంబర్ వన్ సిటీగా చేసే బాధ్యత నాది. నిర్దిష్ట కాల పరిమితి పెట్టుకుని అమరావతిని అభివృద్ధి చేస్తా. ప్రపంచస్థాయి నగరాల్లో ఉండే సదుపాయాలు కల్పిస్తాను. భూగర్భ విద్యుత్ లైన్లతో అద్భుత నగరాన్ని రెండేళ్లలో సాక్షాత్కరించి రాష్ట్ర ప్రజలకు అందిస్తా. మహిళలు రాజధానిని కాపాడి, నిలబెట్టారు. వారి స్ఫూర్తితో అమరావతిని అద్భుత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను.

\- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆధునికంగా.. అమరావతి

- ప్రపంచ స్థాయి నగర నిర్మాణం
- నిర్దిష్ట కాల పరిమితితో రాజధాని అభివృద్ధి
- సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవ సభలో సీఎం చంద్రబాబు నాయుడు



అధికారులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

గుంటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో 400/220 కేవీ సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ప్రారంభించారు. ఫొటోగ్యాలరీని పరిశీలించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచే వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్ల ప్రారంభోత్సవాలు, 15 ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 2014లో రాజధాని అవసరాల కోసం తాళ్లాయపాలెంలో సబ్‌స్టేషన్‌కు శ్రీకారం చుట్టగా ఐదేళ్ల వైసీపీ విధ్వంసక పాలనలో అది మరుగున పడిపోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో తిరిగి దానిని పూర్తి చేసి ప్రారంభించామన్నారు. రూ.509 కోట్లతో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌తో సీఆర్‌డీఏ భవిష్యత్ అవసరాలతో పాటు రాజధానిలోని పారిశ్రామిక అవసరాలు కూడా తీరుతాయన్నారు. గన్నవరం సబ్‌స్టేషన్‌తో రైతులకు విద్యుత్ అందజేయడంతోపాటు, అంతర్జాతీయ (మిగతా 6వ పేజీలో...)

అక్రమ లే అవుట్లపై.. నివేదిక సిద్ధం

- కలెక్టర్‌కు అందించిన రెవెన్యూ విభాగం
- నిబంధనల ఉల్లంఘనలకు జరిమానా అంశం పరిశీలన
- అనధికార లే అవుట్లపై లోకాయుక్తలోనూ కేసు నమోదు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల వైసీపీ పాలనలో నిబంధనలను తోసిరాజని ఇష్టారీతిన అక్రమ లే అవుట్లు వేసి కోట్లు దండుకున్నారు. అధికారులు వీటిపై పలుసార్లు నోటీసులు జారీ చేసినా వైసీపీ నేతల అండతో బుట్టదాఖలు చేశారు తప్పితే వాటికి స్పందించిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం రాగానే అనధికార లే అవుట్ల వివరాలను బహిర్గత పరిచింది. తదుపరి చర్యలపై స్పష్టత కోసం గతంలో ఏయే లే అవుట్లకు నోటీసులు జారీ చేశారు, వాటికి వారి నుంచి వచ్చిన స్పందనేమిటీ అనే అంశాలతో పాటు ప్రభుత్వ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించిన వారెవరనే వివరాలపై రెవెన్యూ యంత్రాంగం కసరత్తు చేసింది. దీనికి తోడు ప్లాట్లు కొనుగోలు చేసిన కొంతమంది బాధితులు లోకాయుక్తను ఆశ్రయించగా అనధికార లే అవుట్ల వివరాలతో పాటు వాటి విషయంలో ఏం చర్యలు తీసుకున్నారో తమకు నివేదించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ క్రమంలో నివేదికను నవంబరు 1న లోకాయుక్తకు అందించడం కూడా జరిగింది. ఆ నివేదికలో అనధికార లే అవుట్ల వివరాలతో పాటు గతంలో ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసింది, ఎవరు జవాబిచ్చారు, ఎవరివ్వలేదు అనే వివరాలను పొందుపరిచారు. ఈ నివేదిక ఆధారంగా తీసుకునే చర్యలలో భాగంగా పెద్ద ఎత్తున జరిమానాల కొరడా విధించడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

జిల్లా వ్యాప్తంగా 274 అనధికారిక లే అవుట్లు...

జిల్లా వ్యాప్తంగా 274 లే అవుట్లు నిబంధనలకు విరుద్ధంగా వేసి క్రయవిక్రయాలు సాగించినట్లు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ధ్రువీకరించారు. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో 39, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద 104, రేపల్లె మున్సిపాలిటీ కింద 40, అద్దంకి, కొరిశపాడు, చీరాల, పర్చూరు, మార్టూరు, వేటపాలెం బాగమై ఉన్న ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద 91 అనధికార లే అవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి వివరాలను బహిరంగ పరుస్తూ గతంలో అధికారులు ప్రకటనలు ఇచ్చారు. వాటిని బహిరంగ పరిచాక కూడా జిల్లా వ్యాప్తంగా దాదాపు 70 ప్లాట్లు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం. సదరు విభాగంతో సమన్వయం చేసుకుని ఆ వివరాలను కూడా రెవెన్యూ అధికారులు సేకరించి నివేదికలో పొందుపరిచారు. అనధికార లే అవుట్ల జాబితా ఏదీ తమ వద్దకు రాలేదని, రిజిస్ట్రేషన్లు నిలిపేయమని కూడా తమకు ఎలాంటి ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాలేదని రిజిస్ట్రేషన్ విభాగం చెప్పడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా దాదాపు 90 అనధికారిక లే అవుట్లను వైసీపీ ప్రభుత్వంలో అప్పటి జేసీ శ్రీనివాసులు గుర్తించారు. వాటికి నోటీసులు కూడా సర్వ్ చేశారు. దీనితో పాటు సదరు లే అవుట్ల వద్ద అక్రమమని ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేయించారు. ఈ లే అవుట్లలో చాలావరకు వైసీపీ నేతాగణం అనుచరులవే కావడంతో లెక్కలేనితనంతో ఫ్లెక్సీలను తొలగించడమే కాకుండా నోటీసులను తీసుకోవడానికి కూడా కొంతమంది నిరాకరించారు. నిబంధనల ప్రకారం రెండోసారి కూడా నో టీసులు జారీ చేసినా అదే సీన్ రిపీట్ అయింది. మళ్లీ ఇప్పుడు ఆ నోటీసుల తిరస్కరణతో పాటు వివిధ అంశా లపై సమగ్ర విచారణ చేసి నివేదికను సిద్ధం చేశారు.



నిబంధనలకు విరుద్ధంగా వెస్ట్ బాపట్ల పరిధిలో వేసిన లే అవుట్

అఫిడవిట్లకు మరింత గడువు

- పర్మినెంట్ లైసెన్సులపై ఎక్సైజ్ ఆదేశాలు
- 40 మద్యం దుకాణదారులు సమర్పించని వైనం
- 14లోగా ప్రక్రియ పూర్తి చేసేందుకు వీలు

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులకు పర్మినెంట్ లైసెన్సులు పొందడానికి గురువారంతో గడువు ముగుస్తుండడంతో 77 షాపుల యజమానులు మాత్రమే పర్మినెంట్ లైసెన్సులు పొందారు. ఇంకా 40 షాపులకు సంబంధించి అఫిడవిట్లు సమర్పించలేదు. ఈ క్రమంలో వీరంతా పర్మినెంట్ లైసెన్సు పొందాలని, నవంబరు 14లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. అఫిడవిట్ కేవలం తాత్కాలికంగానే తీసుకుంటున్నామని లోకేషన్‌తో పాటు బ్యాంకు గ్యారెంటీ విషయంలో నవంబరు 14 తుది గడువని ఎక్సైజ్‌శాఖ చెబుతోంది. ప్రొవిజనల్ లైసెన్సుల మార్గదర్శకాలలో గందరగోళం ఉండడంతో బ్యాంకు గ్యారెంటీలు సమర్పించే విషయంలో షాపుల యజమానులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. లాటరీ ప్రక్రియ పూర్తయ్యాక షాపులను తాత్కాలికంగా ప్రారంభించేటప్పుడే బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వడానికి నెల రోజుల వ్యవధి ఉన్నట్లు ఎక్సైజ్‌శాఖ మార్గదర్శకాలలో తెలిపింది. కానీ పర్మినెంట్ లైసెన్సుల కోసం గడువును తొలుత అక్టోబరు 31గా, తర్వాత నవంబరు 7గా ప్రకటించిన సంగతి తెలిసిందే. చివరిగా పర్మినెంట్ లైసెన్సు పొందని యజమానులకు అఫిడవిట్ సమర్పణలో మరో వారం గడువు ఇవ్వాల్సి వచ్చింది.



పక్కపక్కనే షాపులు..

చాలా చోట్ల లోకేషన్ విషయంలో తకరారు నడవడంతో పక్కపక్కనే షాపులు పెట్టుకుని కొందరు వ్యాపారం చేస్తున్నారు. బాపట్లలోని మార్కెట్ సెంటర్‌లో రెండు షాపుల విషయంలో ఎవరూ మెట్టు దిగకపోవడంతో ఇద్దరూ పక్కపక్కనే పెట్టుకున్నారు. అదేవిధంగా చీలురోడ్డు సెంటర్‌లో, వెదుళ్లపల్లిలో కూడా ఇదే విధంగా పక్కపక్కనే మద్యం షాపులు ఉన్నాయి.

అలవాట్ల మార్పుతో ఆరోగ్యం

క్యాన్సర్ అవగాహన ర్యాలీలో కలెక్టర్

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధి భారీన పడకుండా ప్రజలు తమ ఆహార అలవాట్లు మార్చుకుని ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జాతీయ క్యాన్సర్ దినం సందర్భంగా గురువారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్ నుంచి పాతబస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ విద్యార్థులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. పాతబస్టాండ్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితం, మెరుగైన జీవనంతో ప్రజల జీవనప్రమాణాలు మెరుగు పడాలన్నారు. బీపీ, మధుమేహం, గుండె, క్యాన్సర్ వంటి జబ్బులు అధికంగా నమోదవుతున్నాయన్నారు. వంశపారపర్యంగా సంక్రమించే వ్యాధులను నివారించడం, అలవాట్లు ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టడానికి రాష్ట్రప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. ఇంటింటా సర్వే ద్వారా ప్రజలకు వైద్య సమస్యలను పరిష్కరించడం సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీసీహెచ్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శేషుబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, అధికారులు

డీఆర్‌డీఏ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

డీఆర్‌డీఏ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. డీఆర్‌డీఏ పరిధిలో అమలయ్యే పథకాలపై ఆ శాఖాధికారులతో గురువారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పేదలైన మహిళల జీవితాలు ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా క్షేత్ర స్థాయిలో పనిచేయాలని చెప్పారు. డ్వాక్రా సంఘాల్లోని మహిళల అభ్యున్నతి పై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. జిల్లాలో 3,40,725 మంది మహిళలు పొదుపు చేసుకుంటూ 33,374 డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. 1,031 గ్రామ సంఘాలు నడుస్తున్నాయన్నా రు. పొదుపు మహిళలంత దాచుకున్న సొమ్ము బ్యాం కుల్లో రూ.438 కోట్లు ఉన్నట్లు తెలిపారు. మహిళలు తమ పొదుపు సొమ్మును వినియోగించుకునేలా 50 శాతం మేరకు నగదును సంఘాలకు విడుదల చే యాలన్నారు. బ్యాంకు అధికారులు రూ.215 కోట్ల నిధులను మహిళలకు విడుదల చేయాలన్నారు. బ్యాం కు రుణాల్లో నగరం, సంతమాగులూరు, జె.పంగులూరు, రేపల్లె మండలాల్లో లక్ష్యాలు సాధించకపోవ టం ఏమిటని అధికారులను కలెక్టర్ నిలదీశారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు బ్యాంకు రుణాలను మంజూరు చేయించాలని ఆయన ఆదేశించారు.

- ఉన్నతి పథకాన్ని అధికారులు సమర్థంగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. బ్యాంకు రుణాలు తిరిగి చెల్లింపులు సక్రమంగా జరగకపోవటంపై ఆరా తీశారు. మొండి బకాయిలు రూ.17.15 కోట్లు నిలిచిపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. మహిళలను డీఆర్‌డీఏ అధికారులు చైతన్య పర్చాలన్నారు. సమస్యలు ఎదురైతే తక్షణమే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ, ఎల్‌డీ ఎం శివకృష్ణ, పరిశ్రమల శాఖాధికారులు, డీపీ ఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల.. ఎన్నికలకు సమాయత్తం

- 20న నోటిఫికేషన్.. 21న టీసీల ఎన్నిక
- 13న తుది ఓటర్ల జాబితాల విడుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి సంఘా ల ఎన్నికలకు ప్రభుత్వ యంత్రాంగం సమాయత్తమైం ది. దీంతో పల్లెల్లో ఎన్నికల సందడి నెలకొంది. సాగునీటి సంఘాల ఎన్నిక ల్లో రైతులకు ఓటుహక్కు కల్పించే ప్రక్రియ ను రెవెన్యూశాఖ చేపటింది. ఓటర్ల జాబితాలను రూపొందిస్తోంది. నాగార్జునసాగర్ కుడికాల్వ ఆయక ట్టు పరిధిలో మేజర్, మైనర్ ఇరిగేషన్ శాఖలు ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. టీసీల వారీగా భూముల వివరాలను రెవెన్యూశాఖకు జలవనరులశాఖ అందజే సింది. సర్వే నెంబర్ల ఆధారంగా భూహక్కు ఉన్న రైతులను గుర్తించి వారికి ఓటుహక్కును రెవెన్యూశాఖ కల్పిస్తోంది. 2,628 టీసీల వారీగా 13వ తేదీన ఓటర్ల తుది జాబితాలను అధికారులు విడుదల చేయనున్నారు. 274 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటి పరిధిలో 2,628 టీసీలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో దాదాపు 12 టీసీలు ఉంటాయి. తొలుత టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ నెల 20న ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. ఆ మరుసటి రోజు అంటే 21న టీసీలకు ఎన్నికలు జరుగుతాయి. టీసీలకు ఎన్నికైన వారు నీటిసంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుం టారు. నీటి సంఘాలకు కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు. నీటి పంపిణీలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి. డీసీలు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటాయి. ఎన్నికల నిర్వహణకు సాగు నీటి సంఘాల వారీగా అధికారు లను నియమించారు. సమస్యాత్మక నీటి సంఘాలను గుర్తించారు. వీటి ఎన్నికలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను కోరారు. రాజకీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా స్వీకరిస్తుండటంతో ఏకగ్రీవ ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న సందేహాలు వ్యక్తమవు తున్నాయి. గతంలో ఎక్కువ నీటి సంఘాలకు ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. ఈ సారి కూడా అదే స్థాయిలో ఏకగ్రీవాలు జరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే డీసీలను కైవసం చేసుకునేందుకు రాజకీయ పార్టీల నేతలు ఎక్కడికక్కడ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఇవే..

నాగార్జునసాగర్ కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూ టరీ కమిటీలు ఉన్నాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్ల, గురజాల, కారంపూడి, కేసానుపల్లి, పిడుగురాళ్ల, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు, చామర్రు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి, మేడికొండూరు, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-1, 2, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గంటావారి పాలెం, వినుకొండ, చీకటీగలపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీలు ఉన్నాయి.

పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్



గీత దాటితే.. వేటు తప్పదు

జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ఎస్పీ

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గడచిన రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుశాఖలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాం గాన్ని ఎస్పీ తుషార్‌డూడీ అప్రమత్తం చేశారు. గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులతో ఎస్పీ తుషార్‌డూడీ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిందితుల అరెస్ట్ మొదలుకుని వారిని కోర్టులో హాజరుపరిచేంత వరకూ ఎక్కడ నిర్లక్ష్యం తగదన్నారు. ఎస్కార్ట్ డ్యూటీల్లో ఉన్నవారు నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఎస్పీ ఆదేశించారు. వ్యవహారశైలి మార్చుకోవాలని ఓ ఇద్దరు పోలీసు అధికారులను హెచ్చరించినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో క్లిష్ట పరిస్థితులు ఎదురై నిర్ణయం తీసుకోలేకపోతే తన దృష్టికి తేవాలని సూచించారు. గీత దాటి వ్యవహరిం చొద్దని, అలా జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరిం చినట్లు తెలుస్తోంది. బాధితుల పట్ల మర్యాద పూ ర్వకంగా మెలగాలని, న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారికి అన్యాయం జరగకుండా చూడా ల్సిన బాధ్యత పోలీసులదే అని ఎస్పీ గుర్తు చేశారు.

ఇష్టారాజ్యం

(5వ పేజీ తరువాయి)

ఈ వ్యాపారం ఏ విధంగా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఆ మిల్లులోని బియ్యం మొత్తాన్ని మరొక రైస్‌మిల్లుకు తరలించి ఎం.రాజేష్‌గుప్తా, ఎం.శ్రీనివాసులు, చిరంజీవి అనే వ్యక్తులపై అధికారులు 6ఏ కింద కేసు నమోదు చేశారు. కాగా తాళ్లూరు మండలం బొద్దికూరపాడు వద్ద గురువారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని విజిలెన్స్ సీఐ రామారావు నేతృత్వంలో పట్టుకున్నారు. 400 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

అనేక అక్రమాలు వెలుగులోకి..

ఇలా జిల్లావ్యాప్తంగా ఈ వారం రోజుల వ్యవధిలోని మూడువేల బస్తాలకుపైగా అధికారులు పట్టుకున్నారు. చీమకుర్తిలో వంద బస్తాలు, మద్దిరాలపాడులో వంద బస్తాలతో పాటు కనిగిరి, కంభం, మార్కాపురం, దోర్నాల సమీపంలో ఆటోల్లో తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ పంపిణీ ప్రారంభం నాటి నుంచి పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రేషన్ షాపులను తనిఖీలు చేయగా అనేక అక్రమాలు వెలుగులోకి రావడంతో ఆ షాపులపై 6ఏ కేసులు నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా ఆ విధంగా ఈ వారంరోజుల వ్యవధిలోనే 20కిపైగా షాపులపై కేసులు నమోదు అయ్యాయంటే ఈ వ్యాపారం ఏ విధంగా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా రేషన్ అక్రమ వ్యాపారంలో కొత్త, పాత వారు కలిసి యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు.

అక్రమ మైనింగ్‌లో జిలెటిన్ స్టిక్స్?

(5వ పేజీ తరువాయి)

విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అడ్డుకుని ఎక్స్‌కవేటర్‌ను, లారీ స్వాధీనం చేసుకున్నారు. మార్కాపురం మైనింగ్ శాఖకు చెందిన అసిస్టెంట్ జియాలజిస్ట్ పోలిరెడ్డి, టెక్నికల్ అధికారి బాలరాజు గురువారం రెవెన్యూ అధికారులతో కలసి అక్రమ మైనింగ్ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడ ఎంత పరిమాణంలో తెల్లరాయి ఉన్నదీ లెక్కించి కేసు నమోదు చేశారు. లారీ, ఎక్స్‌కవేటర్‌కు రూ.50 వేలు అపరాధ రుసుం విధించారు. అక్రమంగా వెలికి తీసిన వైట్‌క్వాట్జ్ 40 మెట్రిక్ టన్నులు ఉంటుందని లెక్కించి రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేశారు. ఆతరువాత ఆ వైట్ క్వాట్జ్‌ను వేలం వేస్తామని పోలిరెడ్డి తెలిపారు. మండలంలో అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వారివెంట ఆర్ఐ నాగరాజు, వీఆర్వో ఉన్నారు.

క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

(5వ పేజీ తరువాయి)

అవగాహన దినం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడకుండా ముందుగా ఇంటి వద్దనే స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించి ఆ వ్యాధి బారి నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్యం పొందడం ద్వారా వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ నోటి క్యాన్సర్, సాధారణ క్యాన్సర్, నివారణపై ఈనెల 14న జరిగే ఇంటింటి సర్వేలో 18 ఏళ్లు దాటిన వారందరూ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ జీ.భగీరధి, ఒంగోలు మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమలరావు, హెల్ప్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ.సాగర్, ఫ్లోరోసిస్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.



పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జీవీఆర్ కంపెనీ

జీవీఆర్ ఫ్యాక్టరీలో రెండో రోజూ కొనసాగిన ఐటీ సోదాలు

సింగరాయకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు చెందిన జీవీఆర్ రొయ్యల ప్రాసెసింగ్, ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో ఐటీ అధికారులు రెండో రోజైన గురువారమూ విస్తృతంగా సోదాలు చేశారు. రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. కంపెనీ లావాదేవీలకు సంబంధించిన కొన్ని కంప్యూటర్లలోని కీలక హార్డ్ డిస్కులను ఆదాయపు పన్నుశాఖ అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం.

చలివేంద్ర కొండపై చిన్నారి మృతదేహం

- చంపి పడేసి ఉంటారని అనుమానాలు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- దర్శి ప్రాంతంలో కలకలం



చలివేంద్ర కొండపైన చిల్లచెట్లలో దొరికిన చిన్నారి మృతదేహం

దర్శి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా దర్శి మండలంలోని చలివేంద్ర కొండపై ఏడు నెలల పసిపాపను చంపి పడేసిన దారుణ ఘటన గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పొదిలి ప్రాంతానికి చెందిన ఓ మహిళ బుధవారం రాత్రి ఆ పాపను తీసుకొని చలివేంద్ర కొండకు వచ్చింది. అక్కడ కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి వద్ద పూజలు చేసి రాత్రి అక్కడే నిద్ర చేయాలని నిర్ణయించుకుంది. ఆలయ నిర్వాహకులు ఆమెకు అక్కడ అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

గురువారం ఉదయం తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు ఆ మహిళ నిద్రలేచి తన పాపతో తిరుగు ప్రయాణమైంది. ఇంత చీకట్లో ఎక్కడకు వెళ్తావని నిర్వాహకులు అడగ్గా, తన భర్త ఫోన్ చేయడంతో వెళ్తున్నానని ఆమె చెప్పింది. దీంతో వారు మిన్నకుండిపోయారు. ఆ తర్వాత ఉదయం 7 గంటలకు కొండ మధ్యలో మెట్ల వద్ద చిన్నారి మృతదేహం కనిపించింది. సత్రంలో పనిచేసే మహిళ పొదల్లో ఉన్న చిన్నారిని చూసి కొండపైన ఉన్న వారికి సమాచారం ఇచ్చారు.

అక్కడ పరిశీలించగా చిన్నారి తల్లి బట్టలు కూడా అక్కడే ఉన్నాయి. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా, దర్శి ఎస్‌ఐ ఎం.మురళీ హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డీఎస్సీ ఉచిత శిక్షణకు 10న అభ్యర్థులకు స్ర్కీనింగ్ పరీక్ష

- ఒంగోలులో మూడు కేంద్రాల ఏర్పాటు
- అధికారులతో ఏర్పాట్లపై డీఆర్వో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు నగరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్థుల ఎంపికను ఈ నెల 10వ తేదీన చేపట్టనున్నారు. ఇందుకోసం స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఒంగోలులోని మూడు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. డీఎస్సీ పోటీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో కోచింగ్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోచింగ్ సెంటర్లను కూడా ఎంపిక చేసింది. అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం దరఖాస్తులు కోరగా మొత్తం 13,982 దరఖాస్తులు రాగా వీటిలో జిల్లా నుంచి 583 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఈ నెల 10వ తేదీన స్థానిక వెంగముక్కపాలెం రోడ్డులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, పేస్ ఇంజనీరింగ్ కళాశాల, రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కంప్యూటర్ ఆధారిత విధానంలో ఈ స్ర్కీనింగ్ పరీక్ష జరుగుతుంది. ఇందుకోసం హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్లను జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఎస్.లక్ష్మానాయక్ కోరారు. ఎంపిక పరీక్షకు సంబంధించిన అన్న వివరాలను అభ్యర్థుల సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌ల ద్వారా తెలియజేశామని ఆయన తెలిపారు. హాల్‌టికెట్‌తో పాటు ఒరిజనల్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలన్నారు. ఈనేపథ్యంలో గురువారం సాయంత్రం స్థానిక డీఆర్వో కార్యాలయంలో డీఆర్వో చిన్నఓబులేషు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహించే నిర్ధిష్ట సమయానికి అరగంట ముందు మాత్రమే అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతించాలన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జనరేటర్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సాంకేతిక సమస్యలను తలెత్తకుండా సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వైద్యశిబిరం, పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీడీ లక్ష్మానాయక్, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి జగన్నాధరావు, డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, శింగరాయకొండ సీఐ హజరత్తయ్య, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు గరికమిట్టలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- గ్రానైట్‌తో సుందరంగా నిర్మించిన సీతారామంజనేయస్వామి ఆలయం



గ్రానైట్‌రాయితో నిర్మించిన నూతన ఆలయం



ప్రతిష్ఠామూర్తుల ఊరేగింపులో భక్తులు

చీమకుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని గరికమిట్టలో నూతనంగా నిర్మించిన సీతారామంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను ఘనంగా నిర్వహించటానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 7:15 గంటలకు విగ్రహాల ప్రతిష్ఠ, 7:45కు ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయనున్నారు. సీతారామంజనేయస్వామి ఆలయం మొత్తం పూర్తిగా గ్రానైట్ రాయితో సుందరంగా నిర్మించారు. దీంతో ఆలయం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది. మధ్యాహ్నం 12గంటలకు స్వామివారి కళ్యాణ మహెత్సవాన్ని రమణీయంగా జరుపనున్నారు. అయిలావఝ్జుల రామకృష్ణశాస్త్రి, శివకుమార్‌శాస్త్రిల పర్యవేక్షణలో ప్రతిష్ఠాకార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం అన్నదానాన్ని జరపటానికి దేవస్థాన కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కాగా మహోత్సవాల్లో భాగంగా గురువారం విశేషహోమాలు, మహస్నపనము, ధాన్యాదివాసం, పుష్ప శయాధివాసం, గ్రామోత్సవాన్ని జరిపారు.

సచివాలయ ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి



డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్‌ఎం గ్రేడ్-3లకు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు వెంటనే ఫైనల్ సీనియారిటీ జాబితాను ప్రకటించాలని ఏపీ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. గురువారం ఒంగోలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సబ్‌సెంటర్లలో ఎంపీహెచ్ఏ(ఎఫ్) ఖాళీలను ప్రకటించాలని, కొంతమంది ఏఎన్‌ఎంలకు సర్వీస్ మార్కులతో పాటు బోనస్ మార్కులు 15మార్కులు కలిశాయని, ఆ మార్కులు ఎందుకు కలిశాయో వివరణ ఇప్పించాలని కోరారు. సచివాలయాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ జీపీఎస్ ఇంటింటి మ్యాపింగ్ సర్వేలు చేయాలని వత్తిడి చేస్తున్నారని, దీనిని రద్దుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తాళ్ళూరి వెంకటేశ్వర్లు, జి.నాగేశ్వరరావు, వై.సుభాషిణి, కాలం సుబ్బారావు, స్వర్ణలత, వై.సరస్వతి, డి.అనిత, పి.పద్మావతి, ఎస్.సౌభాగ్యం, ఎం.గీత, బి.లక్ష్మి, జె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంపై సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు

- యువతిని విచారించిన పోలీసులు

ఒంగోలుక్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో ఓ యువతి అసభ్యకరమైన పోస్టింగ్‌లు పెట్టారు. ఈ మేరకు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ముత్యాల కళ్యాణ్ ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల ఒకటో తేదీన కేసు నమోదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు పోస్టింగ్‌లు పెట్టింది ఓ మహిళగా గుర్తించారు. తెలంగాణ రాష్ట్ర నల్గొండకు చెందిన పెద్దిరెడ్డి సుధారాణిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం 41 సీఆర్పీసీ ప్రకారం నోటీసులు ఇచ్చి పంపించినట్లు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.

నేడు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యో తి): మునిసిపాలిటీ, కా ర్పొరేషన్‌లో పనిచేస్తున్న సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ శుక్రవారం ఉదయం పది గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరుగుతుందని డీఈవో కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అన్ని పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలి



నిత్యావసరాలు పరిశీలించి మాట్లాడుతున్న పద్మావతి

మేదరమెట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రహరీలు లేని పాఠశాలలకు ప్రహరీలను నిర్మించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని రావినూతల, దైవాలరావూరు, పమిడిపాడు, కొరిశపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కుర్రవానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. రావినూతలలో పాఠశాల రికార్డులను పరిశీలించి పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజన పథకం హాజరును పరిశీలించి, పిల్లలతో కలిసి భోజనం చేశారు. కుకింగ్ ఏజెన్సీలను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంఈవోలు ఎల్.పున్నయ్య, బి.వీ రరాఘవులు, సీఐ మల్లికార్జునరావు, ఎస్‌డబ్ల్యూవో వీరాంజనేయులు, మహిళా కానిస్టేబుల్ శారద ఉన్నారు.



న్యూజిలాండ్ ప్రధాన మంత్రి తో ఎమ్మెల్యేలు ఏలూరి, నరేంద్రవర్మలు

న్యూజిలాండ్ ప్రధానితో ఏలూరి, వర్మ భేటీ

పర్చూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర తెలుగు అసోసియేషన్ న్యూజిలాండ్ ఎన్ఆర్ఐ టీడీపీ వారి ఆహ్వానం మేరకు న్యూజిలాండ్ వెళ్లిన పర్చూరు, బాపట్ల ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, నరేంద్ర వర్మ గురువారం అదేశ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారితో ఏపీ సీఎం చంద్రబాబు విజనరీ లీడర్ అని, ఆయన సారథ్యంలో ఏపీ అభివృద్ధి చెందుతుదని క్రిస్టోఫర్ తెలిపారు. ఏపీకి రావాలని ప్రధానిని ఏలూరి, నరేంద్ర వర్మ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఇక్కడున్న వనరులను వివరించారు. కియా కార్లు ఏపీ నుంచి న్యూజిలాండ్‌కు వస్తున్నాయని కితాబిచ్చారు. అసోసియేషన్ నేతలు మద్దుకూరి దిలీప్, ఆశోక్ గోరంట్ల తదితరులు ఉన్నారు.

ఉపాధి నిధులతో గ్రామాల అభివృద్ధి

చినగంజాం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ నిధుల ద్వారా గ్రామాలు అభివృద్ధి చేసుకోవచ్చునని ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి అన్నారు. మండలంలోని చినగంజాం, కడవకుదురు, గొనసపూడి, సంతరావూరు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 2025-26 సంవత్సరానికి సంబధించి పనులు గుర్తింపుపై గురువారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను, సదుపాయాలను రైతులకు, కూలీలకు వివరించారు.



కేజీబీవీలో కుళ్లిన కూరగాయలను పరిశీలిస్తున్న చైర్మన్

మెనూ ప్రకారం భోజనం అందించకుంటే చర్యలు

- ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

వేటపాలెం/చీరాలటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుంటే సంబంధీకులపై చర్యలు తప్పవని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. చీరాల, వేటపాలెంలో పరిధి, ఈపూరుపాలెంలో ఎలిమెంటరీ స్కూల్, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, దేశాయిపేటలోని ఎంఎల్ఎస్ పాయింట్, ఎండీఎం వాహనం, జాండ్రపేట హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. కేజీబీవీ వంటగదిలో కుళ్లిన కూరగాయలు ఉండడం చూసిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభు త్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. బాధ్యులకు నోటీసులు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏజెన్సీలు తమకు రావల్సిన బిల్లులు పూర్తి స్థాయిలో అందుకుంటూ, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుండా ఉండడం దారుణమన్నారు. పాలు, కూరగాయలు, చికెన్ తదితర పౌష్టకాహారాన్ని ఇవ్వకుండా రేట్లు పెరిగాయని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ధరలు తగ్గితే బిల్లులు వెనక్కి ఇస్తారా అని ప్రశ్నించారు. వేటపాలెం హైస్కూల్లో 210 మంది విద్యార్థులు ఉంటే అందుకుగాను 2.10 కిలోల కందిపప్పు వేయాలి. అయితే అక్కడున్న సాంబారులో కనీసం కేజీకి మించి లేకపోవడం తన దృష్టికి వచ్చిందన్నారు. అవకతవకలకు పాల్పడినవారికి హెచ్చరికలతో పాటు నోటీసులు జారీ చేశారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.



కొబ్బరికాయ కొట్టి ఇంటిని ప్రారంభిస్తున్న యూట్యూబర్ శ్రీదేవి

యూట్యూబర్ పెద్ద మనసు

- పేదింటి మహిళ ఇంటి నిర్మాణానికి రూ.6.50లక్షల ఆర్థికసాయం
- గృహప్రవేశానికి హాజరైన శ్రీదేవి

మద్దిపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం గార్లపాడు గ్రామంలో నిరుపేద మహిళ ముత్తనపల్లి రమణ ఇంటి నిర్మాణానికి వైజాగ్‌కు చెందిన ప్రముఖ యూట్యూబర్ ఎంఎస్.శ్రీదేవి ఆర్థిక సహాయాన్ని అందజేసి పెద్దమనసును చాటుకున్నారు. గత సంవత్సరం మండలంలోని పలు గ్రామాలలో పలువురు పేదలకు ఆర్థిక సహాయం అందజేసిన శ్రీదేవి గార్లపాడు పునరావాస కాలనీలోని రమణ పరిస్థితిని తెలుసుకున్నారు. ఆమె ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ.6.50 లక్షలు తాను భరించి నిర్మాణ బాధ్యతను గ్రామ సర్పంచ్ దేవరపల్లి గంగిరెడ్డికి అప్పగించారు. ఆ ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో గురువారం శ్రీదేవి దగ్గరుండి గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శ్రీదేవి దాతృత్వానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగిరెడ్డి, గంగయ్య, కాలనీకి చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

గుండ్లకమ్మలో ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు

అద్దంకి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులతో కలిసి సరదాగా ఈత కు వెళ్లిన యువకుడు తేలుకుట్ల నారాయణ, గుండ్లకమ్మ నదిలో గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం బట్లపల్లికి చెందిన తేలుకుట్ల నారాయణ, వేంపాడుకు చెందిన కావూరి ఫిలిప్, కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెంకు చెందిన నేరేళ్ల వెంకటేష్, చిక్కాల భరత్‌నాయుడు గురువారం సాయంత్రం గుండ్లకమ్మ నదిలో తిమ్మాయపాలెం సమీపంలో ఊటబావుల వద్ద సరదాగా ఈతకు వెళ్లారు. తేలుకుట్ల నారాయణ గుండ్లకమ్మ నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మునిగిపోయాడు. ఫిలిప్ కూడా మునిగిపోతుండగా మిగిలిన ఇద్దరు కలిసి బయటకు లాగారు. విషయం తెలుసుకున్న సీఐ కృష్ణయ్య, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. కళ్ల ఎదుటే స్నేహితుడు మునిగిపోవడంతో తల్లడిల్లిపోయారు. నారాయణకు ఏడాది బాబు ఉండగా, భార్య నిండు గర్భిణి. విషయం తెలుసుకున్న కటుంబసభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని వెతుకుతున్నారు.

కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వేటపాలెం(చీరాల), నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : రామన్నపేట సమీపంలోని కాలువలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కన్పించింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం అతని వయస్సు 45-50 సంవత్సరాల మధ్య ఉంటుందని, పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

- గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు

పంగులూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భగవాన్‌రాజుపాలెం ఫ్లైవోవర్ సమీపంలో జాతీయ రహదారిపై ఆటో ఢీకొన్న ఘటనలో పల్లి సాంబశివరావు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు.. ఏలూరు జిల్లా నాగుల దేవరపాడు గ్రామానికి చెందిన పల్లి సాంబశివరావు గురువారం మధ్యాహ్నం విధి నిర్వహణలో భాగంగా హోండాయ్ కారులో ఒంగోలుకు వెళ్తన్నారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం ఫ్లైవోవర్ సమీపంలో కారుదిగి రోడ్డు మార్జిన్‌లో మూత్రవిసర్జనకు వెళ్లి వస్తున్న క్రమంలో అదే రహదారిలో ఒంగోలు వైపు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాంబశివరావు తలకు గాయం కాగా, ఆటో డ్రైవర్, ఆటోలో ఉన్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ముగ్గురినీ చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సాంబశివరావుకు మెరుగైన వైద్యానికి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన ఆటో డ్రైవర్‌ను ఒంగోలుకు తరలించారు. రేణంగివరం పోలీసులు ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాంబశివరావు పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

మహిళపై దాడి కేసు కొట్టివేత

అద్దంకి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహిళపై దాడి చేసిన కేసు ను కొట్టివేస్తూ గురువారం అద్దంకి కోర్టులో తీర్పు చెప్పారు. సంతమాగులూరు మండలం సజ్జాపురానికి చెందిన మహిళ 2010 సెప్టెంబరు 27వ తేదీన పొలంలో పనిచేస్తుండగా అదే గ్రామానికి చెందిన ధూళిపాళ్ల అంజమ్మ, బాపయ్య, పావులూరి శ్రీమన్నారాయణతో పాటు మరో ఐదుగురు కలిసి దాడి చేశారు. దీనిపై అప్పట్లో సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నేరం రుజువు కాకపోవడంతో గురువారం అసిస్టెంట్ స్పెషల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి కేసును కొట్టివేసినట్లు నిందితుల తరపున వాదించిన సీనియర్ న్యాయవాది నాదెండ్ల దశరథరామయ్య తెలిపారు.

కోలలపూడి పొలాల్లో మోటారు వైరు చోరీ

మార్టూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కోలలపూడి గ్రామంలోని పొలాల్లో ఉన్న కరెంట్ మోటార్‌కు ఉన్న సర్వీసు వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. పొలాల్లో కూరగాయలు, మిరప తదితర పంటలు సాగులో ఉండగా ఇలా జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం నీరు పెట్టేందుకు వెళ్లగా వైరు దొంగిలించినట్లు రైతులు గుర్తించారు. సుమారు 20 మందికి పైగా రైతులకు చెందిన పొలాల్లో చోరీ జరిగినట్లు తెలిసింది.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్),నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :మాజీ హోంగార్డు భార్యను వేధిస్తుండడంతో ఆమె ఈపూరుపాలెం పోలీసులను ఆశ్రయించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

చీరాల మండలం కొత్తకావూరివారిపాలెంకు చెందిన పల్లపట్ల లక్ష్మికి సుమారు 9 సంవత్సరాల కిందట బాపట్ల మండలం మచ్చావారిపాలెంకు చెందిన హోంగార్డు శివ మల్లికార్జునరెడ్డితో వివాహం జరిగింది. ప్రస్తుతం వీరికి 04, 02 వయసు గల ఇద్దరు కుమార్తెలున్నారు. అయితే పెళ్లయిన కొద్దికాలం తరువాత భర్త మద్యానికి బానిసై భార్యను వేధించడం మొదలుపెట్టారు. కొంతకాలం తరువాత ఏమి జరిగిందో తెలియదు గానీ హోంగార్డు ఉద్యోగం కూడా పోయింది. తరచూ గొడవలు జరుగుతుండడంతో ఆరు నెలలుగా భార్య లక్ష్మీ పుట్టింటి వద్దే ఉంటోంది. నెలలు గడుస్తున్నా అతనిలో మార్పు రాకపోగా, కాపురానికి కూడా తీసుకు వెళ్లడం లేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భర్త, కుటుంబ సభ్యుల మీద కేసు నమోదు చేశారు.

ఆధార్ సేవలు వినియోగించుకోండి

తహసీల్దార్ సింగారావు

పంగులూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు సచివాలయం-2లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని తహసీల్దార్ పీ సింగారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ఎస్టీ వర్గాలకు చెందిన ఎరుకుల, యానాది కులాలకు చెందిన వారు ఆధార్ కేంద్రంలో కార్డులు తీయించుకోవాలని కోరారు.వీరితో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఆధార్ కార్డు సవరణలు, కొత్తగా ఆధార్ కార్డు తీయించుకునే అవకాశం ఉందన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆధార్ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను తహసీల్దార్ పరిశీలించారు.

మాజీ ఎంపీపీ వీరబ్రహ్మం మృతి


వీరబ్రహ్మం

మక్కెనవారిపాలెం (సంతమాగులూరు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామానికి మాజీ ఎంపీపీ కాశీపోగు వీరబ్రహ్మం (70) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. వీరబ్రహ్మం సం తమాగులూరు ఎంపీపీగా 2009 నుంచి 2014 వరకు పని చేశారు. అతనికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. పలువురు నాయకులు వీరబ్రహ్మం మృతదేహానికి నివాళులర్పించారు.

శిథిలావస్థలో ఆర్టీసీ బస్టాండ్

- భవనం నుంచి ఊడుతున్న పెచ్చులు
- కంపుకొడుతున్న మురుగు నీరు
- ప్రాంగణంలో పెరిగిన ముళ్ల చెట్లు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు




కూలేందుకు సిద్ధంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ పెచ్చులూడిన స్లాబు


అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

పర్చూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. భవనం దెబ్బతిని పెచ్చులు ఊడి ప్రయాణికులపై పడుతున్నాయి. అయినా పట్టించుకునేవారే లేరని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సుల కోసం బస్టాండ్‌లో నిరీక్షించే సమయంలో ఏం ప్రమాదం జరుగుతోందోనని వారు భయపడుతున్నారు. ఇక్కడ విద్యుత్ సరఫరా కూడా అంతంతమాత్రంగానే ఉంది. తరచూ మరమ్మతులతో అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఆవరణలో మురుగు నీరు నిలిచి తీవ్రమైన కంపు కొడుతోంది. ప్రాంగణం చుట్టూ ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో వచ్చిపోయే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. పర్చూరు నియోజకవర్గ కేంద్రంతోపాటు, చుట్టుపక్కల ప్రధాన పట్టణాలకు కూడలి కావడంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు పర్చూరు మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంది. దీంతో ప్రతి వాహనం బస్టాండ్ నుంచే రాకపోకలు చేయాల్సి ఉంది. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లాల్సిన వారు ఆర్టీసీ బస్టాండ్‌కు రావలిసిందే. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఆర్టీసీ బస్టాండ్ కూలేందుకు సిద్ధంగా ఉన్నా సంబంధిత అధికారులు మౌనంగా ఉండడం పై ప్రయాణికులు, ప్రజలు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. మరోవ క్క దీనికి చెందిన స్థలం కూడా ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు.

వైసీపీ పాలనలో నిర్లక్ష్యం

వైసీపీ పాలనలో ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణ గాలికి వదిలేశారు. భవనం పెచ్చులూడి ప్రయాణికులు గాయపడుతున్నా కనీసం మరమ్మతులు కూడా చే యలేదని, పూర్తి నిర్లక్ష్యానికి గురైందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరుగుదొడ్లు అధ్వానం

దూర ప్రాంతాల నుంచి బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు కనీస వసతలు కూడా లేవు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళల పరిస్థితి దయనీయంగా మారింది.

అభివృద్ధి చేస్తాం

పర్చూరు ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితి తన దృష్టిలో ఉంది. బస్టాండ్ శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

- శ్యామల, ఆర్టీసీ డీఎం, చీరాల


సభ్యత్వ కార్డును అందజేస్తున్న టీడీపీ నేత గౌరీఅమర్‌నాథ్

ప్రాంతీయ పార్టీలలో టీడీపీకి ప్రత్యేక స్థానం

- సభ్యత్వ నమోదులో గుర్తింపు తెండి : గౌరీ అమర్‌నాథ్

కొత్తపేట(చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రాంతీయ పార్టీలలో టీడీపీకి ప్రత్యేక స్థానం ఉంది. అధికార పక్షంగా ఉన్నా, ప్రతి పక్షంగా ఉన్నా ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగడం అందుకు కారణమని టీడీపీ నేత గౌరీ అమర్‌నాథ్ అన్నారు. గురువారం నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కొన్నిచోట్ల సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే మూల స్తంభాలన్నారు. పార్టీ శ్రేణులు సమిష్టిగా సభ్యత్వ నమోదులో ముందుండి, చీరాల నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తేవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

అద్దంకిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన ధరలకు అనుగుణంగా మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల జీతాలను పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్ అన్నారు. గురువారం సుందరయ్య భవనంలో అద్దంకి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మజుందార్ మాట్లాడుతూ 2018కి ముందు పారిశుధ్య కార్మికులతో పాటు ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు ఉండేవని, ప్రస్తుతం వారికంటే తక్కువ జీతాలు తీసుకుంటూ చాలీచాలని జీతాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. 10వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం అద్దంకి మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అధ్యక్షుడిగా శామ్యూల్, కార్యదర్శిగా జాన్, సభ్యులుగా మార్కు, మారుతి, రవితేజ, అశోక్, ప్రేమ్ మరికొంతమందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్లు, జాషువా పాల్గొన్నారు.

హెచ్ఐవీపై పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ శేషగిరిరావు

మార్టూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాలపై గురువారం స్టేషన్‌లో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన పోస్టర్‌ను సీఐ ఎం.శేషగిరిరావు ఆవిష్కరించారు. వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవల్సిన వైద్యం, జాగ్రత్తలపై హెల్ప్ సంస్థ తీసుకుంటున్న చర్యలను సీఐ అభినందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ సాగర్, బృందం సభ్యులు కే దుర్గా, రూతు, సల్మా, ప్రమీల, రమ్య, సరోజని పాల్గొన్నారు.

24న చినగంజాంలో బైబిల్ పరీక్ష

చినగంజాం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లోని పెద్ద చర్చి వద్ద ఈ నెల 24వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు బైబిల్ పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఎం.మేషక్‌బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక అంబేద్కర్‌నగర్ పెద్దలు, అంబేద్కర్ నగర్ ఎంప్లాయీస్ అసోసియేషన్, యూత్ సభ్యుల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20లోపు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలకు క్రిస్మస్ పండుగ రోజు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9849714691 నెంబరుని సంప్రదించాలని మేషక్‌బాబు కోరారు.

కేన్సర్ నివారణకు ముందస్తు పరీక్షలు

డాక్టర్ బాలరాజేశ్వరి

పంగులూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్‌ను గుర్తించేందుకు క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి బాలరాజేశ్వరి అన్నారు. జాతీయ కేన్సర్ నివారణ దినం సందర్భంగా మండలంలోని పంగులూరు, మల్లవరం గ్రామాలలో పాఠశాల చిన్నారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య వంతమైన ఆహారం తీసుకోవడం, మత్తు పానియాలకు దూరంగా ఉండడం, 18 ఏళ్ల వయస్సు నిండిన వారు వైద్య పరీక్షలు చేయించుకోవడం ఆచరించాలన్నారు. రొమ్ములో గడ్డలు, ఆహారం మింగడంలో ఇబ్బంది, దగ్గు, పుట్టు మచ్చలలో మార్పులు రావడంవంటి లక్షణాలుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు కృష్ణకుమార్, హెచ్‌ఎం రమాదేవి, సీహెచ్‌వో భారతి, అనూరాధ, హరిబాబు, స్టాఫ్ నర్స్ రాఘవమ్మ, పద్మావతి, జానకి, బిందుపావని, ఆరోగ్య కార్యకర్త సతీష్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బల్లికురవ : కేన్సర్‌ను తరిమికొట్టేందుకు ప్రజలు సహకరించాలని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమీజ్‌అహ్మద్ కోరారు. గురువారం కేన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్యులు రవితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల : ముందుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలతో కేన్సర్‌ను దూరం చేయవచ్చని మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు చిట్టిబాబు అన్నారు. గురువారం మేదరమెట్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమలో డాక్టర్ నిఖీలా రెడ్డి, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ మనోజ్, డాక్టర్ అక్షిత, డాక్టర్ రాజశేఖర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం : పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది చినగంజాం గ్రామంలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు మానుకోవాలని, మత్తు పానీయాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలని విజయభాస్కర్ సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఝాన్సీరాణి, హెల్త్ సూపర్‌వైజర్ చిరంజీవి, ల్యాబ్ టెక్నీషియన్ శ్యామ్, హెల్త్ అసిస్టెంట్ ఎస్.మురళి, మహేష్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్టూరు : ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందికి, రోగులకు కేన్సర్‌పై రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కేన్సర్‌ను ఎలా గుర్తించాలి, వైద్య సేవలను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, డాక్టరు భానుచంద్రనాయుడు, డాక్టర్లు పాల్గొన్నారు.

ఇంకొల్లు : పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం కేన్సర్ నిర్మూలనా దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపడుతున్నట్లు వైద్యాధికారులు టీ అంజలి, భానుప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కోటేశ్వరరావు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మల్లవరంలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఎంపీడీవోకు అస్వస్థత

వేటపాలెం(చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో రాజే ష్‌బాబు అస్వస్థతకు గురయ్యారు. గుండె నొప్పితో ప్రై వేటు వైద్యశాలలో చేరారు. అనంతరం విజయవాడకు తరలించారు.

ప్రకృతి వ్యవసాయంతోనే మానవాళికి ఆరోగ్యం


కషాయాల తయారీని పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ, అధికారులు

అద్దంకిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతోనే మానవాళికి ఆరోగ్యం అని బాపట్ల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ అన్నారు. గురువారం మండలంలోని గోవాడ గ్రామంలో వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ, వ్యవసాయ సిబ్బందితో కలిసి పర్యటించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ మందులు వాడకుండా దేశవాళీ వరి రకాలను పండిస్తున్న నరిశెట్టి రమేష్‌బాబు పొలాలను పరిశీలించారు. రత్నచోడి, జమ్ముతావి, ఇన్నపు సాంబ, చంద్రగుండు, కాలాబట్టి, కాలా భట్, కొల్లం, మధు మాలతి వంటి పది రకాల పురాతన దేశీ రకాలను రమేష్ బాబు తన పది ఎకరాలలో పండిస్తూ ఇతర రైతులకు విత్తనాలను సరఫరా చేయడం, రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా పలు రకాల కషాయాలను వాడి పంటలు పండిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. ఘన జీవామృతం, వేప కషాయం, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం, వంటి కషాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా ఎరువులు, పురుగుమందులు వాడకం వలన భూమి ఆరోగ్యంతో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటార ఏవో వెంకటకృష్ణ కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కోకిల, వనజా రాణి, పద్మలత, నరేంద్ర పాల్గొన్నారు.


గుండ్లకమ్మ నదిలో చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

కార్తీక స్నానాలకు గుండ్లకమ్మలో ఏర్పాట్లు

అద్దంకి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ నదిలో కార్తీక స్నానాలు, దీక్షధారుల స్నానాలకు వీలుగా ఏర్పాట్లను చేశారు. అద్దంకి పట్టణంలోని నర్రావారిపాలెం తెలుగు యువత ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో ఆ ప్రాంతాన్ని చదును చేయించారు. నర్రావారిపాలెం నుంచి గుండ్లకమ్మ నదికి వెళ్లే రోడ్డులో పూర్తిగా చెట్లు పెరగడంతో పాటు వ్యర్థాలను పోసి ఉండడంతో చదును చేయించి గుండ్లకమ్మ నదిలో స్నానాలకు వీలుగా ర్యాంప్‌ను కూడా ఏర్పాటు చేయించారు. దీంతో కార్తీక స్నానాలు చేసే భక్తులతో పాటు మండల దీక్ష తీసుకున్నవారు స్నానాలు చేసేందుకు సౌకర్యవంతంగా మారింది. తెలుగు యువత నేతలు దొప్పలపూడి ప్రసాద్, నర్రా శివకృష్ణ, బిల్లపాటి రామాంజనేయులు, నర్రా సుబ్బయ్య దగ్గరుండి పనులు చేయించారు.


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నేత రామారావు, వార్డు సభ్యులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రూ.40లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మేదరమెట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో విద్యార్థులు, ప్రజలకు ఉపయోగపడే రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మన్నె రామారావు అన్నారు. గురువారం మేదరమెట్లలో రూ.40లక్షల విలువైన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఇంకా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మన్నె దుర్గారావు, గ్రామ నాయకులు మన్నె శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు (డాల్ఫిన్ శ్రీను), పఠాన్ సర్దార్ ఖాన్, వడ్లమూడి శివ, మన్నె యుగంధర్, పుట్టా బుల్లియ్య, ఓగూరి వెంకట్రావు, రేగుల రామాంజనేయులు, పలువురు వార్డు నెంబర్లు, మహిళలు పాల్గొన్నారు.

భద్రతా వారోత్సవాలతో ప్రమాదాలు దూరం



భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు

బల్లికురవ. నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గనులలో భద్రతా వారోత్సవాలు నిర్వహించడం వలన ప్రమాదాలు దూరం అవుతాయని తనిఖీల బృందాల కన్వీనర్‌లు తెలిపారు. గురువారం మండల పరిధిలోని వీర్ల కొండ వద్ద కృష్ణసాయి ఎక్స్‌పోర్ట్స్, సాయి లక్ష్మీ, వీకె గ్రానైట్, సాయి శ్రీనివాస్ గ్రానైట్ క్వారీలలో భద్రతా వార్షోవాలను నిర్వహించారు. తనిఖీ బృందం సభ్యులు భద్రతా చర్యలను పరిశీలించి, నివారణపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తనిఖీల టీం కన్వీనర్‌లు బ్రహ్మయ్యబాబు, ఫక్రుద్దీన్, క్వారీల మేనేజర్లు, యజమానులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల శాఖ కార్యవర్గం ఏకగ్రీవం


ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

చినగంజాం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) చినగంజాం మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.భిక్షాలు బాబు, పరిశీలకులుగా రాష్ట్ర కౌన్సిలర్ పీ.సురేష్, వెలుగొండారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించినట్లు జిల్లా గౌరవాధ్యక్షుడు సిద్ధం పాపారావు తెలిపారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా మెట్టు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ నాయబ్‌రసూల్, గౌరవ అధ్యక్షుడిగా ఎన్.సూర్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా సీహెచ్ వెంకట్, టి.సౌజన్య, కోశాధికారి కోటయ్య, మహిళా కార్యదర్శి కే.సునీత, జిల్లా కౌన్సిలర్‌లు కే.నాగరాజు, జి.అంకమ్మ, పీ.పోతురాజు, పి.ఆదిలక్ష్మి, కార్యదర్శులు డి.నారాయణ, చిలకా కుమార్, కొండేపి రామారావు, రాజాబాబు, పిచ్చుక శ్రీనివాసరావు, ఎస్.అంకయ్య, ఎం.విజయకుమారి, ఎన్.ధనలక్ష్మీ, యూ.సాంబశివరావు, బీవీ రమేష్‌బాబు, మహిళా కన్వీనర్ పర్వత రెడ్డి సరళ, మహిళా కోకన్వీనర్ ఎస్.భవానీకుమారి, మహిళా కమిటీ సభ్యులు పి.హిమవంతేశ్వరి, స్వర్ణలత, ఎన్.అనంతలక్ష్మీ, కే.నాగలక్ష్మీ తదితరులు ఎంపిక కాగా వారందరితో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు ప్రమాణ స్వీకారం చేయించారు.



నేడు ఐఏబీ సమావేశం

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన భవన్‌లో జరగనుంది. కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొనాలని నీటిపారుదల శాఖ ఎస్ఈ దేశానాయక్ ఒక ప్రకటనలో కోరారు. 2024-25 ఖరీఫ్ సాగుకు గాను సోమశిల, కండలేరు జలాశయాల నుంచి తాగు, సాగునీరు, ఇతర అవసరాలకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

యువతకు ఉపాధి కల్పన

త్వరలో నైపుణ్య గణన ● ఎమ్పీడీవోలు, సచివాలయ సిబ్బందికి శిక్షణ

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యువతలో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసి, వారికి ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు నైపుణ్య గణన చేపట్టాలని నిర్ణయించి, ఆ మేరకు త్వరలో తేదీ ప్రకటించనుంది. నైపుణ్య గణన ఎలా చేయాలనే అంశంపై ఇప్పటికే జిల్లాలోని ఎమ్పీడీవోలకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ఇద్దరు ఎమ్పీడీవోలు, మరో ఇద్దరు సచివాలయ సిబ్బందిని మాస్టర్ ట్రైనర్లుగా ఎంపిక చేసి, వీరి ద్వారా సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు.



● సచివాలయం ఒక క్లస్టర్‌గా

పట్టణ, గ్రామాలలో ఒక్కో సచివాలయాన్ని క్లస్టర్‌గా విభజించి మ్యాపింగ్ చేస్తారు. ఆధార్ నెంబరు ఆధారంగా చేస్తున్న ఈ సర్వేలో ఒకరి వివరాలు ఒకేసారి మాత్రమే నమోదవుతాయి. ఈ గణనలో 15-59 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారి విద్యార్హత, కుటుంబ నేపథ్యం తదితర వివరాలు సేకరిస్తారు. ఈ వివరాలన్నీ సచివాలయ ఉద్యోగులు నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేస్తారు. గణన పూర్తయ్యాక ఒక్కొక్కరికి ఒక్కో ప్రత్యేక ఖాతా సిద్ధం చేయనున్నట్లు సమాచారం. మరోవైపు జిల్లాలోని పరిశ్రమల పరిశ్రమల గణన కూడా సమాంతరంగా జరుగుతుంది. నైపుణ్య గణనలో యువత నైపుణ్యాలను నమోదు చేసి పరిశ్రమల యాజమాన్యానికి పంపుతారు. వీరు తమకు అవసరమైన మేరకు యువతను ఎంపిక చేసుకుని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. కలెక్టర్ పర్యవేక్షణలో ఈ సర్వే జరగనుంది. ఇంటింటికి వెళ్లి సర్వే చేయడం, పోర్టల్ ద్వారా అభ్యర్థులే తమ వివరాలు నమోదు చేసుకోవడం, కళాశాలలు, విద్యా సంస్థలలో విద్యార్థులు తమ వివరాలు నమోదు చేయటం ద్వారా నైపుణ్యగణన పూర్తి చేస్తారు. ఈ నెల రెండో వారం నుంచి ఈ నైపుణ్య గణన ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం



నైపుణ్య గణనకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలను ఎంపీడీఓలకు, సచివాలయ సిబ్బందికి నిర్వహించాం. వీరిలో మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి మండల స్థాయిలో శిక్షణ ఇప్పిస్తున్నాము. త్వరలో నైపుణ్య గణనకు సంబంధించి ప్రభుత్వం తేదీని ప్రకటించనుంది. ఆ తర్వాత సర్వే మొదలవుతుంది.

- షేక్ అబ్దుల్ కయ్యూం, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి

14 నుంచి కేన్సర్ స్క్రీనింగ్
- వివరాలు 7లో



నేర శోధన.. వీటితోనే సాధన

పోలీస్ డాగ్స్.. ఈ పేరు వింటే చాలు. దాదాపు నేర పరిశోధన ఓ కొలిక్కి వచ్చినట్టే. హత్యలు మొదలు, దోపిడీలు, చోరీలు ఇలా ఘటనలు ఏవైనా సరే విచారణలో పోలీసులకు వీటి తోడు ఉండాల్సిందే. ఘటనాస్థలిలో వాసనతో మొదలై నిందితులను గుర్తించడంలో వీటికి ఇవే సాటి. పేలుడు పదార్థాల గుర్తింపులోనూ వీటి చాకచక్యం అమోఘం. అందుకే కనిపించని నాల్గవ సింహంగా చెప్పుకునే పోలీసుల విధుల్లో స్నేహితులుగా మెలుగుతున్నాయి. జన్మించిన రెండు నెలల వయసు నుంచే పోలీస్ శిక్షణ పొంది చనిపోయే దాకా అలుపెరగని సేవలు అందిస్తున్నాయి. అలాంటి పోలీస్ డాగ్స్‌పై ప్రత్యేక కథనం...

వివరాలు 6

6 పొగనారుకు పెరిగిన డిమాండ్

ఎస్ఏలకు హెచ్‌ఎంలుగా పదోన్నతి

నెల్లూరు(విద్య), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పాఠశాలల్లో నలుగురు స్కూల్ అసిస్టెంట్లకు సీనియారిటీ ప్రాతిపదికన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం రాత్రి డీఈఓ బాలాజీరావు ఆధ్వర్యంలో సీనియారిటీ జాబితాలో ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతలు నిర్వహించారు. వెంటనే సంబంధిత పాఠశాలల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వులు అందించారు.

● నేడు సర్టిఫికెట్ల పరిశీలన

మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతులు కల్పించేందుకు శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలనకు ఆహ్వానించినట్లు డీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లు పరిశీలిస్తామని, సంబంధిత ఉపాధ్యాయులు హాజరు కావాలని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయాలజీ సైన్స్, సోషల్ సబ్జెక్టులతోపాటు పీఈటీలకు పీడీలుగా పదోన్నతులు కల్పిస్తామన్నారు. అన్ని సర్టిఫికెట్లు జెరాక్స్ కాపీలను సమర్పించాలని, చెక్‌లిస్టులో హెచ్‌ఎం, ఎంఈఓల ధ్రువీకరణ ఖచ్చితంగా ఉండాలని పేర్కొన్నారు.

గ్యాస్ వినియోగదారులంతా ఈకేవైసీ చేయించుకోవాలి : జేసీ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వంట గ్యాస్ కనెక్షన్ కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈకేవైసీ(ఆధార్ అనుసంధానం) చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ సూచించారు. గురవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈకేవైసీ చేయ కపోతే దీపం-2 పథకానికి అనర్హులౌతారనేది అపోహ మాత్రమేనన్నారు. దీపం-1 పథకంలోని లబ్ధిదారులు, ఉజ్వల, సీఎస్ఆర్, జనరల్ కేటగిరి లబ్ధిదా రులందరూ ప్రస్తుత పథకానికి అర్హులేనని స్పష్టం చేశారు. వారి అర్హతల మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్ పొందవచ్చని చెప్పారు. గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్ వద్ద ఉన్న మొబైల్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఉచిత సిలిండర్ కోసం 99,837 మంది బుకింగ్ చేసుకున్నారని, ఇందులో 59,937 మందికి సిలిండర్ డెలివరీ చేసి, సబ్సిడీ మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు చెప్పారు. దీపం-2 పథకం గురించి ప్రజల అనుమానాలు నివృత్తి చేసుకొనేందుకు 1967 నంబరుతో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. స్థానిక సచివాలయాల ద్వారా నేరుగా సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అటువంటి సమస్యలను ప్రత్యేక నెట్ వర్క్ ద్వారా వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎస్వో డీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో కోటా.. ఉజ్వల భవితకు బాట

- నూతన క్రీడా పాలసీని ప్రకటించిన కూటమి ప్రభుత్వం
- భారీగా నగదు ప్రోత్సాహకాలు
- ప్రభుత్వ కొలువుల్లో 3 శాతం రిజర్వేషన్
- శిక్షకులు, క్రీడాకారుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

క్రీడలకు అత్యంత ప్రాధాన్యం పెరిగింది. జీవితంలో స్థిరపడేందుకు క్రీడలు దోహదం చేస్తుండటంతో తల్లిదండ్రులు ఆసక్తి చూపుతూ తమ బిడ్డలకు వారికి నచ్చిన క్రీడాంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. ఏ ప్రాంతంలో పోటీలు జరుగుతున్నా తల్లిదండ్రులే స్వయంగా తీసుకెళుతున్నారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నూతన స్పోర్ట్స్ పాలసీని ప్రకటించారు. రాష్ట్రం నుంచి ఒలంపిక్స్, ఏషియన్ గేమ్స్, జాతీయస్థాయిలో, ఖేలో ఇండియా జాతీయ క్రీడల్లో తొలి మూడుస్థానాల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు భారీగా నగదు ప్రోత్సాహకాలు ప్రకటించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా కింద ప్రస్తుతం అమలవుతున్న 2శాతం ఉద్యోగాలను 3శాతానికి పెంచారు. వీటితోపాటు అంతర్జాతీయ, జాతీయస్థాయి క్రీడాకారులకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థలో క్రీడా శిక్షకుల నియామకాల్లో 50 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తామని ప్రకటించారు. రానున్న 3-4 సంవత్సరాల్లో రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి క్రీడా మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని ప్రభుత్వం ప్రకటించడంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● క్రీడలకు పూర్వ వైభవం

వైసీపీ హయాంలో క్రీడారంగం నిర్వీర్యమైపోవడంతో పాటు ఎంతోమంది క్రీడలకు దూరమయ్యారు. అంతేగా ఉద్యోగాలకు సంబంధించి కొన్ని క్రీడాంశాలను కోటాలో తీసేయడంతో క్రీడాకారులు నష్టపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించడం, క్రీడారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ స్పోర్ట్స్ పాలసీని ప్రకటించడంతో క్రీడలకు పూర్వవైభవం రానుందని క్రీడాకారులు, క్రీడా ప్రముఖులు చెపుతున్నారు. జిల్లాలో ఇప్పటికే పలు క్రీడా వసతులు అందుబాటులో ఉండగా, రానున్న రోజుల్లో మొగళ్లపాళెం అంతర్జాతీయ క్రీడామైదానం, అన్ని నియోజక వర్గాల్లో క్రీడావికాస కేంద్రాలు కూడా సిద్ధం చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో నెల్లూరుజిల్లా క్రీడలకు నిలయంగా మారనుందని క్రీడా ప్రముఖులు తెలిపారు. అలాగే గతంలో ఉన్న అకాడమీలు తిరిగి ప్రారంభించేందుకు, కొత్త అకాడమీల ఏర్పాటుకు ప్రతిపాదనలు కూడా పంపించడం, వీటికి రాష్ట్ర ఉన్నతాధికారులు, శాప్ చైర్మన్ సైతం సుముఖత వ్యక్తం చేయడం క్రీడాభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

రాష్ట్రానికి చెందిన పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్‌లు అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో సత్తా చాటారు. వీరి ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్‌లుగా పోస్టింగ్‌లు ఇచ్చింది. అలాగే విలువిద్యలో జ్యోతి సురేఖ అత్యుత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు పొందడంతో ఆమె ప్రతిభకు గుర్తింపుగా గ్రూప్-1లో ఉద్యోగం లభించింది. ఇలా ఎంతో మంది క్రీడాకారులు స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు నూతన స్పోర్ట్స్ పాలసీని ప్రకటించడంతో క్రీడాలోకం హర్షం వ్యక్తం చేస్తోంది. క్రీడాకారులకు భారీ నగదు ప్రోత్సాహంతోపాటు 2శాతం ఉన్న ఉద్యోగాల స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచడంపై క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



క్రీడాచరిత్రలో ఎన్నడూ లేని విధంగా



క్రీడారంగ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తూ భారీ నగదు ప్రోత్సాహకాలు, ఉద్యోగాల్లో 3శాతం రిజర్వేషన్‌లను సీఎం చంద్రబాబు ప్రకటించడం హర్షనీయం. క్రీడలపై మరింత ఆసక్తి పెరగడంతోపాటు క్రీడలకు ప్రాధాన్యత పెరిగి జిల్లాలో క్రీడాభివృద్ధికి దోహదం చేస్తుంది.

- ఆర్‌కె.యతిరాజ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి

క్రీడాకారులకు ప్రోత్సాహం



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహంతో పేద, మధ్య తరగతి క్రీడాకారులకు చేయూత దొరికింది. చిన్నతనం నుంచి క్రీడలపై ఉన్న మక్కు వతో ఎంతో ఇష్టమైన ఫుట్‌బాల్ క్రీడలో సాధన చేసి జాతీయ స్థాయిలో రాణిస్తున్నా. రాష్ట్ర, జాతీయ క్రీడల్లో పతకాలు సాధించడంతోపాటు కీలకమైన సంతోష్ ట్రోఫీలో పాల్గొనడం గర్వకారణంగా ఉంది.

- ప్రకాష్, జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు

అంతర్జాతీయ పతకాలే లక్ష్యం



అంగవైకల్యం క్రీడలకు అడ్డురాదని నిరూపిస్తూ అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడల్లో పాల్గొని కాంస్య పతకం సాధించాను. క్రీడలకు ఉన్న ప్రాముఖ్యతను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి పాలసీ ప్రకటించడం ఆనందంగా ఉంది. ఎంతోమంది క్రీడాకారులకు ఈ ప్రకటన ఆనందం కలిగిస్తుంది. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరింత ఉత్తమ సాధనతో పతకాలే లక్ష్యంగా రాణిస్తాను.

- భవాని, అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడాకారిణి

బెల్టుషాపులపై ఎక్సైజ్ దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు(క్రైం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్నీ ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలో గల బెల్టు దుకాణాలపై గురువారం అధికారులు విస్తృతంగా దాడులు చేశారు. 13 బెల్టు షాపులపై దాడులు నిర్వహించి 13 మందిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ డీసీ టీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని 182 మద్యం షాపుల యజమానులు ఎక్సైజ్ నిబంధనల మేరకు వ్యాపారం నిర్వహించుకోవాలన్నారు. బెల్టుషాపుల నిర్వహణ, ఎమ్మార్పీ ఉల్లంఘన, సమయ పాలనపై నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నూతన మద్యం పాలసీ అమలులోకి వచ్చినప్పటి నుంచి గురువారం వరకు 62 బెల్టు షాపులపై దాడులు చేసి 62 మందిని అరెస్టు చేశామని, 145.62 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు.

● మద్యం సీసాల స్వాధీనం

ముత్తుకూరు మండలం పంటపాళెం వద్ద ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 60 మద్యం సీసాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక బృందం స్వాధీనం చేసుకుంది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వై. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గద్దె తివిక్రమ్ వద్ద 30 మద్యం సీసాలు, ఎస్ పవన్ వద్ద 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎస్‌డీ కాలేషావలి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉదయగిరి జిల్లా సాధనే లక్ష్యం
● భారీ ప్రదర్శన, మానవహారం 6



నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ గురువారం పల్లకీ సేవలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అంతకుముందు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి చందన అలంకారం, అభిషేకాలు, కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజులు చేసి మొక్కులు చెల్లించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

- దుత్తలూరు (ఉదయగిరి రూరల్, ఆంధ్రజ్యోతి)

నేటి నుంచి కార్తీక లక్ష దీపోత్సవం



నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో శుక్రవారం కార్తీక లక్ష దీపోత్సవం జరగనుంది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతుల సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులు ఈ వేడుక జరగనుంది. భారీ సెట్టింగులు, విద్యుద్దీపాలతో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం గణపతి పూజతో ప్రారంభమయ్యే దీపోత్సవాలు, 10వతేదీ రాత్రి శివపార్వతుల శాంతి కల్యాణంతో ముగియనున్నాయి. ప్రతిరోజూ ఉదయం విశేష అభిషేకాలు, పూజలు, హోమాలు, సాయంత్రం దీపోత్సవం జరుపుతారు. తొలిరోజు సాయంత్రం ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం జరగనుంది. కాగా, ఈ లక్షదీపోత్సవ ఏర్పాట్లను వేమిరెడ్డి దంపతులు గురువారం రాత్రి పరిశీలించారు. కార్యనిర్వాహక కమిటీకి పలు సూచనలు చేశారు. వర్షం వచ్చినా భక్తులు కార్తీక దీపారాధన చేసుకునేలా, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిరాటంకంగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

- నెల్లూరు (సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి)



నేర శోధన.. వీటితోనే సాధన

- పోలీసుల స్నేహితులు.. ఈ శునకాలు

- రెండు నెలల వయసు నుంచే శిక్షణ
- బెల్ట్ వేస్తే ఆన్‌డ్యూటీ అని అర్థమయ్యేలా సాధన
- హ్యాండలర్స్ మాటే వేదవాక్కుగా విధులు

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

రెండు నెలల వయసు ఉన్న కుక్కపిల్లలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ఆ సమయంలోనే సదరు కుక్కపిల్లల తల్లి, తండ్రి, తాతలు ఇలా నాలుగు తరాల వరకు పరిశీలిస్తారు. వాటి జీన్స్ అన్నిటికి అనుకూలిస్తేనే ఆ డాగ్‌ను కొనుగోలు చేస్తారు. ఒక డాగ్ కొనుగోలు చేస్తున్న సమయంలోనే అది ఏ జిల్లాకు పంపాలో నిర్ణయించుకొని ఆ జిల్లా నుంచి హ్యాండ్‌లర్స్‌ను (శిక్షకుడు) డాగ్‌కు శిక్షణ ఇచ్చే కేంద్రం వద్దకు పిలిపిస్తారు. డాగ్స్‌కు శిక్షణ ఇచ్చే కేంద్రం హైదరాబాదులోని మొయినాబాదులో ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత మంగళగిరిలో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రెండు నెలల వయసులో శిక్షణ కేంద్రానికి చేరుకున్న డాగ్‌కు ఓ పేరు పెడతారు. ఎనిమిది నెలలపాటు శిక్షణ ఉంటుంది. మొదటి రెండు నెలలు హ్యాండ్‌లర్స్‌తో మమేకం కావడం, మరో రెండు నెలలు ఒబిడియన్స్, మిగిలిన నాలుగు నెలల పాటు శిక్షణ ఉంటుంది. నార్కొటిక్, ట్రాకర్, ఎక్స్‌ప్లోజివ్, ఎర్రచందనం ఇలా పలు రంగాల్లో శిక్షణ ఇస్తారు. తర్వాత ఆయా జిల్లాలకు డాగ్స్‌ను పంపుతారు.

దినచర్య ఇలా...

జిల్లాలో నాలుగు ఎక్స్‌ప్లోజివ్, రెండు ట్రాకర్ డాగ్స్ అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు రిటైర్డ్ అయిన రెండు మరో డాగ్‌లు ఉన్నాయి. డాగ్ స్క్వాడ్‌కు 9 మంది హ్యాండ్‌లర్స్, ఇద్దరు స్పేర్ హ్యాండ్‌లర్స్ ఉంటారు. అధికారులుగా ఆర్ఐ, డీఎస్పీ, ఏఎస్పీలు ఇద్దరు ఉంటారు. ఉదయం 6 గంటలకు డాగ్స్‌ను నిద్రలేపుతారు. అనంతరం పోలీస్ మైదానంలో శిక్షణ మొదలవుతుంది. 7.30 గంటలకు ఏఆర్ పోలీసు ఆఫీస్‌లో ఉన్న డాగ్ కెనాల్స్‌కు చేరుకుంటాయి. అరగంట విశ్రాంతి తర్వాత 8.30 గంటలకు రాయల్ కేనాల్ ఫీడ్‌ను 250 గ్రాములు చొప్పున అందిస్తారు. 12.30 గంటలకు డాగ్స్‌ను బయటకు వదిలి కాలకృత్యాలు (టూల్స్) పూర్తి చేయించి నీరు తాగిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు మళ్లీ 250 గ్రాముల ఫీడ్ అందిస్తారు. ఇక డాగ్స్ నిద్రపోయేందుకు కేనాల్స్‌లో కూలర్, ఫ్యాన్ తప్పని సరిగా ఉంటుంది. ఒక్కో శునకానికి ఒక్కో గది ఉంటుంది. ముఖ్యమంత్రి, మంత్రులు, పెద్ద జాతరలు, ఉత్సవాలు వంటివి జరిగినప్పుడు డాగ్స్ విధి నిర్వహణలో ఉంటాయి. మన జిల్లాతోపాటు ఇతర జిల్లాలోను వీటి సేవలను ఉపయోగిస్తుంటారు.

> ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. హత్యలు, చోరీలు, దోపిడీలు, పేలుడు పదార్థాల గుర్తింపు ఇలా ఘటనలు ఏవి జరిగినా నేర పరిశోధనకు పోలీస్ డాగ్స్ (శునకాలు) కీలకంగా మారుతున్నాయి. వీఐపీలు, వీవీఐపీల పర్యటనల సందర్భంలోనూ పోలీస్ డాగ్ స్క్వాడ్ వారు పర్యటించే ప్రాంతాలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇలా పోలీసుల విచారణలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తూ నాల్గవ సింహాలుగా పేరు గడించాయి. జన్మించిన రెండు నెలల వయసు నుంచే పోలీస్ శిక్షణలో భాగస్వామ్యం అవుతాయి. చనిపోయే వరకు దేశం కోసం అలుపెరగని సేవలు అందిస్తాయి. అలాంటి శునకాల గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...

హ్యాండ్‌లర్స్ డాగ్స్ ప్రపంచం

రెండు నెలల వయసు నుంచే కుక్కపిల్ల హ్యాండ్‌లర్ కనుసైగల్లో పెరుగుతుంది. సరిగ్గా పదినెలలు పూర్తయ్యాక విధులకు హాజరవుతోంది. అప్పటి నుంచి ఆ హ్యాండ్‌లరే ప్రపంచంగా అది జీవిస్తుంది. నిత్యం వృత్తిలో సేవాలు అందించేందుకు డాగ్స్ తహతహలాడుతాయి. హ్యాండ్‌లర్స్ సూచనలు పాటిస్తూ దోషులను పట్టించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. హ్యాండ్‌లర్‌కు, డాగ్‌కు మధ్య ఉన్న అనుబంధం ఒక మాటలో చెప్పాలంటే వారు ఫీడ్ (మేత) పెట్టకుండా డాగ్స్ ఒక్క పూట కూడా ముద్ద ముట్టవు. హ్యాండ్‌లర్స్ కూడా అంతే ప్రేమతో ఉంటారు.

> 2014లో నగరంలోని ఎస్‌టూ సినిమా థియేటర్ ఎదురుగా ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించింది. అక్కడ నుంచి మృతుడి అత్త, భార్య వద్దకు వెళ్లి నిలుచుంది. దీంతో పోలీసులు వారిని విచారించగా దోషులు ఇంటివారేనని తేలిపోయింది.
>
> 2014లో ఆత్మకూరు ప్రాంతంలో ఓ పెళ్లి ఇంట్లో నగలు ఉన్న బ్యాగ్ దొంగతనానికి గురైంది. ఇంట్లో అందరూ బంధువులే ఉండటంతో ఎవరు దంగతనానికి పాల్పడ్డారో తెలుసుకోవడం కుటుంబ సభ్యులకు, పోలీసులకు కష్టంగా మారింది. అప్పుడే డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగింది. అనుమానితులుగా ఉన్న ఏడుగురిని పోలీసు డాగ్ (లక్కీ) ఎదుట నిలబెట్టారు. డాగ్ తమవైపు రావడాన్ని గమనించి దోషి తానే దొంగతనం చేశానంటూ ఒప్పుకున్నాడు.
>
> 2017లో నాయుడుపేటలో ఓ వ్యక్తిని బండ రాయితో కొట్టి చంపి అక్కడే నిప్పంటించి తగలబెట్టారు. పోలీసులు విచారిస్తున్న సమయంలోనే డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకుంది. రంగంలోకి దిగిన డాగ్ బింధు బండరాయి వద్దకు వెళ్లి అక్కడ నుంచి నేరుగా పక్కనే ఉన్న ఓ గుడిసె వద్దకు చేరుకుంది. అక్కడే తిరుగుతూ ఉండటంతో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఇంకేముంది.. దోసి అతడేనని తేలిపోయింది.


పోలీస్ డాగ్స్ ఆహారం ఇదే!

42 రోజులపాటు సెలవులు

శునకాలకు 42 రోజులాటు సెలవులు కేటాయిస్తారు. ఒక్కసారి డాగ్ స్క్వాడ్‌లో డాగ్ వచ్చిన తర్వాత ఇక శారీరక జీవితానికి అవి దూరం కావాల్సిందే. మగదానికి మెంటింగ్, ఆడదానికి క్రాసింగ్ చేయడం జరగదు. ఆరు నెలలకు ఒకసారి డాగ్స్‌కు 21రోజులపాటు హీట్ పీరిడ్ ఉంటుంది. ఈ పీరిడ్‌లో డాగ్స్‌ను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటారు.

బెల్టు పడితే డ్యూటీ ఎక్కినట్లే

పోలీసులు యూనిఫాం వేసుకుంటే డ్యూటీలో ఉన్నట్లుగా ఎలా భావిస్తారో.. డాగ్స్‌కు బాడీ బెల్టు (హార్నిస్) వేస్తే డ్యూటీలో ఇవి జాయిన్ అయినట్లు భావిస్తాయి. బెల్టు తీసేంత వరకు విధి నిర్వహణలో నిమగ్నమవుతాయి. హ్యాండ్‌లర్ చెప్పిన విధంగా నడుచుకుంటూ జాగ్రత్తగా విధులు నిర్వహిస్తాయి.

జిల్లాలో నాలుగు డాగ్స్ మృతి

సహజంగా డాగ్స్ పది నెలల వయసులో విధిలో చేరినప్పటికి పది సంవత్సరాలు తర్వాత రిటైర్డ్ అవ్వాల్సిన పరిస్థితి. అయితే డాక్టర్ సూచనల మేరకు వాటిని విధుల్లో పొడిగించే అవకాశం కూడా ఉంటుంది. జిల్లాలో ఇప్పటివరకు డ్యానీ, హెక్టార్ డాగ్స్ మృతివాత పడ్డాయి. 2014లో డ్యాని మృతి చెందగా, 2018లో హెక్టార్ మృతి చెందినప్పుడు అప్పటి ఎస్పీ రామకృష్ణతో పాటు పలువురు ఉన్నతాధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైసీపీ ప్రభుత్వంలో గుంటూరులో ఏర్పాటు చేసిన ట్రాక్టర్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఓ డాగ్ అవిశ్రాంతంగా పని చేసి హీట్‌కు గురై మృతి చెందింది. ఆ తరువాత మరో డాగ్ అనారోగ్యంతో మృతి చెందింది.

> నోట్: వీటితోపాటు 2023 బ్యాచ్‌లో గుంటూరులో శిక్షణ పొందుతున్న డాగ్స్‌లో డానీను జిల్లాకు కేటాయించారు. సహజంగా డాగ్స్ ఇప్పటి వరకు స్నాకర్, ట్రాకర్ వేర్వేరుగా విధులు నిర్వహిస్తుంటాయి. అయితే డానీకి రెండింటినీ చూడగలిగే సామర్థ్యం ఉంది.

డాగ్ పేరు	పుట్టిన రోజు	వయసు	బ్రీడ్	డ్యూటీ	హ్యాండలర్
బింధు (రిటైర్డ్)	22-10-2013	11	జీఎస్‌డీ	ట్రాకర్	బీ సురేష్
గోల్డీ	22-10-2014	10	ల్యాబ్	స్నైపర్	బీ సురేష్
ఏంజిల్	28-02-2018	6. 8 నెలలు	ల్యాబ్	స్నైపర్	ఎం.రాజశేఖర్
రాక్సీ	03-07-2019	5.3 నెలలు	బెల్జియం	ట్రాకర్	సీహెచ్ రమేష్‌బాబు
సింధు (రిటైర్డ్)	27-07-2011	13.3 నెలలు	ల్యాబ్	స్నైపర్	సీహెచ్ రమేష్ బాబు
స్వీటీ	12-02-2019	5.8 నెలలు	ల్యాబ్	స్నైపర్	వీ హేమంత్‌కుమార్
షాడో	04-01-2019	5.9 నెలలు	బెల్జియం	ట్రాకర్	ఎం. రవి
కైరో	20-05-2017	7.5 నెలలు	బెల్జియం	స్నైపర్	ఎస్. తిరుపతి

ఉదయగిరి జిల్లా సాధనకు ఉద్యమం ఉధృతం

- జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్


మానవహారంలో మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

ఉదయగిరి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఉదయగిరి జిల్లా సాధన కోసం ఉద్య మాన్ని ఉధృతం చేస్తున్నట్లు జిల్లా సాధన సమితి అధ్య క్షుడు డాక్టర్ కె.వేణుగోపాల్ స్పష్టం చేశారు. ఉదయగిరి జిల్లా సాధన కోసం ఉద్యోగులు, ప్రజలు, ప్రజాసంఘాలు, విద్యా ర్థులతో కలిసి గురువారం పట్టణంలోని రంగనాయకులస్వామి ఆలయం నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం విలేరులతో వేణుగోపాల్ మాట్లాడుతూ నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లోని 21 మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా జిల్లా చేయాలని ఐదేళ్ల ఉద్యమం చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఉదయగిరిని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దృష్టిలో నెల్లూరు జిల్లా ఆర్థికంగా ఉన్నా మనం ఉదయగిరి మాత్రం వివక్షకు గురవుతోందన్నారు. జిల్లా సాధనకు ప్రజాప్రతినిధులు అందరూ సమష్టిగా ఉద్యమిస్తేనే సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ నిరసనలో జిల్లా సాధన సమితి సభ్యులు దస్తగిరి అహ్మద్, షేక్‌ఎండీ ఖాజా, గాజులపల్లి రామిరెడ్డి, రామచంద్రమూర్తి, సయ్యద్ జాఫర్ మొహిద్దీన్, జీ.ఓబులరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బకీరు జాషువా తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు

కావలి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు హోరా హోరీగా జరుగుతున్నా యి. గురువారం రెండోరోజు జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో జిల్లా జట్ల మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీలు సాగాయి. మొదటి క్వార్టర్ ఫైనల్ పోటీలో నెల్లూరు జిల్లా జట్టు కర్నూలు జిల్లా జట్టుపై 20-16 స్కోర్‌తో, రెండో క్వార్టర్‌లో ఈస్ట్ గోదావరి జట్టు చిత్తూరు జట్టుపై 3-14 స్కోర్‌తో, మూడో క్వార్టర్‌లో శ్రీకాకుళం జట్టు విజయనగరం జట్టుపై 24-15 స్కోర్‌తో నాలుగో క్వార్టర్‌లో కృష్ణ జట్టు అనంతపూర్ జట్టుపై 25-20 స్కోర్లతో గెలిచి సెమీఫైనల్స్‌కు ప్రవేశించాయి. మొదటి సెమీఫైనల్స్‌లో ఈస్ట్‌గోదావరి, నెల్లూరు జిల్లా జట్లు తలపడగా 34-25 స్కోర్‌తో ఈస్ట్‌గోదావరి జట్టు గెలిచి ఫైనల్స్‌కు ప్రవేశించింది. ఆట ప్రారంభానికి ముందు డీబీఎస్ కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను అభినందించారు. శుక్రవారం రెండో సెమిఫైనల్స్ ఫైనల్స్ జరుగుతాయని ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు దామోదర్ తెలిపారు. ఆయన వెంట ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీరేష్, అబ్జర్వర్ సత్యనారాయణ, జిల్లా పీఈటీ సంఘం కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

హాస్టల్ వాచ్‌మన్ బదిలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు7: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలతో వారిని వేకువజామునే నిద్రలేపి ఇబ్బందులకు గురిచేయడంపై గురువారం 'విద్యార్థులపై కక్ష సాధింపా ?' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ స్పందించారు. హాస్టల్ వాచ్‌మన్ ప్రసాద్‌ను జిల్లా కార్యాలయానికి పంపించాలని వార్డెన్ సునీల్‌ను ఆదేశించారు. ఈమేరకు వార్డెన్ వాచ్‌మన్‌ను నెల్లూరు కార్యాలయానికి పంపించగా, బుచ్చి నుంచి నెల్లూరుకి బదిలీ చేసినట్లు తెలిసింది.


కలిగిరి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

పథకాల అమలుపై కలెక్టరు ఆరా

కలిగిరి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): వెలగపాడు పంచాయతీలో గురువారం కలెక్టరు ఆనంద్ క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ పథకాల అమలు పరిశీలించారు. నిర్మాణంలోని గోకులం షెడ్డు పరిశీలించి, నిర్మాణానికయ్యే ఖర్చు, పాడిపశువుల పోషణ లాభనష్టాల వివరాలను అడిగితెలుసుకున్నారు. సోమశిల జలాల నీరు చెరువులకు రానివ్వకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని పలువురు రైతులు కలెక్టరు దృష్టికి తీసుకొచ్చారు. నారాయణపురం నిమ్మతోటలను పరిశీలించి ఉద్యాన శాఖ నుంచి అందే రాయితీల సద్వినియోగంపై నిమ్మ సాగురైతులను అడిగి తెలుసుకున్నారు. పలువురు సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ప్రాధాన్యత మంజూరు చేస్తామని వారికి వివరించారు. తహసీల్దారు రవీంధ్ర బాబు, ఎంపీడీఓ ప్రత్యూష, సర్పంచ్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యతో పాటు పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి

జలదంకి : పల్లెపండుగలో భాగంగా బ్రాహ్మణక్రాక పంచాయతీ 9వ మైలు గ్రామంలో రూ.10లక్షల ఉపాధి నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న జడ్పీహైస్కూల్ అదనపు తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మరుగుదొడ్లను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, కావలి ఆర్డీఓ వంశీక్రిష్ణ, తహసీల్దారు ప్రమీల, డ్వామా పీడీ గంగాభవాని, పీఆర్ఎఈ వాణి, ఎంఈఓ నాగేశ్వరరావు ఎంపీడీఓ బ్రహ్మయ్య, నేతలు మధురెడ్డి మాల్యాద్రిరెడ్డి ఉన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీలకు దరఖాస్తుల ఆహ్వానం



నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బీఎస్ఎన్ఎల్ సిమ్ రీచార్జీ చేసేందుకు ఆసక్తి ఉన్న వారు ఫ్రాంచైజీకి దరఖాస్తు చేసుకోవాలని సంస్థ అధికారి రామ్మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 14 లోపు నగరంలోని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో మార్కెటింగ్ మేనేజర్‌కు అందజేయాలని కోరారు. అల్లూరు, విడవలూరు, కొడవలూరు, కోవూరు మండలాల్లో ఫ్రాంచైజీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయంలోని మార్కెటింగ్ మేనేజర్‌ని సంప్రదించాలని కోరారు.

పొగనారుకు పెరిగిన డిమాండ్

- మూట ధర రూ.4వేల నుంచి 4,500


పెంట్రాలలో సాగు చేసిన పొగనారుమడులు

లింగసముద్రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగు చేసిన పొగనారుకు డిమాండ్ పెరిగింది. పొగనారు మూట రూ.4వేల నుంచి రూ.4,500లకు పలుకుతోంది. ఈ పంట సాగు చేస్తున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సాగు చేసిన పొగాకు ఒక క్వింటం రూ.35వేలు పలకడంతో ఈ ఏడాది రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. పలు గ్రామాల రైతులు నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని గ్రామాలకు వెళ్లి ఉపయోగంలో లేని బ్యారన్‌ల లైసెన్సులను లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసి నిర్మిస్తున్నారు. దీంతో పొగనారు సాగు విస్తీర్ణం పెరిగింది. అయితే గతంలో కురిసిన వర్షాలకు పొగనారు తోటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు మరలా పొగనారు సాగు చేయడంతో మూట పొగనారు ధర కూడా రెండింతలు అయ్యింది. అయితే 20రోజుల క్రితం కేవలం రూ.2వేలు మాత్రమే ఉంది. ఇప్పుడు ఆ ధర రెండింతలు పైనే పెరింగింది. పొగాకు ధరలు పెరగడంతో పొగనారుమడులు, నాట్లు సాగుకు కూలీలకు, దుక్కులకు, ఎరువులు, పురుగు మందుల ధరలు కూడా పెరిగాయి.

న్యూస్ బాక్స్

ఆచార్య ఎన్జీ రంగాకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కావలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు గురువారం ఏడీఏ కార్యాలయంలో ఆచార్య రంగా జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ఎన్జీ రంగా చిత్రపటానికి కళాశాల అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, దుర్గాప్రసాద్, సునీత, శోభ, మాధవి, క్రాంతి పాల్గొన్నారు.

నేటినుంచి సీపీఎం ప్రజాపోరు

కావలి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై ప్రజాపోరు శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య తెలిపారు. గురువారం సీపీఎం కార్యాలయంలో అందుకు సంబంధించిన కరపత్రాలను నేతలు విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, కృష్ణయ్య, బాబురావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కావలి రూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): అన్నగారిపాలెంలో గురువారం పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సమద్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మంత్రి, ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి సూచనల మేరకు నెల్లూరు నారాయణ వైద్యశాల బృందంతో ఏర్పాటు చేసిన శిబిరంలో రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమం టీడీపీ నేతలు నాయకులు పులి రమేష్, సుధాకర్, రమణయ్య పాల్గొన్నారు.

ట్రాక్టరు ఢీకొని ఒకరికి గాయాలు

కలిగిరి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): కలిగిరి-కొండాపురం మార్గంలోని కలిగిరి శివారులో గురువారం రాత్రి ట్రాక్టరును ఢీకొని వ్యక్తి గాయపడ్డాడు. కలిగిరికి చెందిన ట్రాక్టరు కట్టెల లోడుతో క్రిష్ణారెడ్డిపాలెం వైపు వెళ్తుండగా వింజమూరు మండలం నేరేడుపల్లి కండె మనోహర్ కొండాపురం వైపు నుండి వస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టరులోని చిల్లకట్టె మనోహర్ మెడలో బలంగా గుచ్చుకొంది. గాయపడిన అతన్ని ప్రయాణికులు గుర్తించి స్థానిక ప్రవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి నెల్లూరుకు తరలించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కలువాయి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. గురువారం టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి సభ్యత్వాలు నమోదు చేశారు. వారి వెంట పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిద్రమత్తులో ట్రాన్స్‌కో సిబ్బంది

- మండలంలో వందకు పైగా పాడైన ట్రాన్స్‌ఫార్మర్లు
- మరమ్మతులకు నోచుకోని వైనం

జలదంకి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయసీజన్ మొదలై రైతులు వరినార్లు పోసేందుకు సిద్ధం అవుతున్న సమయంలో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లు నెలల తరబడి రిపేర్లు చేయక వ్యవసాయబోర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రైతులు ట్రాన్స్‌కో లైన్‌మెన్లు చుట్టూరా కాళ్లరిగేలా తిరుగుతున్నా సమస్యను పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో సుమారు వందకు పైగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లు ఇటీవల కురిసిన వర్షాలకు పిడుగులు పడి మరమ్మతులకు గురైనట్లు రైతులు వాపోతున్నారు. గట్టుపల్లి పంచాయతీకి లైన్‌మెన్ లేక అక్కడి రైతులు తమ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు



బ్రాహ్మణక్రాకలోని ట్రాన్స్‌ఫార్మర్

చేయించండని కావలి ట్రాన్స్‌కో డీఈని కలిసేందుకు రాగా ఆయన అందుబాటులో లేకపోవడంతో వెనుతిరిగిపోయారు. విద్యుత్ సరఫరా లేక రైతులు వరినారుమళ్ళు పోసుకోలేకపోతున్నారు. కేవలం వ్యవసాయం పైనే ఆధారపడిన మా సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ట్రాన్స్‌కో ఎస్ఈ స్పందించాలి

మండలంలో ట్రాన్స్‌కో వ్యవస్థను గాడిలో పెట్టేలా ఎస్ఈ స్పందించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా విద్యుత్ సమస్యలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మండలంలో పలుచోట్ల లైన్‌మెన్లు లేక సిబ్బంది కొరతతో ఉన్న సిబ్బందిపై భారం పడుతోంది. ఈ సిబ్బంది కొరతను తీర్చి మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లు యుద్ధప్రాతిపదికన రిపేరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

కేన్సర్‌పై వైద్యుల అవగాహన ర్యాలీ

ఏఎస్ పేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సురేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం పీహెచ్‌సీ నుండి బస్టాండ్ సెంటర్ వరకు క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలు, మద్యం, సిగరెట్, పొగాకుకు దూరంగా ఉండాలన్నారు. ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుండి రక్షణ పొందవచ్చన్నారు. ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● కలిగిరి,(ఆంధ్రజ్యోతి): కాన్సర్‌వ్యాధి అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రా థమిక ఆరోగ్యవైద్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి మాటా్లడారు. 30ఏళ్లు నిండిన వారు క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎన్‌సీడీ 3.0సర్వేతో ప్రతి కుటుంబంలోని సభ్యులందరికీ ఈ స్ర్కీనింగ్ పరీక్షలు గురించి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సాయిలక్ష్మి పాల్గొన్నారు.



కలిగిరి : ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

● ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): గండిపాళెం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యఆరోగ్య సిబ్బంది వైద్యాధికారి శివకల్పన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వ హించారు. ప్రతి సచివాలయం పరిధి లో కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, టీబీ సూప ర్‌వైజర్ బోగ్యం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి : ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

● సీతారామపురం, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో కేన్సర్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఓ మజీద్, రియాజ్, శేఖర్‌రాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

15రోజుల్లో ఎఫ్ లైన్ సర్వే

● కోటేశ్వరరావు, కొండాపురం తహసీల్దార్



కొండాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వేలో రైతులకు పాసుపుస్తకాల విషయంలో తప్పులుంటే దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు కోటేశ్వర రావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 15రోజులకు ఎఫ్‌లైన్ సేర్వేతో తప్పులు సరి చేస్తామన్నారు.

? కౌలురైతులకు ఎన్ని కార్డులు ఇచ్చారు.

! ఇప్పటివరకు 1600 మందికి అందజేశాం. అర్హులు దరఖాస్తు చేసుకుంటే వారంలో అందజేస్తాం.

? గ్రీవెన్స్‌సెల్‌లో అర్జీదారుడికి పరిష్కారం దొరుకుతుందా!

! దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ఆధారాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశానుసారం పరిష్కారిస్తాం.

? రిజిష్టరు డాక్యుమెంటు రైతులు మ్యుటేషన్ ఎలా చేయాలి.

! ఆన్‌లైన్‌లో పేర్లు మార్పునకు దరఖాస్తు చేసుకుంటే 45రోజుల్లో పేర్లు మార్చి ఈ-పాస్‌బుక్కును అందజేస్తాం.

ఇస్కపాలెంలో రక్తదాన శిబిరం



శిబిరంలో పాల్గొన్న దామా శివబాబు తదితరులు

కొండాపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): సాయిపేట పంచాయతీ ఇస్కపాలెం టీడీపీ నేత దామా మస్తానయ్య ప్రథమ వర్థంతి సందర్భంగా ఆయన కుమారుడు దామా శివబాబు గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కాకర్ల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి స్థానిక యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గంటా లక్ష్మీనర సింహులు, మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, గుడవల్లూరు సొసైటీ మాజీ చైర్మన్ కుంకు మోహనరావు, సాగునీటిసంఘ మాజీ అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, బొల్లినేని వెంకటరమణయ్య, మామిళ్లపల్లి వెంకట రమణయ్య, తాటికొండ ప్రవీణ్, కావలి రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవోగా జానకీరామ్

కందుకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ డీఈఓగా జానకీరామ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధసంఘాల నాయకులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూటీఎఫ్ నాయకులు ముప్పరాజు కోటేశ్వర రావు, దామా కొండపనాయుడు, చిత్తూరు వెంకటేశ్వర్లు, పొన్నగంటి వెంకటేశ్వర్లు, రవి, పవన్, రమేష్, విప్ర నారాయణ ఆయన్ను కలిసిన వారిలో ఉన్నారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

కందుకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా బాస్కెట్ బాల్ మహిళలు, పురుషుల జట్లను ఎంపిక చేశారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, టీఆర్ఆర్ పీడీ తొట్టెంపూడి సుబ్బారావు ఆధ్వర్యంలో నైపుణ్యం ప్రదర్శించిన 16 మందిని పురుషుల జట్టుకు, 14 మందిని మహిళల జట్టుకు ఎంపిక చేశారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనున్నారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి రవీంద్ర, టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, పీడీలు సోమినేని సురేష్, సయ్యద్ జిలానీబాషా పాల్గొన్నారు.

కరేడు విద్యార్థుల ప్రతిభ

ఉలవపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాల్‌బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి పోటీల్లో కరేడు విద్యార్థులు డొడ్ల యోషితా రెడ్డి, కంబోతు గాయత్రి, కసుకుర్తి నిహాల్, గద్దె హృదయ సందేష్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ ఓగుబోయిన శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీరిని స్కూల్ కమిటీ చైర్మన్ బాలేశ్వ రరావు, కాటబత్తిన కృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించినట్లు తెలిపారు.

సీఎం సహాయనిధి ఎల్‌వోసీ అందజేత

కందుకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బలిజపాలెం దారా కల్యాణి ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు అయ్యాయి. అందుకు సంబంధించిన ఎల్‌ఓసీని గురువారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు బాధితులకు అందజేశారు. ఆమె కుటుంబీకులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఆపరేషన్ ఖర్చులకు అవసరమయ్యే ఖర్చును సీఎం సహాయనిధి నుంచి మంజూరు చేయిం చినట్లు పార్టీ నేతలు తెలిపారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కావలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రాలు పంచారామాలు, శ్రీశైలం, అరుణాచలంకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కావలి ఆర్టీసీ డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.



సమస్యలపై ప్రజాప్రతినిధుల ఏకరువు



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వరరావు

గుడ్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతూ, పొలాల్లోని మోటార్ పంపుసెట్లు కాలిపోతున్నట్లు అలాగే రక్షిత మంచినీటి పథకాలు సక్రమంగా పని చేయడం లేదని సాలిపేట, పరకొండపాడు గ్రామాల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ పులి రమేష్ అధ్యక్షతన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు పలు అంశాలను లేవనెత్తారు. ప్రధానంగా చేవూరుకు విద్యుత్ సమస్య ఉందని చేవూరు సర్పంచ్ శెట్టిపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే కర్లపాలెంలో ఇబ్బందిగా ఉన్న రెండు ప్రదేశాల్లో నాలుగు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని అనేకసార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని సర్పంచ్ చాపల రమణయ్య వాపోయారు. గుడ్లూరు మండలంలో విస్తరిస్తున్న విష జ్వరాలను అదుపుచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ఏవో రవికుమార్, ఏపీవో అబ్దుల్, పశుసంవర్ధక ప్రతినిధి గోవర్ధన్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ సాగర్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు చెన్నారెడ్డి వరమ్మ, కార్యదర్శులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తక్షణ చర్యలు చేపట్టాలని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. మండల కార్యాలయ సమావేశ మందిరంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్, ఏవో శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షులు ఉద్దాల పెంచలరావు, కంభంశెట్టి ప్రమీల, ఎంపీటీసీ సభ్యులుపాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి





అయ్యప్ప భక్తులకు బిక్ష ఏర్పాటు

సంగం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా అయ్యప్ప మాల ధరించిన భక్తులకు ప్రతిరోజు మధ్యాహ్నం పోలయ్యస్వామి ఆధ్వర్యంలో దాతల సహకారంతో భిక్ష ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం సీసాల పట్టివేత

సీతారామపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పోలంగారిపల్లిలో నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణాలపై గురువారం దాడులు నిర్వహించి 19మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ టీ లక్ష్మణస్వామి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిబ్బందితో కలిసి పొలం గారిపల్లిలో బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించి రమణయ్య వద్ద 9, వెంకటసుబ్బయ్య వద్ద 10సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మర్రిపాడులో పశువైద్య శిబిరం

సంగం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు పశువైద్యశాలలో శుక్రవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ డి సుజన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పశువైద్య శిబిరంలో లేగదూడల అందాల పోటీలు నిర్వహిచనున్నట్లు పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వర్గీకరణపై కుట్రలు దారుణం : ఎంఎస్‌పీ



జెండాను ఆవిష్కరిస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

వరికుంటపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పోరాటాలు సాగించి సాధించుకున్న ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని కుట్రలు పన్నడం దారుణమని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ అన్నారు. గురువారం గణేశ్వరాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఎమ్మార్పీస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 12న మంద కృష్ణమాదిగ నెల్లూరు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని వర్గీకరణకు మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం గ్రామ కమిటీల ఎంపిక జరిగింది. కార్యక్రమంలో ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జి తాతిపూడి డేవిడ్‌మాదిగ, నాయ కులు బకీరుజాషువా మాదిగ, బెజవాడ బాలగురవ య్య మాదిగ, ఆనందరావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి

ఉదయగిరి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా శనగ, కంది, మినుము, పెసర, మొక్కజొన్న పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయుల నాయక్ సూచించారు. గురువారం అప్పసముద్రం రైతుసేవా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు బోర్డు అనుమతించిన మేరకే పంట సాగు చేయాలన్నారు. అనంతరం సాగులో ఉన్న పంటలను పరిశీలించి సలహాలు అందజేశారు.





హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆక్రమణ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

అనంతసాగరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బొమ్మవరంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. గురువారం సిబ్బందిచే ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసి బాధ్యులకు నోటీసులు అందజేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

చేజర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఆత్మకూరు ఎమ్‌విఐ రాములు సూచించారు. గురువారం చేజర్ల మండలంలోని బోడిపాడు గ్రామ సమీపంలో ఉన్న లుంబిని విద్యాలయంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లుంబిని విద్యాలయం కరస్పాండెంట్ రమేష్ పాల్గొన్నారు.

ప్రత్యక్ష నగదు బదిలీ సేవలు వేగవంతం

ఉదయగిరి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ తపాలా కార్యాలయాల ద్వారా ఖాతాదారులకు ప్రత్యక్ష నగదు బదిలీ సేవలను వేగవంతం చేయనున్నట్లు ఉదయగిరి సబ్ డివిజన్ పోస్టల్ ఇనస్పెక్టర్ వేగూరు సాయికృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా ఆధార్‌కార్డు నెంబర్లకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) లింకును అనుసంధానం చేయడంతోపాటు లావాదేవీలు నిర్వహించక ఆగిపోయిన లింకులను పునరుద్ధరిస్తామన్నారు. కావున ఖాతాదారులు ఈనెల 14వ తేదీలోపు సమీప పోస్టాఫీసులకు వెళ్లి ఎన్‌పీసీఐ లింకును అనుసంధానం చేయించుకోవాలన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ

సీతారామపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): నైపుణ్య గణన-2024 సర్వేకి సంబంధించి ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, ఈఓపీఆర్డీ భార్గవి పాల్గొన్నారు.

● వరికుంటపాడు, (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప రిషత్ కార్యాలయంలో శుక్రవారం నైపుణ్య గణన సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రావు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతిచెందిన ఆరుగురి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 10వేల వంతున రూ. 60వేలు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి గురువారం అందజేశారు. 1వ వార్డులోని గడ్డం రమేష్ , 4వ వార్డులో తంగేళ్ల రామోహన్‌రాజు, 9వ వార్డులోని ఇంటూరు శ్రీనివాసులు, 14వ వార్డులో ఒంటేరు వెంకటసుబ్బయ్య, పఠాన్ దిల్షాద్, 19వ వార్డులో షేక్ సాధిక్ కుటుంబాలను ఆయన పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

నష్టపరిహారం పెంచి రైతులను ఆదుకోవాలి

ఆత్మకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నడికుడి-కాళహస్తి రైల్వే లైను నిర్మాణ పనులకు సంబంధించి భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం పెంచాలని అప్పారావుపాళెం రైతులు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. గురువారం ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం గ్రామంలో రెవెన్యూ అధికారులు పర్యటించారు. ఈసందర్భంగా అప్పారావుపాళెం రైతులు మాట్లాడుతూ మాగాణి భూములను మెట్ట భూములుగా రికార్డుల్లో చూపించినందున సరైన నష్టపరిహారం అందక తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులందరికీ మేలు చేకూరే నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

ఇళ్లు కట్టకుండానే నగదు స్వాహా చేశారు

● ఎంపీడీవోకు లబ్ధిదారుల మొర



ఎంపీడీవో ఎదుట వాపోతున్న లబ్ధిదారులు

ఉదయగిరి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో పక్కాగృహాలు నిర్మించకుండానే కాంట్రాక్టర్ నగదు స్వాహా చేశాడని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు గురువారం ఇన్ చార్జి ఎంపీడీవో అప్పాజీ ఎదుట వాపోయారు. కాంట్రాక్టర్ కొంతమందికి బేస్ మట్టాల వరకు ఇళ్లు నిర్మించగా, మరికొంతమందికి ఇళ్లు నిర్మించకుండానే రూ.70 వేలు స్వాహా చేశాడన్నారు. స్పందించిన ఎంపీడీవో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

కబ్జా నిజమైతే స్వాధీనం చేసుకోండి

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలి టౌన్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు ప్రభుత్వ భూమిని ఆక్రమించి లేఅవుట్లు వేసి అమ్మినట్లు నిజమైతే వాటిని స్వాధీనపరుచుకోవాల తప్ప ఇలా తనపై దుష్ప్రచారం తగదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి వాపోయారు. ఈ విషయంపై గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి వెళ్లి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. తనపై చేసే తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని సూచించారు.

తిరుమలాపురంలో గ్రామసభ

ఉదయగిరి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం గ్రామంలో గురువారం భూసర్వేపై తహసీల్దారు సుభద్ర గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో నిర్వహించిన భూ సర్వేలో నెలకొన్న సమస్యలపై రైతులు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లుబోయిన కృష్ణ, రెవెన్యూ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.